




ESTD: 1999

www.voodayam.com

# ఉదయం








సంపుటి : 27 సంచిక : 221 | హైదరాబాద్ | 14-10-2026 బుధవారం | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on


## సింగరేణి కార్మికులకు

**దసరా కానుక ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి**

# రూ.1,53,912 లాభాల వాటా

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉదయం) :** సింగరేణి బొగ్గు గని కార్మికులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా భారీ కానుకను ప్రకటించింది. లాభాల వాటా కింద ఒక్కొక్క పర్మినెంట్ ఉద్యోగికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజాభవన్‌లో మంగళవారం నాడు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను మీడియాకు తెలిపారు.ఈ నిర్ణయం ద్వారా మొత్తం 38,737 మంది శాశ్వత ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని, అలాగే 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ అందజేయనున్నట్లు డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. గత సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా సింగరేణి నికర లాభాల్లో 34 శాతాన్ని, అంటే రూ.596 కోట్లను కార్మికుల వాటాగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కోల్ బెల్ట్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, విజయరామారావు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, మంత్రి శ్రీధర్ బాబును శాలువాలతో ఘనంగా సత్కరించారు.



**సొంతింటి కల సాకారం – ప్రత్యేక కార్యాచరణ:**
కార్మికుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి భూముల్లో ఇప్పటివరకు మైనింగ్ జరగని ప్రాంతాలను గుర్తించి లేఅవుట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట 'నెహ్రూ హౌసింగ్ కాలనీ' ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి నుంచి గతంలో రెవెన్యూ శాఖకు అప్పగించిన భూముల్లో మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ పోరుబాటపై మంత్రుల మండిపాటు:**
పదేళ్ల పాటు అధికారంలో ఉండి సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. అప్పట్లో కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయారో, మారుపేర్ల సమస్యను ఎందుకు పట్టించుకోలేదో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**రాహుల్ గాంధీ తీరుపై పీయూష్ గోయల్ ధ్వజం**



## కాంగ్రెస్ హయాంలో ఎన్నికల కమిషనర్లకు లంచాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఎఎంఎస్) :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రధాన అధికారులకు పద్మ పురస్కారాలు, రాజ్యాంగ పదవులు కట్టబెట్టి ఆశ చూపించిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో ఎన్నికల కమిషనర్లు ఎల్లప్పుడూ స్వతంత్రంగానే వ్యవహరించారని మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ద్వంద్వ నీతిని, అపరిపక్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పూర్వపు ఎన్నికల కమిషనర్లకు తమ పార్టీ తరపున ఎన్నికల పోటీలో అవకాశాలు ఇచ్చారని గుర్తుచేశారు. మాజీ ప్రధాన ఎన్నికల అధికారి టీఎన్ శేషన్‌ను ఎల్‌కే అద్వాణీకి పోటీగా నిలబెట్టడం, మరో మాజీ అధికారి ఎంఎస్ గిల్ కు పద్మవిభూషణ్ బహుకరించడం వంటి చర్యలతో తమకు అనుకూలంగా ఉన్న అధికారులకు ప్రయోజనాలు చేకూర్చారని పేర్కొన్నారు. 1986లో ఆర్కే త్రివేదిని గుజరాత్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించిన ఉదాహరణను ప్రస్తావించారు. గతంలో ఎలాంటి ముందస్తు సంప్రదింపులు, చర్చలు లేకుండా ఏకపక్షంగా నియామకాలు చేపట్టిన కాంగ్రెస్ విధానానికి భిన్నంగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023లో ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని వివరించారు. ఈ నూతన చట్టం ప్రకారం ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నాయకుడికి కూడా చోటు కల్పించి పూర్తి పారదర్శకతను తీసుకొచ్చామని పీయూష్ గోయల్ వెల్లడించారు.

## కమీషన్ల కోసం నల్లజాబితా సంస్థకు కాంట్రాక్టా?

**హాస్టళ్ల సరుకుల సరఫరా స్థానిక వ్యాపారులకే ఇవ్వాలి**



**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉదయం) :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు సరుకులు సరఫరా చేసేందుకు కేటాయించిన పి.ఎం.యు (PMU) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరుకుల సరఫరా బాధ్యతలను జిల్లా కొనుగోలు కమిటీ (డి.పి.సి) ద్వారా స్థానిక వ్యాపారులకే అప్పగించాలని ఆయన సూచించారు.ప్రతి పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి స్థానిక వెండర్లకు అవకాశమిస్తేనే చిన్న తరహా వ్యాపారుల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, అలాగే విద్యార్థులకు కూడా నాణ్యమైన తాజా సరుకులు అందుతాయని స్పష్టం చేశారు. కేవలం కమీషన్ల ఆశ చూపి నల్లజాబితా (బ్లాక్‌లిస్ట్)లో ఉన్న సంస్థకు ఈ టెండర్లు కట్టబెట్టడం అత్యంత దారుణమని ఆక్షేపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పద్ధతినే తిరిగి అమలు చేయకపోతే, బాధితులు మరియు విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

## రెండు తెలుగు రాష్ట్రాల మధ్య

# రవాణా వేగానికి గ్రీన్ సిగ్నల్

**సోమశిల వద్ద కృష్ణా నదిపై అద్భుత కేబుల్ వంతెన నిర్మాణం**

**తెలంగాణ మౌలిక వసతుల రంగానికి కేంద్రం సానుకూల స్పందన**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఎఎంఎస్) :** తెలంగాణ రాష్ట్రంలో రహదారి వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ప్రయాణ సమయాన్ని తగ్గించి రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో మరో కీలక అడుగు పడింది. రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.
ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన కీలక రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, వంతెనలు, రోప్‌వేలు మరియు రైల్వే ఓవర్ బ్రిడ్జిల మంజూరుపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర ప్రతిపాదనలపై స్పందించిన కేంద్ర మంత్రి పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపడమే కాకుండా, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కేంద్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు మరియు రాష్ట్ర అధికారులు పాల్గొంటారు. ఎల్బీనగర్ - హయత్‌నగర్ మార్గానికి ఊరట: హైదరాబాద్ నగరంలో నిత్యం తీవ్ర ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎల్బీనగర్ - హయత్‌నగర్ మార్గంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. ఈ మార్గం పరిధిలోని సుమారు 54 కాలనీల్లో నివసించే 10 లక్షల మందికి పైగా ప్రజలకు, ఉద్యోగులకు, విద్యార్థులకు ఈ నిర్ణయంతో ప్రయాణ కష్టాలు తొలిగిపోనున్నాయి.

**హైదరాబాద్ – విజయవాడ – మచిలీపట్నం రహదారి విస్తరణ:**
నిత్యం వాహన రద్దీ, ప్రమాదాలతో కూడుకున్న హైదరాబాద్ - విజయవాడ - మచిలీపట్నం 6+2 లేన్ల రహదారి విస్తరణ పనులకు వచ్చే ఏడాది జనవరి నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఈ ఏడాది నవంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు.
సోమశిల వద్ద కేబుల్ వంతెన: కృష్ణా నదిపై సోమశిల నుండి సంగమేశ్వరం మధ్య ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మాణ శంకుస్థాపనకు కేంద్ర మంత్రి అంగీకరించారు. దీనివల్ల తిరుపతి వెళ్లే భక్తులకు సుమారు 80 కిలోమీటర్ల దూరం, 3 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది.రోప్‌వేలు మరియు రైల్వే
వంతెనలు: పర్వతమాల పథకం కింద రాష్ట్రంలో పర్యాటకరంగానికి ఊతమిచ్చేలా 5 కొత్త రోప్‌వేల ఏర్పాటుకు, సేతు బంధన్ పథకం కింద 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీ) నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్షాల ఐక్యపోరాటం

**ఓట్ల చోరీపై రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది: రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఎఎంఎస్) :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు ప్రతిపక్షాల ఐక్య కూటమి, పౌరసమాజ భాగస్వామ్యంతో కలిసి సుదీర్ఘ పోరాటం చేస్తామని నాయకులు ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో ప్రజల మద్దతుతో విజయం సాధించడం ఖాయమని భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విశ్వాసం వ్యక్తం చేశారు. రాజధానిలోని తన నివాసంలో విపక్షాల కూటమి ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై తేనీటి విందు ఇచ్చారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అక్రమాలకు పాల్పడి ఓట్ల చోరీకి పూనుకున్న వారిని చట్టం ముందు నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం, ప్రధాన న్యాయమూర్తి, న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, వారు తమ రాజ్యాంగబద్ధ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీసే ప్రయత్నం చేసేవారు ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తదితరుల చుట్టూ చట్టపరమైన చర్యల ఉచ్చు బిగుస్తోందని ఆరోపించారు. దేశంలో జరుగుతున్న ఈ ఆందోళనలు కేవలం కేవలం రాజకీయ పార్టీల విజ్ఞప్తి మాత్రమే కాదని, అది ప్రజల ఆక్రోశమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణే ఏకైక లక్ష్యంగా ప్రతిపక్షాలన్నీ ఒకే తాటిపైకి వచ్చి ముందుకు సాగుతున్నాయని పునరుద్ఘాటించారు.

## సీజేపీ నేతల ముందస్తు అరెస్టు

**న్యూఢిల్లీ:** శాంతిభద్రతల పరిరక్షణ, వరుస ఆందోళనల దృష్ట్యా జంతర్ మంతర్ ప్రాంతాన్ని ధర్నాలు, నిరసన వేదికల జాబితా నుంచి తొలగిస్తూ రాజధాని పోలీసు విభాగం అధికారిక ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో ఎటువంటి బహిరంగ సమావేశాలు, ధర్నాలు నిర్వహించడానికి వీల్లేదని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ, నిబంధనలను పక్కనపెట్టి మంగళవారం అక్కడ ఆందోళనకు ప్రయత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు గానూ సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య శిందేలను ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ పరిణామాలకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో పంచుకున్నారు.

## ప్రదేశాల పేర్లపై చైనా వాదన చెల్లదు

**న్యూఢిల్లీ:** లద్దాఖ్ పరిధిలోని 28 ముఖ్యమైన వ్యూహాత్మక, భౌగోళిక ప్రాంతాలకు ప్రామాణిక నామకరణం చేస్తూ భారతదేశం తీసుకున్న నిర్ణయాన్ని పొరుగు దేశమైన చైనా విమర్శించడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. లద్దాఖ్ ప్రాంతం ఎల్లప్పుడూ భారతదేశంలో విడదీయరాని అంతర్భాగమని, చైనా చేసే అసంబద్ధ వ్యాఖ్యలు ఈ చారిత్రక వాస్తవాన్ని ఏమాత్రం మార్చలేవని కేంద్ర విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. అంతకుముందు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ ఒక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా తమ దేశం ఎన్నడూ అంగీకరించలేదని, అక్కడ ప్రదేశాలకు పేర్లు నిర్ణయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, ఆ ప్రాంతాలు తమకే చెందుతాయని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చైనా వ్యక్తం చేసిన ఈ అభ్యంతరాలపై భారతదేశం ఘాటుగా స్పందించింది. భారతీయ సర్వేక్షణ విభాగం (సర్వే ఆఫ్ ఇండియా) అధికారిక పటాల ఆధారంగానే లద్దాఖ్‌లోని ప్రదేశాలను సరిగ్గా గుర్తించేందుకు, ప్రజలకు వాటిపై సరైన స్పష్టతనిచ్చేందుకే ఈ నామకరణ ప్రక్రియ పూర్తి చేశామని రణ్‌ధీర్ జయస్వాల్ ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.






## ఇంతే కదా...!




# పార్టీ సేవ కోసం పదవిని త్యాగం



**కేంద్ర మంత్రి పదవికి ఎల్. మురుగన్ రాజీనామా**

**తమిళనాడులో పార్టీ బలోపేతానికే ప్రాధాన్యం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఎఎంఎస్) :** కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి, రాజ్యసభ సభ్యుడు ఎల్. మురుగన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించారు. తమిళనాడు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ విస్తరణ, బలోపేతం కోసం పూర్తి సమయాన్ని వెచ్చించాలని నిర్ణయించుకున్నట్లు ఆ లేఖలో ఆయన వివరించారు. ఒక సాధారణ కార్మిక కుటుంబం నుంచి వచ్చిన తనకు కేంద్ర మంత్రిమండలిలో అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశానికి సేవ చేయడం దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని మురుగన్ పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంతో పాటు సొంత ప్రాంత ప్రజలకు చేరువ కావాలని, పార్టీ శ్రేణులతో కలిసి నేరుగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులో పార్టీ పునాదులను మరింత బలోపేతం చేయడమే తన తదుపరి లక్ష్యమని ప్రధానికి రాసిన లేఖలో ఆయన వెల్లడించారు.

# ప్రజావాణి పేరుకే.. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం!

- అధికారుల గైర్హాజరీతో ప్రజలకు తప్పని నిరాశ.. దరఖాస్తులు ఇచ్చినా పట్టించుకోని వైనం!

**కోహీర్, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం నామ మాత్రంగా మారుతోందని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధికారుల గైర్హాజరీ, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆరోపిస్తున్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో 25 శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించాల్సి ఉంది. అయితే వ్యవసాయ శాఖతో పాటు పలు కీలక శాఖల అధికారులు తరచూ హాజరుకావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెవెన్యూ, విద్యుత్, ఇందిరమ్మ హౌసింగ్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తున్నప్పటికీ, వాటి పరిష్కారంలో తగిన పురోగతి



కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాకపోతే కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వ్యవసాయ అవసరాలకు సరిపడా విద్యుత్ అందక రైతులు అవస్థలు పడుతున్నారని చెబుతున్నారు.
సకాలంలో యూరియా, డీఏపీ వంటి ఎరువులు అందకపోవడం కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాదుంప సాగు తగ్గడం, పెట్టుబడుల భారం పెరగడం వంటి సమస్యలతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజావాణి కేవలం దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా మారాలని కోరుతున్నారు.

# కొల్లూరులో అధ్వానంగా మ్యాన్‌హోళ్ల పరిస్థితి.. పట్టించుకునే వారేరీ?

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 13)**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు గ్రామంలో మ్యాన్‌హోళ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. గత 8, 10 నెలలుగా సమస్య ఇలాగే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, మ్యాన్‌హోళ్ల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరోవైపు డ్రైనేజీ పొంగిపొర్లడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్ప



టికైనా తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ స్పందించి, మ్యాన్‌హోళ్ల మరమ్మతులతో పాటు డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# గ్రామాభివృద్ధికి వి.బి.జి. రామ్‌జీ పథకం దోహదం

- పాఠశాలల భద్రతకు ప్రహరీ గోడలు ఎంతో అవసరం
- కొనాయపల్లి సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్

**దౌల్తాబాద్ అక్టోబర్ 13(వుదయం):**

గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ పథకాలు ఎంతగానో దోహదపడతాయని కొనాయపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వి.బి.జి.రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులతో ప్రజలకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల అవసరాలను గుర్తించి పనులు చేపట్టడం ద్వారా పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించవచ్చని తెలిపారు. కొనాయపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ(కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించడం వల్ల విద్యార్థుల భద్రతకు రక్షణ లభిస్తుందని, పాఠశాల ఆవరణలోకి పశువులు, ఇతర జంతువులు రాకుండా అడ్డుకోవచ్చని వివరించారు. పాఠశాల పరిసరాలను



పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు సురక్షితమైన విద్యావాతావరణాన్ని కల్పించేందుకు ఈ నిర్మాణం ఉపయోగపడుతుందని చెప్పారు.

**గ్రామాల అవసరాలే ప్రాధాన్యం**

గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరయ్యే నిధులను సద్వినియోగం చేసుకుని, పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.

**ఉపాధి అవకాశాలకు ఊతం**

గ్రామీణ ప్రాంతాల్లో పథకం నిబంధనలకు అనుగుణంగా చేపట్టే పనులు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడతాయని ఆయన అన్నారు. అభివృద్ధి పనుల వల్ల గ్రామాల్లో సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. ప్రతి పనిని పారదర్శకంగా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేసి గ్రామానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కొనాయపల్లి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు స్వామి గౌడ్, కురుమ స్వామి, గ్రామస్థులు సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

**నిందితులను వెంటనే అరెస్టు చేయాలి. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి.**

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలంమెదక్ పట్టణంలోని వెల్కమ్ బోర్డు సమీపంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.అలాంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సమాజం తలదించుకోవాల్సిన విషయమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.విగ్రహం సమీపంలో నాలుగు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, అలాంటి కెమెరాలు పనిచేయకపోతే నేర పరిశోధనకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు.ఘటన జరిగిన తర్వాత కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించడం కాకుండా ముందుగానే వాటి పని తీరును పరిశీలించాలని సూచించారు. ఈ విషయంలో పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయా



లని అన్నారు.చాకలి ఐలమ్మ విగ్రహాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహనీయుల విగ్రహాలకు తగిన భద్రత కల్పించడంతో పాటు, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ విగ్రహ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

# వినూత్న ఆలోచన.. అమ్మవారి మండపము వద్ద ఐపీఎస్ అధికారుల ఫ్లెక్సీ

- దేవి శరన్నవరాత్రి మండపంలో 12 మంది పోలీసు అధికారుల చిత్రాలు
- ఆధ్యాత్మికతతో పాటు సామాజిక చైతన్యానికి పెద్దపీట..
- యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ వినూత్న ప్రయత్నం

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 13, వుదయం:**

పండుగలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా.. సమాజానికి మంచి సందేశాన్ని అందించే వేదికలుగా మారాలన్న ఆలోచనకు దుబ్బాక పట్టణంలోని యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కార్యరూపం ఇస్తున్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటా వినూత్న రీతిలో మండపాన్ని ఏర్పాటు చేస్తూ భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. ఈసారి తెలంగాణలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్న 12 మంది ఐపీఎస్ అధికారుల చిత్రాలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.ఏటా ఓ ప్రత్యేక సందేశందుబ్బాక పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయంటే యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసే మండపాన్ని సందర్శించేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. గత కొన్నేళ్లుగా ప్రతి సంవత్సరం ఓ వినూత్న ఆలోచనతో మండపాన్ని అలంకరిస్తూ, ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసే ఫ్లెక్సీల ద్వారా




ప్రజలకు కీలక సందేశాలను అందిస్తున్నారు. గతంలో హెల్మెట్ వినియోగం, ఓటు హక్కు ప్రాధాన్యం, డ్రగ్స్ నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేసి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. పోలీసు సేవలకు గుర్తింపుగా..ఈ ఏడాది మరో అడుగు ముందుకేసి తెలంగాణలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 12 మంది ఐపీఎస్ అధికారుల చిత్రాలను మండపం వద్ద ఏర్పాటు చేశారు. డ్రగ్స్ నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల నియంత్రణ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, మూఢనమ్మకాలపై అవగాహన వంటి అంశాల్లో పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా ఈ ఫ్లెక్సీని రూపొందించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న పోలీసు అధికారుల సేవలను గుర్తించడం ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.ఆధ్యాత్మికతతో పాటు సామాజిక చైతన్యం దేవి మండపానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఫ్లెక్సీపై ఉన్న పోలీసు అధికారుల చిత్రాలు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సేవా రంగాలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. భక్తిభావాన్ని పెంపొందించే ఉత్సవాల్లో సమాజానికి ఉపయోగపడే అంశాలకు చోటు కల్పించడం ద్వారా యువతలో సామాజిక స్పృహను పెంపొందించవచ్చని అసోసియేషన్ సభ్యులు తమ కార్యక్రమంతో చాటిచెబుతున్నారు. పట్టణంలో ప్రత్యేక చర్చవినూత్న ఆలోచనతో రూపొందించిన ఈ మండపం ప్రస్తుతం దుబ్బాక పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పలువురు వచ్చి మండపాన్ని సందర్శిస్తూ అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాల నిర్వహణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్న యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులను భక్తులు, పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. పండుగ వేదికను సామాజిక సందేశాల ప్రచారానికి వినియోగిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఈ ప్రయత్నం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# రైతు డిస్కంతో ఉచిత విద్యుత్‌కు ముప్పు!

- జీఓ 17తో రైతులకు నష్టమే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా పట్టింపేదీ? బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు రహీమొద్దీన్

**దౌల్తాబాద్, అక్టోబర్ 13 (వుదయం):**




రైతు డిస్కం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 17 పై బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్ మండిపడ్డారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వం. కొత్త డిస్కం ఏర్పాటుతో ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా పట్టించుకునే నాథుడే లేరని, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త డిస్కం ఏర్పాటు చేస్తే రైతుల కష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు.
వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని రహీమొద్దీన్ పేర్కొన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాల్సింది పోయి, కొత్త విధానాలతో మరిన్ని సమస్యలు సృష్టించడం సరికాదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు సకాలంలో మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. రైతులకు ఉచిత విద్యుత్ పథకం యథావిధిగా కొనసాగుతుందనే భరోసాను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు మేలు చేసేలా ఉండాలే తప్ప, వారి మీద అదనపు భారం మోపేలా ఉండకూడదని రహీమొద్దీన్ అన్నారు. జీఓ 17 అమలుతో ఉచిత విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని, విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆదిశిలా క్షేత్రానికి 'రాజబాట'!

- దేవరగట్టు రహదారి పనులకు శంకుస్థాపన
- బ్రహ్మోత్సవాల వేళ భక్తుల ప్రయాణ కష్టాలకు చెక్
- శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**మల్దకల్ అక్టోబర్ 13 (వుదయం బ్యూరో)**



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి క్షేత్రంలో కీలక ఘట్టం చోటుచేసు కుంది. ఏళ్ల తరబడి భక్తులను వేధిస్తున్న దేవరగట్టు ప్రయాణ కష్టాలకు చెక్ పెడుతూ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పనులను ప్రారంభించారు. ఉత్సవాల నాటికి రోడ్డు అందుబాటులోకి వస్తే భక్తుల రవాణా తిప్పలు పూర్తిగా తొలగిపోనున్నాయి. వివరణాత్మక వార్తా పాఠం (కామన్ బాడీ) స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు: రహదారి పనుల ప్రారంభోత్స వానికి ముందు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహ న్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, అర్చక బృందం పూర్ణ కుంభంతో స్వాగతం పలకగా, వేద పండితులు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు.భక్తులకు ఇబ్బంది కలగనివ్వం: ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు దేవరగట్టుకు సులభంగా చేరుకుని స్వామివారిని దర్శించుకునేలా రవాణా వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. పుణ్యక్షేత్రాల సర్వాంగీణ వికాసానికి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.హాజరైన ప్రముఖులు: ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, సీనియర్ నాయకులు సత్యారెడ్డి, సీతారాంరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, వాల్మీకి పూజారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రమదోపిడీకి చెక్.. 'స్వేచ్ఛా రథం'తో చైతన్యం

- వెట్టిచాకిరీ నిర్మూలనే లక్ష్యం: అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు

**గద్వాల అక్టోబర్ 13 (వుదయం కరస్పాండెంట్ )**

జిల్లాలో వెట్టిచాకిరీని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఐడీఓసీ ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రస్థాయి 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు హక్కులపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో వెట్టిచాకిరీ



ఘటనలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బాధితులను గుర్తించి విముక్తి కల్పించడంతోపాటు అవసరమైన సహాయం, పునరావాసం అందిస్తామని తెలిపారు. బలవంతపు శ్రమ, బెదిరింపులు, శ్రమదోపిడీ ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.వెట్టిచాకిరీ ఘటనలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి హెల్ప్‌లైన్ 08069434343కు సమాచారం అందించాలని కోరారు. కళాకారుల ప్రదర్శనల ద్వారా గ్రామ గ్రామాన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్, డీడబ్ల్యూఓ సునంద, డీఈఓ విజయలక్ష్మి, కళాకారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలెం వెంకన్న ఆలయంలో దుర్గామాత పూజలు



**బిజినపల్లి, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి)**

: మండలంలోని పాలెం శ్రీ అలివేల మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారి పూజలను ఫ్రెండ్స్ యూత్, శ్రీ పద్మావతి మాతృమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అమ్మవారిని శ్రీ గౌరీదేవి మాతగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం నిత్యపూజలు, అభిషేక కార్యక్రమాలను పండితులు జయంత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన అనంతరం బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.
కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారుఈ కార్యక్రమంలో జి. వెంకటేష్, వినయ్ కుమార్, అఖిలేష్, ఎస్. నరసింహ, మురళి, అక్షయ్ సాయి, సాయి, నితీష్, మాతృమండలి సభ్యులు శారద, మంజుల, రాజేశ్వరి, రజిత, పుష్పలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో అప్రమత్తత అవసరం!

**బిజినపల్లి, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):**

దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి పండుగ విషాదంగా మారవద్దని బిజినపల్లి ఎస్సై శంషుద్దీన్ సూచించారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువలు, బావులు, ఈత కొలనుల వద్ద పిల్లలను ఒంటరిగా వదలొద్దని, నీటి లోతు తెలియని ప్రాం



తాల్లోకి దిగవద్దని తెలిపారు.ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కు దూరంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉంటూ దసరా, బతుకమ్మ పండుగలను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# రీలొకేషన్ వద్దు.. స్వగ్రామమే ముద్దు!

**అచ్చంపేట, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):**

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. రీలొకేషన్ పేరుతో తమ గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని, కనీస మౌలిక సదుపాయాలను కూడా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు.హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి 765పై వటవర్లపల్లి వద్ద వందలాది మంది గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి "రీలొకేషన్ వద్దు.. మా గ్రామమే ముద్దు", "గ్రామాభివృద్ధి కావాలి" అంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.అభివృద్ధి పనులకు అడ్డంకులు: స్థానిక ఎమ్మెల్యే చొరవతో మంజూరైన నూతన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారని, ఆశ్రమ పాఠశాల ప్రహరీ గోడ, వాటర్ ట్యాంక్ వంటి ప్రభుత్వ పనులను చేయవద్దంటూ కాంట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు భయభ్రాంతులకు గురి చే



స్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సొంత ఇళ్ల నిర్మాణానికి తెస్తున్న ఇసుక, కంకర లారీలను గ్రామంలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, చిరు వ్యాపారాలపై నా ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు.రీలొకేషన్ పేరుతో కొంతమందిని భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి తరలించే ప్రయత్నం చేస్తున్నారని, "మేము ఇక్కడే పుట్టాము, ఇక్కడే పెరిగాము, ఇక్కడే చస్తాము.
స్వగ్రామాన్ని విడిచి వెళ్లే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు. ప్రభుత్వం అభివృద్ధి పనులు మంజూరు చేస్తే అటవీశాఖ అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.అటవీశాఖ వైఖరిని మార్చుకోవాలని, అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగించాలని, తరలింపు ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ రాస్తారోకోలో మాజీ సర్పంచ్ లు చత్రు నాయక్, సర్యా నాయక్, వార్డు సభ్యులు చిట్టెమ్మ, మౌనిక, వెంకటపతి, మాజీ వార్డు సభ్యులు సాలమ్మ, భరత్, రమేష్, గ్రామ పెద్దలు ఇమ్మడి కిష్టయ్య, కాశయ్య, భవాని, సత్తి, అంజయ్య, కృష్ణా నాయక్, రత్యా నాయక్, మహిళా సంఘాల నాయకులు జ్యోతి, అనసూయ, ఈదమ్మ, యువకులు ప్రభాకర్, అనిల్, అఖిల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీ సైకిల్ స్టోర్ యజమాని మహమ్మద్ గౌస్ మృతి

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, ఎంజీ సైకిల్ స్టోర్ యజమాని మహమ్మద్ గౌస్ మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు.
వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ మంచి పేరు సంపాదించుకున్న గౌస్ మృతి పట్ల ముస్లిం మైనార్టీ సంఘాలు, జనరల్ మర్చంట్ అసోసి



యేషన్ బాధ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# బీసీలకు రాజ్యాధికారం: మల్లన్న పాదయాత్ర

**బిజినపల్లి, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):**

మంగళ వారం బిజినపల్లి మండల కేంద్రంలోని బీసీ ఆఫీస్ లో బీసీ సంఘం మండల అధ్యక్షుడు వేముల సత్యశీల సాగర్ అధ్యక్షతన ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ కమిటీ చైర్మన్ అంతటి రాజేందర్ గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు దాసర్ల వెంకటస్వామి, అధ్యక్షుడు వేముల సత్యశీల సాగర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, జెండాలు మోయడానికి, ఫ్లెక్సీలు కట్టడానికి, మీటింగులకు జనాన్ని తరలించడానికి, ఓటర్ల నమోదు, పోలింగ్ ఏజెంట్లుగా, గెలిచాక ర్యాలీలు, డోల్లు, చిందుల వరకు బహుజనులనే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బహుజనులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ



వర్గాలకు సామాజిక గౌరవం, సమాన హక్కులు, విద్య, ఉద్యోగాలు, వైద్యం, హాస్టళ్లు, సాగు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారం కోసం బీసీలకు రాజ్యాధికారం రావాలని, బీసీ ముఖ్యమంత్రి కావాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ పాదయాత్ర అక్టోబరు 15న గురువారం ఉదయం 11 గంటలకు బిజినపల్లికి వస్తుందని తెలిపారు.
ఈ పాదయాత్రకు బీసీ సంఘం సంఘీభావం తెలుపుతోందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, యువకులు, మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, విద్యార్థి సంఘాల నాయకులు, పాత్రికేయులు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అతినారపు బాల లక్ష్మయ్య, ఉప్పనమోని శ్రీను, అప్పలి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## గాంధీనగర్‌లో ఘనంగా ఆరోసారి బతుకమ్మ సంబరాలు



- ఆంధ్రా కేఫ్ చౌరస్తాలో అక్టోబర్ 16న వేడుకలు.. డివిజన్ మహిళలకు బీజేపీ నేతల ఆహ్వానం

**ముషీరాబాద్, అక్టోబర్ 13(వుదయం)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గాంధీనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గాంధీనగర్ బతుకమ్మ సంబరాలను ఈ ఏడాది ఆరోసారి మరింత వైభవంగా నిర్వహించనున్నట్లు డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్ తెలిపారు.మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో మహిళా మోర్చా నాయకులు, బతుకమ్మ సంబరాల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ నెల 16న బతుకమ్మ సంబరాలుఈ నెల 16వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గాంధీనగర్ డివిజన్‌లోని ఆంధ్రా కేఫ్ చౌరస్తాలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రముఖ నాయకులు,

సెలబ్రిటీలు ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జయవంతం చేయాలని కోరారు.గాంధీనగర్ డివిజన్ మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరూ ఈ సంబరాలకు హాజరై వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు ప్రత్యేక ఆహ్వానం పలికారు.ఈ సమావేశంలో మహిళా మోర్చా నాయకులు సంధ్యారాణి, మంగమ్మ, సంయుక్త రాణి, అనుష, లక్ష్మి, బీజేపీ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**శంకర్ పల్లి అక్టోబర్ 13 (వుదయం)**

శంకర్‌పల్లి మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మంగళవారం పంపిణీ చేశారు. మొత్తం 28 మంది లబ్ధిదారులకు రూ.28,00,448 విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం *తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో భారంగా మారుతుందని అన్నారు.అలాంటి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కల్యాణ



లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు అమలు చేయబడుతున్నాయని తెలిపారు. ఈ పథకాలు అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేయాలని తెలిపారు.ప్రజల సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి. తహసిల్దార్ సురేందర్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు అఖిల యాదిరెడ్డి, లలితా మోహన్ రెడ్డి, ఆనంద్, పలు గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## బీరంగూడలో వైభవంగా దేవి నవరాత్రులు



- అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**అమీనాపూర్ అక్టోబర్ 13: వుదయం**

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో దుర్గామాత అమ్మవారి శరన్నవరాత్రి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కాలనీ నిర్వాహకులతో కలిసఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## శాకంబరీగా అన్నపూర్ణా దేవి దర్శనం

- ఘనంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు మూడవరోజు భక్తి శ్రద్ధలతో అన్నపూర్ణాదేవి ప్రత్యేక పూజలు

**•అమీనాపూర్ అక్టోబర్ 13, వుదయం**

అమీనాపూర్ , బీరంగూడ పరిధిలోని శ్రీ రాధాకృష్ణ ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజున అమ్మవారు శ్రీ అన్నపూర్ణా మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పచ్చటి కూర



గాయలతో అత్యంత నయనానందకరంగా శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి శాస్త్రోక్తంగా అర్చనలు, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు, అమ్మవారి కృపకు పాత్రులు అయ్యేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూజా కార్యక్రమ ఏర్పాట్లను ప్రముఖులు రాజ వర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పాండురంగారెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దాసరి కరుణాకర్ రెడ్డి ప్రతిరోజూ పూజల్లో పాల్గొంటూ అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక సంకీర్తనలతో, భక్తుల జయజయధ్వానాలతో మార్మోగుతూ భక్తిభావం సంతరించుకుంది.

## రైతులకు నిరంతర విద్యుత్ అందించేందుకు చర్యలు



**జిన్నారం అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మండలం సోలక్‌పల్లి గ్రామంలోని పంట పొలాలను పటాన్‌చెరు విద్యుత్ డివిజనల్ అధికారి భాస్కరరావు, గుమ్మడిదల ఏడీఏ దుర్గాప్రసాద్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో సమావేశమై వ్యవసాయానికి అందుతున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. బోరుబావుల ద్వారా పంటలకు అందుతున్న విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటం, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై అధికారులు దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు రైతులు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆందోళన

- ఎన్ఎస్‌యూఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండీ సమీరుద్దీన్ హెచ్చరిక

**చేవెళ్ల,అక్టోబర్ 13 (వుదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రకటించిన దసరా సెలవులను అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్ఎస్‌యూఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండీ సమీరుద్దీన్ డిమాండ్ చేశారు.సెలవుల సమయంలో తరగతులు నిర్వహించేందుకు ప్రయత్నించే విద్యాసంస్థల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.మంగళవారం విడుదల చేసిన ప్రకట




నలో ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకునే అవకాశం కల్పించాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడంలో ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడూ ముందుంటుందని సమీరుద్దీన్ స్పష్టం చేశారు.ప్రభుత్వ సెలవులను యథావిధిగా అమలు చేసి, విద్యార్థులకు పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునే అవకాశం కల్పించాలని ఆయన విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు.

## మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



**జిన్నారం అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో అధికారులు మహిళా ప్రజా ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, కమిషనర్ తాన్య ఆధ్వర్యంలో మహిళలు తిరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రాంగణంలో సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ విశిష్టత ను చైర్ పర్సన్ కమిషనర్ కొనియాడారు. ప్రకృతిలో పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని పేర్కొంటూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా ప్రజా ప్రతినిధులు మహిళలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీపతి గూడెంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**జిన్నారం అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారు మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు లక్ష్మీపతి గూడెంలో మంగళవారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ పాల్గొని లబ్ధిదారులకు నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని, కొత్త కార్డులు వాటర్ ప్రూఫ్ తో పాటు పలు భద్రతా ఫీచర్లు, క్యూఆర్ కోడ్తో ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడం జరుగుతుందన్నారు. సన్నబియ్యం పథకం ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గద్దె గణేష్, ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్, మహిళా లబ్ధిదారులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అమాంతంగా ఆస్తుల పెరుగుదలెలా?!

**హైదరాబాద్**

రాజకీయాల్లోకి వచ్చేముందు సాధారణ జీవితం.. ఆ తర్వాత ఒక్కసారిగా కోట్లకు పడగలెత్తే ఆస్తులు! ఎన్నికల అఫిడవిట్లలో కనిపించే ఆస్తుల వివరాలను వరుసగా పరిశీలిస్తే ఒక ప్రశ్న తప్పకుండా తలెత్తుతుంది. ప్రజాసేవకు వచ్చిన రాజకీయ నాయకుల సంపద ఇంత వేగంగా ఎలా పెరుగుతోంది? ఐదేళ్లలో ఒకరి ఆస్తి రెట్టింపు కావడం.. పదేళ్లలో పలుమార్లు పెరగడం.. కుటుంబ సభ్యుల పేర్లపై భూములు, కంపెనీలు, వ్యాపారాలు విస్తరించడం సాధారణ పరిణామంగా మారితే, రాజకీయ పదవి ఆదాయానికి మార్గమా? లేక అధికారం సంపదను సృష్టించే వ్యవస్థగా మారిందా?ఇది ఒక్క పార్టీకి, ఒక్క రాష్ట్రానికి పరిమితమైన ప్రశ్న కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమయంలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లలో స్థిరాస్తులు, చరాస్తులు, పెట్టుబడులు, కంపెనీల్లో వాటాలు, బ్యాంకు నిల్వలు, అప్పులు వంటి వివరాలు వెల్లడవుతాయి. ఒక ఎన్నిక నుంచి మరో ఎన్నికకు ఈ సంఖ్యల్లో వచ్చే మార్పు రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి ఆర్థిక ప్రయాణానికి ఒక అద్దంలా నిలుస్తుంది. అయితే ఆ అద్దంలో కనిపించేది మొత్తం కథ కాదు. ఆస్తుల విలువ పెరగడం, కొత్త ఆస్తులు కొనడం రెండూ ఒకటే కాదు. భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల కూడా సంపద పెరిగినట్టు కనిపించవచ్చు. కానీ ఆదాయానికి మించిన ఆస్తుల సమీకరణ కనిపించినప్పుడు మాత్రం అనుమానం సహజమే.రాజకీయ నాయకుడి సంపద పెరగడాన్ని తప్పనిసరిగా అవినీతితో ముడిపెట్టడం కూడా సరికాదు. రాజకీయాల్లోకి రాకముందే వ్యాపారాలు, వ్యవసాయం, పరిశ్రమలు, కుటుంబ ఆస్తులు ఉన్నవారు ఉంటారు. వాటి విలువ పెరగడం సహజం. వారసత్వంగా వచ్చిన ఆస్తులు కూడా ఉంటాయి. పెట్టుబడుల ద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అందుకే ఆస్తులు పెరిగాయనే ఒక్క కారణంతో అవినీతి జరిగిందని తీర్పు చెప్పలేం. కానీ అధికా



రంలో ఉన్న కాలంలో ఆదాయం, ప్రకటించిన వనరులు, ఆస్తుల పెరుగుదల మధ్య సంబంధం కనిపించకపోతే మాత్రం ప్రజాస్వామ్యానికి అది తీవ్రమైన ప్రశ్న.

ఇక్కడ అసలు సమస్య ఆస్తులు పెరగడం కాదు.. ఆస్తులు ఎలా పెరిగాయన్నది. ఒక ప్రజాప్రతినిధి తన సంపద పెరుగుదలకు స్పష్టమైన లెక్క చెప్పగలగాలి. వ్యాపారం ద్వారా వచ్చిందా? వారసత్వంగా వచ్చిందా? భూముల విలువ పెరగడం వల్ల పెరిగిందా? పెట్టుబడుల ద్వారా సంపాదించిందా? లేక అధికార ప్రభావంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆర్థిక ప్రయోజనాలు పొందిందా? ఈ ప్రశ్నలకు సమాధానం ఉంటే సంపదపై అనుమానాలకు తావుండదు.మరో సున్నితమైన అంశం కుటుంబ ఆస్తులు. ఒక నాయకుడి పేరుతో ఉన్న ఆస్తులనే కాకుండా భార్య, పిల్లలు, బంధువుల పేర్లపై ఉన్న ఆస్తుల పరిణామాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులకు స్వతంత్ర వ్యాపారాలు ఉండటం తప్పు కాదు. కానీ రాజకీయ అధికారానికి సమీపంగా ఉన్న కుటుంబ సభ్యుల వ్యాపారాలు, భూములు, పెట్టుబడులు అసాధారణంగా విస్తరిస్తే సహజంగానే ప్రశ్నలు తలెత్తుతాయి. ఆ ప్రశ్నలను రాజకీయ ప్రత్యర్థుల ఆరోపణలుగా కొట్టిపారేయడం కాకుండా పారదర్శకమైన వివరాలతో సమాధానం ఇవ్వడం ప్రజా జీవితంలో ఉన్నవారి బాధ్యత.ఇదే సందర్భంలో బినామీ ఆస్తుల అనుమానాలు కూడా చర్చకు వస్తాయి. ఒక నాయకుడి అధికారిక ఆస్తులు పరిమితంగానే కనిపిస్తున్నా, అతనికి సన్నిహితులైన వ్యక్తులు ఒక్కసారిగా భారీగా ఆస్తులు కూడబెట్టినప్పుడు దర్యాప్తు సంస్థలు నిజానిజాలను పరిశీలించాల్సిందే. అయితే అనుమానం ఆధారంగా ఎవరినీ దోషిగా తేల్చడం సరికాదు. ఆరోపణకు ఆధారం.. దర్యాప్తుకు స్వతంత్రత.. నిర్ణయానికి చట్టబద్ధమైన ప్రక్రియ——ఈ మూడు ఉండాలి.ప్రస్తుత వ్యవస్థలో ఎన్నికల అఫిడవిట్ ఒకసారి దాఖలు చేసి మిగిలిపోవడం సరిపోదు. ఆస్తులపై నిరంతర పారదర్శకత అవసరం. ఎన్నికల ముందు ప్రకటించిన ఆస్తులు, పదవీకాలంలో జరిగిన మార్పులు, ఆదాయపు పన్ను వివరాలు, కంపెనీల్లో వాటాలు, కుటుంబ వ్యాపార ప్రయోజనాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించే వ్యవస్థ ఉండాలి. ప్రజాప్రతినిధి ఆస్తులు అసాధారణంగా పెరిగితే ఇంకోవైపు ప్రజల పాత్ర కూడా కీలకమే. ఎన్నికల సమయంలో అభ్యర్థి కులం, పార్టీ, ప్రాంతం, వ్యక్తిగత ప్రభావం మాత్రమే కాకుండా అతని ఆస్తుల వివరాలను కూడా పరిశీలించే రాజకీయ సంస్కృతి రావాలి. ఐదేళ్లలో ఆస్తులు ఎంత పెరిగాయి? ఆదాయం ఎంత? అప్పులు ద్రోహం. రాజకీయ పదవి సంపదకు మెట్లదారి కాకుండా ప్రజాసేవకు బాధ్యతగా కాదు.. ఎలా సంపాదించారు? ఎంత సంపాదించారు? ఆ సంపదకు లెక్క ఉందా? అన్నదీ ఓటరు ప్రశ్నించాలి.రాజకీయ నాయకుల ఆస్తులపై అనుమానాలు తొలగాలంటే ప్రకటనలు సరిపోవు.. పూర్తి పారదర్శకత కావాలి. విచారణలు రాజకీయ ప్రతీకారానికి ఆయుధాలు కాకూడదు; నిజానిజాలను వెలికితీసే స్వతంత్ర వ్యవస్థగా పనిచేయాలి. ప్రజల ఓటుతో వచ్చిన అధికారానికి ప్రజల ముందే ఆర్థిక జవాబుదారీతనం ఉండాలి. ఎందుకంటే ప్రజల డబ్బుతో నడిచే వ్యవస్థలో ప్రజాప్రతినిధుల సంపదకు కూడా ప్రజలకే లెక్క చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాల్లోకి వచ్చి కోటీశ్వరులు కావడం గొప్ప కాదు.. కోట్లు వచ్చినా ఒక్క రూపాయి లెక్క కూడా దాచాల్సిన అవసరం లేకపోవడమే నిజమైన ప్రజాసేవకు కొలమానం.

## రంగారెడ్డి బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

**రంగారెడ్డి జిల్లా**

కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి మరియు అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి గార్ల సమక్షంలో ఈరోజు రంగారెడ్డి జిల్లా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించడం జరిగిందని పేర్కొన్న రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని తెలిపారు. మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, బతుకమ్మ వేడుకల్లో అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి గారు మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీన టీజీఓ భవన్, నాంపల్లి, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 15వ తేదీన రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వైభవాన్ని చాటుతూ, బతుకమ్మ పండుగ వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని మహిళా ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని,బతుకమ్మ పండుగ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి, కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శ్రీమతి శాంతిశ్రీ గారితో పాటు డి. సైదమ్మ, బాలేశ్వరి, రాణి, రాకేష్, మహేష్, ఐశ్వర్య, స్వప్న, సంధ్య, జ్యోత్స్న, ప్రమీల, లావణ్య, స్వాతి, పద్మాంజలి, సమంత, శ్రీదేవి, మైతిలి, రాజ్యలక్ష్మి, రజిత, కరుణ, రవాణి, భాను, పుల్లమ్మ, ప్రశాంతి, మమత, శ్రీలత, భవాని తదితరులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణ కాలనీలో నవరాత్రి ఉత్సవాల సందడి

**హైదరాబాద్**

నగరంలోని మల్లాపూర్ హెచ్ బి కాలనీ డివిజన్లోని అన్నపూర్ణ కాలనీలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఏపీసీ యువజన సంఘం తమ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తదియ సందర్భంగా భవానీమాత శ్రీ అన్నపూర్ణ దేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించను న్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కాలనీకి



చెందిన మహిళలు, యువతీ యువకులు నియ మనిష్ఠలతో అమ్మవారికి పూజలు చేస్తూ భక్తిని చాటుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాలతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం పూర్ణ కాలనీ యువత, కాలనీ అధ్యక్షులు నరసింహ గౌడ్, జనరల్ సెక్రెటరీ సంజయ్ నాయక్, కిట్టు నాయక్, సూరజ్, శుభం, వెచైన్, సాగర్, సోను, హాజిజ్ తదితర దుర్గామాత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత రాజవర్ధన్ రెడ్డి మృతి

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేటకు చెందిన సీనియర్ న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు కోట్ల రాజవర్ధన్ రెడ్డి గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు తెలిపారు.వారి మరణం న్యాయవాద రంగానికి, రాజకీయ రంగానికి తీరని లోటు అని వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని నారాయణపేట న్యాయవాదులు బి. ఆర్. ఎస్ నాయకులు ప్రార్థించారు.


**IN THE COURT OF HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURT, AT ; HYDERABAD**
**O.P.No. 432 of 2026**

**Between :**
Nuzaht Begum and others
**Petitioners**

**AND**

The TGSRTC rep. by its Managing Director and others
**Respondents**

To
R- 3
K.Vijay Kumar, S/o Sudarshan, Aged Major, Occ: RTC driver, R/o H.No. 11-4-14, Ayyappa Nagar, near Ramoji Film City, Abdullapurmet, Rangareddy. Please take notice that the petitioners herein has filed the above O.P.No. 432 of 2026, claiming compensation against you and others. The said case is posted to 29-10-2026 for your appearance either in person or through an Advocate. If failed to appear before the Hon'ble Court the said date at 10.30 A.M. the matter will be heard and decide exparteHyderabad Date: 13-10-2026

**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**M.VENKATAIAH**
**Karthik Marapaka**
**ADVOCATES**
**O/o Sree Nilayam, 1st floor, H.No. 3-10-10/A, Gokhale Nagar, Library Lane, Ramanthapur, Hyderabad. Mobile No. 98482 55392**



**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM IX JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGAREDDY DISTRICT DIST. AT KUKATPALLY**
**O.S.No. 4031 of 2026**

**Between :**
Narasimha Prasad Komaravathi and another
**Plaintiffs**

**AND**

The Tahasildar, Serilingampally Mandal, Rangareddy District Dist.
**Defendants**

To,
1. The Tahasildar, Serilingampally Mandal, Rangareddy District Dist.
2. All concerned

Please take notice that the above suit vide O.S No. 4031 of 2026 is filed by the Plaintiffs against the defendants to declare them as legal heir of Late Komaravathi Sreenivasulu and Late Komaravathi Saroja and the said suite is posted on 29.10.2026 for your appearance and counter if any, therefore you are hereby called upon to appear either in person or through an advocate in the above suit before the above said court on 29.10.2026 at 10:30 AM failing which the suit will be decided on the merits in your absence.

**//by the order of the Hon'ble court//**
**Sd/-**
**SHAIK RESHMA**
**Advocates Off: Plot No 1, Shop No 2 Kamalaprasanna Nagar Colony,**



"టెక్నాలజీ, డేటా, నాలెడ్జ్, ఇన్నోవేషన్ అనేవి నేటి ప్రపంచంలో అత్యంత కీలక శక్తులు. కోట్లాది మందికి కొత్త అవకాశాలు కల్పించేందుకు ఉపయోగించాలి. పోటీకి బదులుగా సహకారం, నియంత్రణకు బదులుగా సాధికారత లక్ష్యంగా ముందుకు సాగాలి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలమైన పునాదులపై నిలిచి ఉంది. దీంతో 2026`27 ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. హరిత ఇంధన రంగంలోనూ భారత్ గణనీయమైన వృద్ధిని సాధించింది"

- నరేంద్ర మోడీ, ప్రధాని

## వే'మన' పద్యం

తవిటి కరయ వోవ దండులంబులగంప
శ్వానమాక్రమించు సామ్యమగును
వైశ్యవరుని సొమ్ము వసుధ నీచుల కబ్బు
విశ్వదాభిరామ వినురవేమ.



# సంపాదకీయం

## సర్‌పై సందేహాల నివృత్తి ఏదీ?

ప్రజాస్వామ్యంలో నిరసనలను అణచివేయడం ద్వారా సమస్యలను పరిష్కరించలేరు. ప్రజల గొంతులను నొక్కడం, ప్రశ్నించే వారిని నిర్బంధించడం, బహిరంగ ప్రదేశాల్లో ఆందోళనలకు అడ్డుకట్ట వేయడం తాత్కాలికంగా అధికారులకు ఉపశమనం కలిగించవచ్చేమో గానీ, ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని మాత్రం తొలగించలేవు. అక్టోబరు 10న దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. నిరసనకారులను చెదరగొట్టడంలో ఢిల్లీ పోలీసులు, వారికి తోడుగా రంగంలోకి దిగిన కేంద్ర బలగాలు పైచేయి సాధించి ఉండవచ్చు. దాదాపు ఏడు వేల మందిని నిర్బంధించి, నిరసన గళాలు బహిరంగంగా వినిపించకుండా అడ్డుకుని ఉండవచ్చు. కానీ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంబంధించిన మౌలిక ప్రశ్నలకు ఈ చర్యలు సమాధానాలు కావు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎన్నికల సంఘం అనుసరిస్తున్న విధానాలు, ముఖ్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై వ్యక్తమవుతున్న సందేహాలు, ఆందోళనలకు ఇప్పటికీ స్పష్టత రావాల్సి ఉంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో చేపట్టే ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగుతోంది? అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారు? అభ్యంతరాలు వ్యక్తమైతే వాటికి సమాధానాలు చెప్పే బాధ్యత ఎవరిది? ఇలాంటి ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమగ్రంగా సమాధానమివ్వాలి. రాజధాని వీధుల్లో బారికేడ్లు నిర్మించి, నిరసనకారులను చెదరగొట్టడం సాధ్యమే కావచ్చు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో తలెత్తిన సందేహాలకు అడ్డుగోడలు నిర్మించడం సాధ్యం కాదు.ఎన్నికల సంఘం అనేది అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదు. ప్రభుత్వాలు మారినా, రాజకీయ సమీకరణాలు మారినా రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా తన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాల్సిన వ్యవస్థ. అందుకే ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయతను కాపాడటం, ఓటర్ల హక్కులను పరిరక్షించడం, తన నిర్ణయాలకు తగిన వివరణ ఇవ్వడం దాని ప్రాథమిక బాధ్యతలు. అయితే, కీలకమైన ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు స్పష్టమైన వివరణ ఇవ్వకుండా మౌనం పాటించడం సంస్థపై అనుమానాలను మరింత పెంచుతుంది. తన నిర్ణయాలపై విమర్శలు వచ్చినప్పుడు వాటిని వాస్తవాలతో ఎదుర్కోవాల్సిన ఎన్నికల సంఘం, విమర్శకుల గొంతులు అణచివేతకు గురవుతున్నా మౌనంగా ఉండటం సంస్థ స్వతంత్రతపై సందేహాలకు తావిస్తుంది. జవాబుదారీతనం ద్వారా నిరంతరం నిరూపించుకోవాల్సిన బాధ్యత కూడా.రాజధానిలో జరిగిన నిరసనలను కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలోని ఆందోళనకారులకు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మధ్య రాజకీయ ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నాలు జరిగి ఉండవచ్చు. నిరసనకారులను అరాచకవాదులుగా, అస్థిర శక్తులుగా అభివర్ణించడం, వారికి విదేశీ శక్తుల మద్దతు ఉందని ఆరోపించడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించలేరు. ఈ వివాదానికి కేంద్రబిందువు ఎన్నికల సంఘం పనితీరు, దాని నిర్ణయాలపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలే అయితే, వాటిపై చర్చ జరగాలి. నిరసనకారులపై విమర్శలు చేయడం కంటే వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ముఖ్యం. ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది వ్యవస్థకు ముప్పు కాదు; లోపాలను సరిదిద్దుకునేందుకు ఉపయోగపడే అవకాశం.ఇదే ఎన్నికల సంఘం ఒకప్పుడు ఓటర్లను, ముఖ్యంగా యువతను ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేయడంలో చురుకైన పాత్ర పోషించింది. ఓటరు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగం వరకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు చేపట్టిన కార్యక్రమాలు ఆ సంస్థకు గుర్తింపు తెచ్చాయి. అలాంటి వ్యవస్థ ఇప్పుడు తన నిర్ణయాలపై తలెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయాల్సిన పరిస్థితి రావడం ఆత్మపరిశీలనకు సంకేతం కావాలి. ఓటర్ల జాబితాల సవరణలో తప్పులకు తావులేకుండా చూడటం, అర్హులైన ఒక్క ఓటరు కూడా హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవడం, అభ్యంతరాలకు పారదర్శకంగా పరిష్కారాలు చూపడం అత్యవసరం.

ప్రజాస్వామ్య సంస్థల బలం బారికేడ్లలోనూ, బలగాల మోహరింపులోనూ ఉండదు. ప్రజల విశ్వాసంలోనే ఉంటుంది. నిరసనకారులను చెదరగొట్టవచ్చు, ప్రశ్నించే గొంతులను కొంతకాలం నిలువరించవచ్చు. కానీ ఓటర్ల సందేహాలను, ప్రజల ఆందోళనలను అలా తొలగించలేరు. ఎన్నికల సంఘం తన స్వతంత్రతను కాపాడుకోవాలంటే మౌనం వీడి, ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. పారదర్శకతను పెంచాలి. తప్పులు జరిగితే సరిదిద్దుకోవాలి. అర్హులైన ప్రతి ఓటరుకు తన ఓటు హక్కుపై భరోసా కల్పించాలి. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో విశ్వాసాన్ని ఆదేశాలతో సాధించలేరు; నిష్పక్షపాతమైన పనితీరుతోనే సంపాదించగలరు. అడ్డుగోడలు, నిర్బంధాలు ఎన్నికల సంఘాన్ని బలోపేతం చేయలేవు. ప్రజల విశ్వాసమే దానికి నిజమైన బలం.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## అమాంతంగా ఆస్తుల పెరుగుదలెలా?!

రాజకీయాల్లోకి వచ్చేముందు సాధారణ జీవితం.. ఆ తర్వాత ఒక్కసారిగా కోట్లకు పడగలెత్తే ఆస్తులు! ఎన్నికల అఫిడవిట్లలో కనిపించే ఆస్తుల వివరాలను వరుసగా పరిశీలిస్తే ఒక ప్రశ్న తప్పకుండా తలెత్తుతుంది. ప్రజాసేవకు వచ్చిన రాజకీయ నాయకుల సంపద ఇంత వేగంగా ఎలా పెరుగుతోంది? ఐదేళ్లలో ఒకరి ఆస్తి రెట్టింపు కావడం.. పదేళ్లలో పలుమార్లు పెరగడం.. కుటుంబ సభ్యుల పేర్లపై భూములు, కంపెనీలు, వ్యాపారాలు విస్తరించడం సాధారణ పరిణామంగా మారితే, రాజకీయ పదవి ఆదాయానికి మార్గమా? లేక అధికారం సంపదను సృష్టించే వ్యవస్థగా మారిందా?ఇది ఒక్క పార్టీకి, ఒక్క రాష్ట్రానికి పరిమితమైన ప్రశ్న కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమయంలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లలో స్థిరాస్తులు, చరాస్తులు, పెట్టుబడులు, కంపెనీల్లో వాటాలు, బ్యాంకు నిల్వలు, అప్పులు వంటి వివరాలు వెల్లడవుతాయి. ఒక ఎన్నిక నుంచి మరో ఎన్నికకు ఈ సంఖ్యల్లో వచ్చే మార్పు రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి ఆర్థిక ప్రయాణానికి ఒక అద్దంలా నిలుస్తుంది. అయితే ఆ అద్దంలో కనిపించేది మొత్తం కథ కాదు. ఆస్తుల విలువ పెరగడం, కొత్త ఆస్తులు కొనడం రెండూ ఒకటే కాదు. భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల కూడా సంపద పెరిగినట్టు కనిపించవచ్చు. కానీ ఆదాయానికి మించిన ఆస్తుల సమీకరణ కనిపించినప్పుడు మాత్రం అనుమానం సహజమే. రాజకీయ నాయకుడి సంపద పెరగడాన్ని తప్పని సరిగా అవినీతితో ముడిపెట్టడం కూడా సరికాదు. రాజకీయాల్లోకి రాకముందే వ్యాపారాలు, వ్యవసాయం, పరిశ్రమలు, కుటుంబ ఆస్తులు ఉన్నవారు ఉంటారు. వాటి విలువ పెరగడం సహజం. వారసత్వంగా వచ్చిన ఆస్తులు కూడా ఉంటాయి. పెట్టుబడుల ద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అందుకే ఆస్తులు పెరిగాయనే ఒక్క కారణంతో అవినీతి జరిగిందని తీర్పు చెప్పలేం. కానీ అధికారంలో ఉన్న కాలంలో ఆదాయం, ప్రకటించిన వనరులు, ఆస్తుల పెరుగుదల మధ్య సంబంధం కనిపించకపోతే మాత్రం ప్రజాస్వామ్యానికి అది తీవ్రమైన ప్రశ్న.ఇక్కడ అసలు సమస్య ఆస్తులు పెరగడం కాదు.. ఆస్తులు ఎలా పెరిగాయన్నది. ఒక ప్రజాప్రతినిధి తన సంపద పెరుగుదలకు స్పష్టమైన లెక్క చెప్పగలగాలి. వ్యాపారం ద్వారా వచ్చిందా? వారసత్వంగా వచ్చిందా? భూముల విలువ పెరగడం వల్ల పెరిగిందా? పెట్టుబడుల ద్వారా సంపాదించిందా? లేక అధికార ప్రభావంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆర్థిక ప్రయోజనాలు పొందిందా? ఈ ప్రశ్నలకు సమాధానం ఉంటే సంపదపై అనుమానాలకు తావుండదు.

మరో సున్నితమైన అంశం కుటుంబ ఆస్తులు. ఒక నాయకుడి పేరుతో ఉన్న ఆస్తులనే కాకుండా భార్య, పిల్లలు, బంధువుల పేర్లపై ఉన్న ఆస్తుల పరిణామాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులకు స్వతంత్ర వ్యాపారాలు ఉండటం తప్పు కాదు. కానీ రాజకీయ అధికారానికి సమీపంగా ఉన్న కుటుంబ సభ్యుల వ్యాపారాలు, భూములు, పెట్టుబడులు అసాధారణంగా విస్తరిస్తే సహజంగానే ప్రశ్నలు తలెత్తుతాయి. ఆ ప్రశ్నలను రాజకీయ ప్రత్యర్థుల ఆరోపణలుగా కొట్టిపారేయడం కాకుండా పారదర్శకమైన వివరాలతో సమాధానం ఇవ్వడం ప్రజా జీవితంలో ఉన్నవారి బాధ్యత.ఇదే సందర్భంలో బినామీ ఆస్తుల అనుమానాలు కూడా చర్చకు వస్తాయి. ఒక నాయకుడి అధికారిక ఆస్తులు పరిమితంగానే కనిపిస్తున్నా, అతనికి సన్నిహితులైన వ్యక్తులు ఒక్కసారిగా భారీగా ఆస్తులు కూడబెట్టినప్పుడు దర్యాప్తు సంస్థలు నిజానిజాలను పరిశీలించాల్సిందే. అయితే అనుమానం ఆధారంగా ఎవరినీ దోషిగా తేల్చడం సరికాదు. ఆరోపణకు ఆధారం.. దర్యాప్తుకు స్వతంత్రత.. నిర్ణయానికి చట్టబద్ధమైన ప్రక్రియ—ఈ మూడు ఉండాలి. ప్రస్తుత వ్యవస్థలో ఎన్నికల అఫిడవిట్ ఒకసారి దాఖలు చేసి మిగిలిపోవడం సరిపోదు. ఆస్తులపై నిరంతర పారదర్శకత అవసరం. ఎన్నికల ముందు ప్రకటించిన ఆస్తులు, పదవీకాలంలో జరిగిన మార్పులు, ఆదాయపు పన్ను వివరాలు, కంపెనీల్లో వాటాలు, కుటుంబ వ్యాపార ప్రయోజనాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించే వ్యవస్థ ఉండాలి. ప్రజాప్రతినిధి ఆస్తులు అసాధారణంగా పెరిగితే వివరణ కోరే స్వతంత్ర యంత్రాంగం అవసరం. ఆస్తుల ప్రకటన కేవలం ఎన్నికల ఫారంలో ఒక కాలమ్ నింపే ప్రక్రియగా మిగిలిపోకూడదు.రాజకీయాల్లో డబ్బు పాత్ర పెరగడం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. ఎన్నికల్లో పోటీ చేయడానికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తే సామాన్యుడికి రాజకీయ ప్రవేశం కష్టమవుతుంది. ఎన్నికల ఖర్చు, పార్టీ నిధులు, అభ్యర్థుల వ్యక్తిగత సంపద—ఈ మూడింటి మధ్య పారదర్శకత లేకపోతే ప్రజాస్వామ్యంలో సమాన అవకాశాల భావన బలహీనపడుతుంది. రాజకీయాల్లోకి రావడానికి డబ్బు కావాలి.. డబ్బు కోసం రాజకీయాల్లోకి రావాలి.. అధికారంలోకి వచ్చాక మరింత సంపద కూడబెట్టాలి అనే చక్రం ఏర్పడితే ప్రజాసేవ వెనుకబడిపోతుంది.

అధికారమే పెట్టుబడిగా మారే పరిస్థితి మరింత ప్రమాదకరం. పదవిలో ఉన్నప్పుడు తీసుకునే ప్రతి నిర్ణయం ప్రభుత్వ వనరులు, భూములు, కాంట్రాక్టులు, అనుమతులు, విధానాలతో ముడిపడి ఉంటుంది. అందువల్ల రాజకీయ నాయకుడి వ్యక్తిగత ప్రయోజనాలు, ప్రభుత్వ నిర్ణయాల మధ్య ప్రయోజన సంఘర్షణ ఏర్పడకుండా కఠినమైన నిబంధనలు అవసరం. అధికారంలో ఉన్నవారు తమకు లేదా తమ కుటుంబానికి సంబంధించిన వ్యాపార ప్రయోజనాలను వెల్లడించే సంస్కృతి బలపడాలి.ఇంకోవైపు ప్రజల పాత్ర కూడా కీలకమే. ఎన్నికల సమయంలో అభ్యర్థి కులం, పార్టీ, ప్రాంతం, వ్యక్తిగత ప్రభావం మాత్రమే కాకుండా అతని ఆస్తుల వివరాలను కూడా పరిశీలించే రాజకీయ సంస్కృతి రావాలి. ఐదేళ్లలో ఆస్తులు ఎంత పెరిగాయి? ఆదాయం ఎంత? అప్పులు ఎంత? కుటుంబ వ్యాపారాలు ఎలా విస్తరించాయి? అనే ప్రశ్నలు ఓటరు అడగాలి. ప్రజలు ప్రశ్నించనంతకాలం రాజకీయ నాయకులు సమాధానం చెప్పాల్సిన అవసరాన్ని పెద్దగా అనుభవించరు.

చివరికి ప్రశ్న ఒక్కటే—రాజకీయ నాయకుల ఆస్తులు ఎంతున్నాయన్నది కాదు.. అవి ఎలా వచ్చాయన్నది. ప్రజల మధ్య తిరుగుతూ ఓట్లు అడిగే నాయకుడు తన సంపద పెరుగుదలపై ప్రజల ముందే లెక్క చెప్పగలగాలి. పదవిలోకి రాకముందు ఉన్న ఆస్తులు.. పదవిలో ఉన్నప్పుడు పెరిగిన ఆస్తులు.d

.పదవి ముగిసిన తర్వాత కూడబెట్టిన సంపద—ప్రతి దశకు సమాధానం ఉండాలి.ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల నుంచి వస్తుంది. ఆ అధికారం వ్యక్తిగత సంపదను పెంచుకునే సాధనంగా మారితే అది కేవలం అవినీతి సమస్య కాదు.. ప్రజల నమ్మకానికి జరిగే ద్రోహం. రాజకీయ పదవి సంపదకు మెట్లదారి కాకుండా ప్రజాసేవకు బాధ్యతగా మారాలి. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నదే కాదు.. ఎలా సంపాదించారు? ఎంత సంపాదించారు? ఆ సంపదకు లెక్క ఉందా? అన్నదీ ఓటరు ప్రశ్నించాలి.రాజకీయ నాయకుల ఆస్తులపై అనుమానాలు తొలగాలంటే ప్రకటనలు సరిపోవు.. పూర్తి పారదర్శకత కావాలి. విచారణలు రాజకీయ ప్రతీకారానికి ఆయుధాలు కాకూడదు; నిజానిజాలను వెలికితీసే స్వతంత్ర వ్యవస్థగా పనిచేయాలి. ప్రజల ఓటుతో వచ్చిన అధికారానికి ప్రజల ముందే ఆర్థిక జవాబుదారీతనం ఉండాలి.ఎందుకంటే ప్రజల డబ్బుతో నడిచే వ్యవస్థలో ప్రజాప్రతినిధుల సంపదకు కూడా ప్రజలకే లెక్క చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాల్లోకి వచ్చి కోటీశ్వరులు కావడం గొప్ప కాదు.. కోట్లు వచ్చినా ఒక్క రూపాయి లెక్క కూడా దాచాల్సిన అవసరం లేకపోవడమే నిజమైన ప్రజాసేవకు కొలమానం.



బత్తుల సత్యనారాయణ జర్నలిస్ట్
9963991120

## అక్షరాలకందని అనురాగం

నిలువెత్తు నిన్ను
చదవడానికి
జీవితకాలం
చాలదేమో- - -
నీ భావాల లోతుల్లో
అంతులేని అర్థాలను
వెతుకుతూ
నిత్య పాఠకురాలినై
మిగిలిపోతాను!
వర్ణమాలలో మొదలైన
మన పరిచయం
అక్షరాల అల్లికలో
అందంగా ఒదిగి,
పదాల పరిమళాన్ని
అద్దుకొని,
మహత్తర
సాహిత్యంగా ఎదగాలి!

నువ్వు నాకు
పర్యాయపదానివైతే
నేను నీకు
నానార్థాన్ని- - -
మన కలయిక
వ్యుత్పత్త్యర్థం,
మన అనుబంధం
అపురూప అలంకారం!
నీకు నేను అక్షరమై,
నాకు నువ్వు భావమై,
మన మౌనం
కవిత్వమై,
మన ప్రేమ
మహాకావ్యమై
కాలం గుండెలపై
సంతకం చేయాలి!

నువ్వు ఛందస్సువైతే
నేను లయను,
నువ్వు
ఉపమానానివైతే నేను
ఉపమేయాన్ని,
నువ్వు రసానివైతే నేను
అనుభూతిని- - -
మనమిద్దరం
కలిసినప్పుడే
మన ప్రేమకు
సంపూర్ణార్థం!

విడిపోతే మనది
విరామచిహ్నం,
కలిసుంటే తరతరాలు
చదివే వాక్యం!
దూరం మన మధ్య
ప్రశ్నార్థకమైనా,
మన ప్రేమే దానికి
సమాధానం!
నువ్వు నా అక్షరాలకు
అస్తిత్వానివి,
నేను నీ భావాలకు
వ్యక్తీకరణను- - -
మన కలయిక కేవలం
అనుభూతి కాదు,
భావితరాలు చదివే ఓ
చరిత్ర!
కావ్యానికి ముగింపు
ఉండొచ్చు,
పుస్తకానికి చివరి పుట
ఉండొచ్చు- - -
కానీ నువ్వు నా
అర్థమైనంతకాలం,
నేను నీ
అక్షరమైనంతకాలం
మన ప్రేమకు
ముగింపు ఉండదు!
వర్ణమాల నుంచి
మొదలై,
మహాకావ్యమై
విస్తరించి,
కాలం సైతం చదివి
మురిసిపోయే
అక్షరాల్లో ఒదగని
అనురాగంగా
మన ప్రేమ
నిలిచిపోవాలి!

రామిశెట్టి కావ్య
జూనియర్ లెక్చరర్ (తెలుగు)
9390721569

# కలల దార్శనికుడు... కలామ్!

ప్రతిరోజూ ఈ భూమ్మీద ఎంతోమంది పుడుతూ ఉంటారు, కాలప్రవాహంలో మరణిస్తూ ఉంటారు. కానీ, తాము జీవించిన కాలానికి ఒక అర్థాన్ని, పరమార్థాన్ని ఇస్తూ, మరణం తర్వాత కూడా కోట్లమంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహనీయులు అతికొద్ది మంది మాత్రమే ఉంటారు. అలాంటి అరుదైన, అత్యున్నత వ్యక్తుల్లో ప్రథమ వరుసలో నిలిచే అమరమూర్తి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి..' అని నినదిస్తూ, లక్షలాదిమంది యువతరాన్ని తట్టి లేపి, వారిలో ఆశల దివ్వెలను వెలిగించిన భారత రత్నం కలామ్. ఆయన జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి సలామ్ చేయడం మన బాధ్యత.కలాం చెప్పిన 'కలలు కనడం' అంటే ఊహల పల్లకిలో విహరించడమో, గాలిలో మేడలు కట్టడమో, పగటి కలలు కనడమో కాదు. జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం, ఆ లక్ష్య సాధన కోసం అహర్నిశలు శ్రమించడం, స్వేదం చిందించి అనుకున్నది సాధించడమే అసలైన కల. 'నేను ఫలానా స్థాయికి చేరాలి, సమాజానికి ఇది సాధించి చూపాలి' అనే సంకల్పం ప్రతి ఒక్కరిలో రగలాలి. చిన్న లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం పెద్ద నేరంతో సమానమని హెచ్చరించిన కలాం జీవితం, ప్రతి భారతీయుడికి ఒక పాఠ్యాంశం. ఆయన అడుగుజాడల నుంచి లభించే ప్రేరణ, స్ఫూర్తి తరతరాలకు అక్షయపాత్రలాంటివి.భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా ఎనలేని సేవలందించిన కలాం పూర్తి పేరు అవుల్ ఫకీర్ జైనుల్ ఆబిదీన్ అబ్దుల్ కలాం. 1931 అక్టోబరు 15న తమిళనాడులోని రామేశ్వరం అనే తీరప్రాంత గ్రామంలో ఒక అత్యంత సామాన్య ముస్లిం కుటుంబంలో ఆయన జన్మించారు. తండ్రి జైనుల్ ఆబిదీన్, తల్లి ఆసియామా. పేదరికం తాండవిస్తున్న ఆ రోజుల్లో తల్లిదండ్రులకు ఆర్థికంగా ఆసరాగా నిలిచేందుకు కలాం బాల్యంలోనే పేపర్ బాయ్‌గా మారారు. తెల్లవారుజామునే నిద్రలేచి, స్నానం చేసి, ట్యూషన్‌కు వెళ్లి, ఆ తర్వాత తండ్రితో కలిసి నమాజు ముగించుకుని రైల్వే స్టేషన్‌కు పరుగెత్తేవారు. అక్కడ దినపత్రికల పార్సిళ్లను అందుకుని, సైకిల్‌పై ఊరంతా తిరిగి పంపిణీ చేసేవారు. అంత చిన్న వయసులోనే కష్టపడే తత్వాన్ని నరనరాన జీర్ణించుకున్న కలాం, చదువులో ఎప్పుడూ ముందే ఉన్నారు.ప్రాథమిక విద్య అనంతరం, రామనాథపురం స్కార్ట్జ్ హైస్కూల్‌లో మెట్రిక్ ముగించిన కలాం, తిరుచిరాపల్లిలోని సెయింట్ జోసెఫ్ కళాశాల నుంచి భౌతిక శాస్త్రంలో పట్టా పొందారు. ఆపై చెన్నైలోని ప్రసిద్ధ మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (MIT) నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం ఇస్రో (ISRO)లో చేరి భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (SLVIII) రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 1980 జూలైలో ఈ వాహనం 'రోహిణి' ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

ఈ అపూర్వ విజయం తర్వాత అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నుంచి కలాంకు, ఇస్రో ఛైర్మన్ సతీశ్ ధావన్‌కు ఆహ్వానం అందింది. అయితే, ఆ ఆహ్వానం వచ్చినప్పుడు కలాం సంకోచించారు. 'నా దగ్గర మంచి షూస్ కూడా లేవు, కేవలం సాదా సీదా చెప్పులు మాత్రమే ఉన్నాయి, ప్రధానిని ఎలా కలవాలి?' అని సతీశ్ ధావన్ వద్ద మొహమాట పడగా, 'మీరు ఇప్పటికే 'విజయం' అనే గొప్ప సూట్‌ను ధరించి ఉన్నారు, ఎటువంటి సందేహం లేకుండా వచ్చేయండి' అని ధావన్ ధైర్యాన్నిచ్చారు.1970 నుండి 1990ల మధ్య కాలంలో పిఎస్ఎల్వి (PSLV), ఎస్ఎల్విIII ప్రాజెక్టుల పురోగతిలో కలాం వహించిన నాయకత్వం ఇస్రో చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. 1992 నుండి 1999 వరకు ప్రధానమంత్రికి శాస్త్రీయ సలహాదారుగా, డిఆర్డిఓ (DRDO) ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో, 1998 పోఖ్రాన్ అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించడంలో ఆయన వహించిన వ్యూహాత్మక, సాంకేతిక పాత్ర అపారమైనది. భారతదేశాన్ని ప్రపంచంలోని అగ్రరాజ్యాల సరసన అణ్వస్త్ర శక్తిగా నిలబెట్టినందుకు గాను ఆయన 'భారత అణుశాస్త్ర పితామహుడిగా', 'మిసైల్ మ్యాన్'గా జగద్విఖ్యాతి గాంచారు. శాస్త్ర సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా ప్రజా ఆరోగ్యంపై కూడా కలాం దృష్టి సారించారు. 1998లో ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ సోమరాజుతో కలిసి అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన స్టెంట్‌ను తయారు చేశారు. దీనికి 'కలాం రాజు స్టెంట్' అని పేరు పెట్టారు. అలాగే 2012లో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను సులభతరం చేసేందుకు 'కలాం రాజు ట్యాబ్లెట్' పేరిట ప్రత్యేక కంప్యూటర్ ట్యాబ్‌ను కూడా వీరిద్దరూ రూపొందించడం ఆయన సామాజిక స్పృహకు నిదర్శనం. 2002 నుండి 2007 వరకు భారత 11వ రాష్ట్రపతిగా కలాం అందించిన సేవలు వర్ణనాతీతం. ఎంత ఖరీదైన మేడల్లో ఉన్నా, ఇసుమంతైనా అహంకారం లేక, ఎల్లప్పుడూ 'ప్రజల రాష్ట్రపతి'గా మెలిగారు. ఆయన సేవలకు గుర్తుగా దేశవిదేశాలలోని 40కి పైగా విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. భారత ప్రభుత్వం 1981లో పద్మభూషణ్, 1990లో పద్మవిభూషణ్ బిరుదులతో గౌరవించగా, 1997లో దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ఆయనను వరించింది. 2013లో అమెరికాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ ప్రతిష్టాత్మక 'వాన్ బ్రాన్ అవార్డు'తో కలాంను గౌరవించింది.కలాం వ్యక్తిగత జీవితం, ఆయన నిబద్ధత గురించి ఆయన వ్యక్తిగత కార్యదర్శి పి.ఎమ్. నాయర్ వెల్లడించిన విషయాలు వింటే ఎవరికైనా గర్వంతో తనువంతా ఉప్పొంగుతుంది. రాష్ట్రపతిగా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయా దేశాధినేతలు ఇచ్చే ఖరీదైన బహుమతులను నిరాకరిస్తే భారత్‌కు అవమానమని భావించి స్వీకరించేవారు. కానీ, స్వదేశానికి రాగానే వాటిని ఫోటోలు తీయించి, కేటలాగ్ చేసి ఆర్కైవ్స్‌కు అప్పగించేవారు. పదవీ కాలం ముగిసి రాష్ట్రపతి భవన్ వదిలివెళ్లేటప్పుడు అందులోంచి ఒక్క పెన్సిల్ ముక్కను కూడా ఆయన ఇంటికి తీసుకెళ్లలేదు. 2002 రంజాన్ సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చే ఇఫ్తార్ విందుకు రూ. 22 లక్షలు ఖర్చవుతుందని తెలిసినప్పుడు, శ్రీమంతులకు విందులు ఇవ్వడం కంటే ఆ డబ్బుతో అనాథలకు, నిరుపేదలకు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేయమని ఆదేశించారు. అంతేకాకుండా, తన సొంత సంపాదన నుంచి లక్ష రూపాయల చెక్కును అనాథాశ్రమాలకు ఇస్తూ, 'ఈ విషయం ఎవరికీ తెలియకూడదు' అని నాయర్‌ను కోరారు. ఒకసారి తన బంధువులు 52 మంది ఢిల్లీ చూసేందుకు వస్తే, వారి కోసం బస్సు బుక్ చేసి, ఆ ఖర్చు రూ. 2 లక్షలను తన సొంత ఖాతా నుంచే చెల్లించారు. ఒక్క ప్రభుత్వ వాహనాన్ని కూడా వారికి కేటాయించలేదు. తన సోదరుడు వారం రోజులు రాష్ట్రపతి భవన్‌లో ఉన్నందుకు అద్దె చెల్లిస్తానని కలాం పట్టుబట్టడం ఆయనలోని నిష్కల్మషమైన నిజాయితీకి పరాకాష్ట.అంతేకాదు, రాష్ట్రపతి భవన్ ఖాళీ చేసే సమయంలో తన కార్యాలయ ఉద్యోగి భార్య అనారోగ్యంతో వచ్చి కలవలేకపోయిందని తెలుసుకుని, మరుసటి రోజే ఏమాత్రం హడావుడి లేకుండా నేరుగా ఆ ఉద్యోగి నివాసానికి వెళ్లి పరామర్శించిన ఏకైక దేశాధినేత కలాం మాత్రమే.ప్రపంచంలోనే అత్యున్నత పదవిని అధిరోహించిన ఈ మహనీయుడి ఆస్తి ఏమిటో తెలుసా? కేవలం మూడు ప్యాంట్లు, ఆరు షర్టులు, మూడు సూట్లు, ఒక వీణ, ఒక చేతి గడియారం, 2,500 పుస్తకాలు, అసంఖ్యాకమైన పురస్కారాలు, దాదాపు శూన్యమైన బ్యాంక్ బ్యాలెన్స్... కానీ, వీటన్నిటికంటే మిన్నగా 140 కోట్ల మంది భారతీయుల గుండెల్లో నిండిన అపారమైన ప్రేమాభిమానాలు!2015 జూలై 27 సాయంత్రం... మేఘాలయలోని 'ఐఐఎమ్ షిల్లాంగ్' ప్రసంగ వేదిక. 'వాచ్‌బుల్ ప్లానెట్' (మానవాళికి నివాసయోగ్యమైన నిలయం) అనే అంశంపై వందలాది మంది విద్యార్థులను ఉద్దేశించి ఉత్సాహంగా మాట్లాడుతున్న ఆ గొంతు అకస్మాత్తుగా మూగబోయింది. ఉపన్యాసం మొదలైన ఐదు నిమిషాలకే కలామ్ తీవ్ర గుండెపోటుతో వేదికపైనే కుప్పకూలిపోయారు. వెంటనే స్థానిక బెథానీ ఆసుపత్రికి తరలించి వైద్యులు తీవ్రంగా శ్రమించినప్పటికీ, అప్పటికే ఆ అమరదీపం ఆరిపోయింది. చివరి శ్వాస వరకు విద్యార్థులకు జ్ఞానబోధ చేస్తూ, తాను అమితంగా ప్రేమించిన విద్యార్థుల మధ్యనే, బోధనా వృత్తిలోనే కలామ్ తన జీవిత ప్రయాణాన్ని ముగించారు.సర్వమత గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మానవత్వాన్ని, శాంతిని పరమ మతంగా విశ్వసించిన ఈ అపూర్వ దార్శనికుడు భౌతికంగా మన మధ్య లేకపోవచ్చు. కానీ, 'ఆకాశం వైపు చూడండి.. మనం ఒంటరిగా లేము. విశ్వమంతా మనకు మిత్రపక్షమే! కలలు కనేవారికి, శ్రమించేవారికే ఈ విశ్వం శ్రేష్ఠమైన ప్రతిఫలాలను ఇస్తుంది' అని ఆయన చెప్పిన మాటలు భారతీయుల గుండెల్లో నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.కలామ్ మనకు ఇచ్చిన అతి పెద్ద సందేశం వైఫల్యాలకు కుంగిపోకుండా, కలలను భుజానకెత్తుకుని గమ్యం వైపు సాగిపోవడమే! ఆయన రాజభవనాల్లో జీవించిన రాజర్షి కావచ్చు, కానీ సామాన్యుడి గుండెల్లో కొలువైన నిత్య విద్యార్థి. మనకాలంలో మన మధ్య నడయాడిన ఈ యుగపురుషుడు రగిలించిన ఆశల దివ్వెలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ దారి చూపే మార్గదర్శకాలు. అగ్నిశిఖలాంటి ఆయన ఆశయాలను సాధనతో సాకారం చేయడమే మనం ఆ మహనీయుడికి అర్పించే నిజమైన నివాళి! కలామ్ సాబ్.. మీకు మా సలాములు!



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

# జాతీయం-అంతర్జాతీయం

## మానవాళి సంక్షేమానికే చైనా విధానం

**బీజింగ్:**

140 కోట్లకు పైగా జనాభా ఉన్న చైనా వంటి భారీ దేశంలో ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించడం కేవలం ఆ దేశ అంతర్గత ప్రాధాన్యత మాత్రమే కాదని, అది సమగ్ర మానవాళి సంక్షేమానికి **చైనా అందిస్తున్న గొప్ప సంభావన అని అధికారిక వార్తా సంస్థ 'జిన్హువా' వ్యాఖ్యానించింది.**

2012లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సిపిసి) 18వ జాతీయ కాంగ్రెస్ ముగిసినప్పటి నుండి, చైనా ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. 'హెల్తీ చైనా ఇన్షియేటివ్' ద్వారా సరికొత్త విధివిధానాలను రూపొందించి అమలు చేయడం వల్ల ఆదేశ వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన మరియు చారిత్రాత్మక మార్పులు సంభవించాయి.



అత్యంత వేగంగా విస్తరించిన సంరక్షణ వ్యవస్థ:చైనా ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య సేవలు, సాంప్రదాయ వైద్యం, వ్యాధి నివారణనియంత్రణ మరియు ఆరోగ్య భద్రతా వ్యవస్థలను కలిగి ఉంది.

**ఇటీవల కోవిడ్-19 వంటి తీవ్రమైన ప్రపంచ మహమ్మారిని** చైనా సమర్థవంతంగా ఎదుర్కొని తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది.

అంకెల్లో చైనా ఆరోగ్య పురోగతి:* వైద్య కేంద్రాల అందుబాటు: దేశవ్యాప్తంగా ప్రస్తుతం 11 లక్షలకు పైగా వైద్య, **ఆరోగ్య సంస్థలు అందుబాటులో ఉన్నాయి.***

15 నిమిషాల వ్యవధిలోనే వైద్యం: చైనాలోని 90 శాతానికి పైగా ప్రజలకు తమ నివాసానికి కేవలం 15 నిమిషాల ప్రయాణ దూరంలోనే సమీప వైద్య కేంద్రాలు లభిస్తున్నాయి.

* భారీ ఆరోగ్య బీమా: దేశ జనాభాలో సుమారు 95 శాతం మంది ప్రాథమిక వైద్య బీమా పరిధిలోకి వచ్చారు.* పెరిగిన సగటు జీవితకాలం: 2025 నాటికి చైనా ప్రజల సగటు జీవితకాలం 79.25 సంవత్సరాలకు పెరిగింది.

* తగ్గిన మరణాల రేటు:

**శిశు మరణాల రేటు ప్రతి వెయ్యి మందికి 3.8కి,**

మాతృ మరణాల రేటు ప్రతి లక్ష మందికి 13.4కి తగ్గాయి. ఈ పురోగతితో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గుర్తించిన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన దేశాల జాబితాలో చైనా నిలిచింది.

ప్రపంచ ఆరోగ్య రంగంలోనూ క్రియాశీల పాత్ర:చైనా కేవలం తన అంతర్గత ఆరోగ్య వ్యవస్థనే కాక, ప్రపంచ ఆరోగ్య పాలనలోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. సాంప్రదాయ చైనీస్ వైద్యం (TCM) ఇప్పటికే 190కి పైగా దేశాలు మరియు ప్రాంతాలకు విస్తరించింది.

**2012 చివరి నుండి చైనా సుమారు 59 దేశాలకు వైద్య సహాయ బృందాలను పంపించింది.**

అంతేకాకుండా, కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు అవసరమైన నివారణ మరియు చికిత్స సామాగ్రిని సరఫరా చేసింది.ప్రజల ఆరోగ్యమే సామ్యవాద ఆధునీకరణకు ముఖ్య సూచిక అని, చైనా రాబోయే రోజుల్లో కూడా 'హెల్తీ చైనా ఇన్షియేటివ్'ను మరింత ముందుకు తీసుకెళ్తూ, ప్రపంచ ఆరోగ్య సహకారంలో భాగస్వామ్యమై మానవాళి శ్రేయస్సుకు మరిన్ని సేవలు అందిస్తుందని జిన్హువా తన కథనంలో పేర్కొంది.

## జెండాను వ్యతిరేకించేవారే నిజమైన దేశద్రోహులు

**న్యూఢిల్లీ :**

జంతర్ మంతర్‌లో జాతీయ జెండాను ఎగురవేయడాన్ని చట్ట ఉల్లంఘనగా భావించేవారే దేశద్రోహులని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేత అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. తీయ జెండాను ఎగురవేసినందుకు నిరసనకారులను అరెస్టు చేయడంపై ఢిల్లీ పోలీసుల చర్యలను ఖండించారు. ఈ అరెస్టుల్లో చట్ట బద్ధత, నైతికత ఏమిటని ప్రశ్నించారు. నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసినంత మాత్రాన ప్రజల నిరసన హక్కును అణచివేయలేరని స్పష్టం చేశారు. నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసిన నేపథ్యంలో, పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి అక్కడికి ప్రవేశించేందుకు సిజెపి కార్యకర్తలు యత్నించారు. తెల్లవారుజామున జాతీయ జెండాలతో అక్కడికి చేరుకున్న అశుతోష్ రాంకా, సౌరబ్ దాస్,



అజింక్య షిండే సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిరసన ప్రారంభించిన కొద్దిసేపటికే భద్రతా సిబ్బంది వారిని అరెస్టు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. జాతీయ జెండాను ఎగురవేయడం ఎప్పటి నుంచి చట్ట ఉల్లంఘనగా మారిందని దీప్కే నిలదీశారు. జంతర్ మంతర్‌లో జాతీయ జెండాను ఎగురవేయడం తప్పని భావించేవారే దేశద్రోహులని అన్నారు. జాతీయ జెండాను ఎగరవేసేందుకు యత్నించిన సౌరబ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే తదితరులపై కేసులు నమోదు చేశారని అన్నారు. ఇప్పుడు మనం ఏ దేశంలో ఉన్నామని, ఇది ఎటువంటి పాలన అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు వరకు ఆందోళనను కొనసాగిస్తామని దీప్కే ప్రకటించారు. తాము జంతర్‌మంతర్‌లో జాతీయ జెండాను ఎగరవేసి తీరుతామని స్పష్టం చేశారు.

## ఢిల్లీ పోలీసుల దాష్టీకంపై నిరసన

**న్యూఢిల్లీ :**

సిపిఎం సీనియర్ నాయకులు, కార్యకర్తలపై ఢిల్లీ పోలీసుల దాడులు, నిర్బంధాలను వివిధ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. సిపిఎంకు సంఘీభావం తెలిపాయి. ఢిల్లీ పోలీసుల అణచివేతను బ్రెజిల్ కమ్యూనిస్ట్ పార్టీ (పిసిడిఓబి), గ్రీస్ కమ్యూనిస్ట్ పార్టీ (కెకెఇ), టర్కీ కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ (టికెపి) వేర్వేరు ప్రకటనలలో ఖండించాయి. సిపిఎం నాయకత్వానికి సందేశాలు పంపాయి. టికెపి తన ప్రకటనలో కార్మిక వర్గ ఉద్యమంపై పెరుగుతున్న అణచివేతకు ఈ ఘటన మరో ఉదాహరణ అని పేర్కొంది. కమ్యూనిస్టు శక్తులను అణచివేసి, తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను మలచడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించింది. సిపిఎంకు తమ సంఘీభావాన్ని పునరుద్ఘాటిస్తూ, శ్రామిక ప్రజల పోరాటాలు, ఆకాంక్షల నుండి పుట్టిన ఒక పార్టీని బెదిరింపులు, ప్రభుత్వ అణచివేత అణచివేయలేవని టికెపి పేర్కొంది. పిసిడిఓబి తన ప్రకటనలో శాంతియుత నిరసనలపై పోలీసుల చర్యను ఖండించింది. సిపిఎం నాయకులు, ఎంపిలు, కార్యకర్తలను నిర్బంధించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. నిరసనకారులపై దాడి చేసి, వారిని బలవంతంగా బస్సుల్లోకి ఎక్కించారని, అదుపులోకి తీసుకున్న పార్టీ నాయకులకు ఆహారం, నీరు లేదా నిత్యావసర మందులు అందకుండా గంటల తరబడి పోలీసు వాహనాల్లోనే ఉంచారని విమర్శించింది. అరెస్టయిన మహిళలకు కనీసం మరుగుదొడ్ల సౌకర్యాన్ని కూడా నిరాకరించారని తెలిపింది. పోలీసుల అణిచివేత చర్యపై తక్షణ విచారణ జరపాలని పిలుపునిచ్చింది.ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేసింది. అదుపులో ఉన్న వారిని విడుదల చేయాలని, నిరసన తెలిపే హక్కును వినియోగించుకున్న వారిపై అభియోగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. సిపిఎం నాయుకులతో పాటు విద్యార్థులు, కార్మికులు, పాత్రికేయులు, క్షేత్రస్థాయి సంస్థలపై జరుగుతున్న వేధింపులను అంతం చేయాలని కూడా డిమాండ్ చేసింది.



అదేవిధంగా, కెకెఇ తన ప్రకటనలో సిపిఎం, దాని యువజన విభాగమైన డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) నాయకులు, సభ్యులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వేధింపులు, హింస, అరెస్టులను ఖండించింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ ప్రదర్శనలు జరిగాయని కెకెఇ పేర్కొంది. అలాగే, ఎంఎ బేబీ, పినరయి విజయన్, పొలిట్ బ్యూరో సభ్యులు, రాజ్యసభ ఎంపీలు జె. బ్రిటాస్, వి. శివదాసన్‌లతో పాటు మరి కొందరు నేతల నిర్బంధించడాన్ని కెకెఇ ప్రముఖంగా ప్రస్తావించింది. అరెస్టు అయిన వారందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసన తెలుపుతూ తమ హక్కుల కోసం పోరాడుతున్న సిపిఎం, డివైఎఫ్ఐ, ఇతరులకు సంఘీభావం తెలిపింది.మొత్తంగా ఈ మూడు పార్టీలు కూడా పోలీసు చర్యలు, రాజకీయ స్వేచ్ఛ, అసమ్మతి తెలిపే హక్కుపై తమ ఆందోళనలను ప్రముఖంగా ప్రస్తావించాయి. సిపిఎంకు, నిరసనకారుల ప్రజాస్వామ్య హక్కులకు తమ సంఘీభావాన్ని పునరుద్ఘాటించాయి.

## మద్రాస్ హైకోర్టులో టివికెకు ఉపశమనం

**చెన్నై :**

తమిళనాడు పాలక పార్టీ టివికెకు మద్రాస్ హైకోర్టు ఉపశమనం కలిగించింది. ఆరుగురు అన్నాడిఎంకె ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తూ తమిళనాడు స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ తీసుకున్న నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు మంగళవారం సమర్థించింది. చీఫ్ జస్టిస్ ఎస్.ఎ.ధర్మాధికారి, జస్టిస్ జి. అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం ఈవ్యవహారాన్ని విచారించి, ఎమ్మెల్యేల రాజీనామాలు వాస్తవమైనవేనని నిర్ధారించింది. అన్నాడిఎంకె ఎమ్మెల్యేల రాజీనామాలు వారిపై అనర్హత వేటు వేసే ప్రక్రియకు అడ్డుకావని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే, ఈ ప్రక్రియను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. స్పీకర్ నిర్ణయం చెల్లుబాటు అవుతుందని, విస్తృతమైన విచారణ అవసరం లేదని



పేర్కొంది.సి.విజయభాస్కర్, మరగతం కుమారవేల్, సత్యభామ, ఇసాక్కి సుబ్బయ్య, జయకుమార్, ఎం.ఆర్.విజయభాస్కర్‌లు ఈ ఏడాది ప్రారంభంలో తమ పదవులకు రాజీనామా చేసి, సిఎం విజయ్ నేతృత్వంలోని టివికెలో చేరారు. అసెంబ్లీ స్పీకర్ వారి రాజీనామాలను ఆమోదించారు. దీంతో ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ అన్నాడిఎంకె విప్ అగ్రి కృష్ణమూర్తి, నేషనల్ పీపుల్స్ పవర్ పార్టీ నేత రవిలు పిటిషన్‌లు దాఖలు చేశారు. రాజీనామాలను ఆమోదిస్తూ స్పీకర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిటిషనలో ఆరోపించారు.

పార్టీ విప్‌ను ఉల్లంఘించి టివికె ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేశారన్న కారణంతో ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ దాఖలైంది. మద్రాస్ హైకోర్టు విచారణకు ముందు, అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్..





**స్టాక్ హోమ్ :**

ఆర్థిక శాస్త్రంలో 2026 సంవత్సరానికి గాను ఇద్దరికి నోబెల్ బహుమతి వరించింది. అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ హాల్, మైఖేల్ వుడ్ఫోర్డ్‌కు నోబెల్ కమిటీ పురస్కారం ప్రకటించింది. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు అనే అంశంపై వీరు చేసిన పరిశోధనలకు గుర్తింపు దక్కింది. సోమవారం స్టాక్‌హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో ఇదే చివరిది.

**ఆర్థిక స్థిరత్వానికి కొత్త నమూనాలు-** ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు వివిధ ఆర్థిక విధానాలకు అవసరమైన, ఏ సమయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయో అటువంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని రాబర్ట్ ఇ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేశారు. వారి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకోవడానికి, విధాన నిర్ణయాల ప్రభావాన్ని అంచనా వేయడానికి పాలకులకు ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, వినియోగం వంటి అంశాల మధ్య సంబంధాలను మాత్రమే పరిశీలించకుండా, వ్యక్తులు, కుటుంబాలు, వ్యాపార సంస్థలు తీసుకునే నిర్ణయాలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఎలా ప్రభావం చూపుతాయో వివరించేందుకు వీరి పరిశోధనలు దోహదపడ్డాయి. గతంలో ఆర్థిక వ్యవస్థలోని వివిధ అంశాల మధ్య కనిపించే గణాంక సంబంధాల ఆధారంగా అనేక నమూనాలను రూపొందించేవారు. అయితే హాల్, వుడ్‌ఫోర్డ్ వ్యక్తిగత ఆర్థిక నిర్ణయాలకు ప్రాధాన్యం ఇచ్చే **సూక్ష్మ ఆర్థిక సూత్రాల ఆధారంగా స్థూల ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేశారు.**

ఆ పరిశోధనల ఫలితంగా అభివృద్ధి చెందిన న్యూ కీనేసియన్ ఆర్థిక నమూనాలు ప్రస్తుతం కీలకంగా మారాయి.

ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఏర్పడినప్పుడు దాన్ని అధిగమించేందుకు, ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు దాన్ని అదుపు చేసేందుకు ఎలాంటి విధానాలు అవసరమో విశ్లేషించడంలో ఇవి సహాయపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు **దేశాల కేంద్ర బ్యాంకులు, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ఇటువంటి** నమూనాలను ఉపయోగిస్తున్నాయి. ప్రభుత్వాలు పన్నులు, ప్రభుత్వ వ్యయం వంటి అంశాల్లో మార్పులు చేయడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను ప్రభావితం చేయగలవు. అలాగే కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు, ద్రవ్య సరఫరా వంటి అంశాల ద్వారా ఆర్థిక వ్యవస్థలో మార్పులకు ప్రయత్నిస్తాయి. ఈ చర్యలను సరైన సమయంలో తీసుకోవడం ద్వారా ఆర్థిక ఒడుదొడుకుల తీవ్రతను తగ్గించవచ్చని వీరి పరిశోధనలు వివరించాయి. **1969లో ప్రారంభమైన ఆర్థిక శాస్త్ర నోబెల్** ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని అధికారికంగా ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర పురస్కారం అని పిలుస్తారు.

**స్వీడన్ కేంద్ర బ్యాంకు స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ 1968లో తన 300వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది.**

తొలి బహుమతిని 1969లో రాగ్నర్ ఫ్రిష్, జాన్ టిన్‌బెర్గెన్‌లకు అందించారు. ఇది ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు పురస్కారాల్లో ఒకటి కాదు. అయితే, ఇతర నోబెల్ పురస్కారాల మాదిరిగానే దీనిని కూడా రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది. ఈ పురస్కారం కింద విజేతలకు 12 మిలియన్ స్వీడిష్ క్రోనర్లు అందజేస్తారు. ఇది సుమారు 1.2 మిలియన్ అమెరికా డాలర్లకు సమానం.

## ఆజాద్ మైదాన్ నుండి ఫ్రీడమ్ పార్క్ వరకు...

**న్యూఢిల్లీ :**

కోల్‌కతా, ముంబై, చెన్నై వంటి మహానగరాల నుంచి జైపూర్, పనాజీ వంటి చిన్న నందల వరకు దాదాపు ప్రతి పట్టణంలోనూ చరిత్రతో ముడిపడిన సొంత నిరసన వేదికలు ఉన్నాయి. కాలక్రమేణా ప్రజా సౌకర్యం పేరిట వీటిలో కొన్నింటిని రద్దు చేయగా, మరికొన్ని నేటికీ వాక్ స్వాతంత్ర్య కేంద్రాలుగా లేదా ప్రతిఘటనా వేదికలుగా కొనసాగుతున్నాయి.వీటిలో కొన్ని బ్రిటిష్ పాలనలో అణచివేతకు గురైన ప్రదేశాలు కాగా, మరికొన్ని అసలు సత్యాగ్రహి అయిన మహాత్మా గాంధీతో ఉన్న అనుబంధం కారణంగా విశేష గుర్తింపు పొందాయి. తాజాగా దేశ రాజధాని నడిబొడ్డున ఉన్న జంతర్ మంతర్‌ను ఢిల్లీ పోలీసులు నిరసన ప్రదేశంగా రద్దు చేయడంతో, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర "జంతర్ మంతర్"ల మీద దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నిరసన వేదికల్లో కొన్నింటి ప్రత్యేకతలు ఇక్కడ చూద్దాం:

**ఆజాద్ మైదాన్, ముంబై :**

అప్పట్లో 'ఎస్ప్లానేడ్' అని పిలువబడే విశాలమైన భూభాగంలో భాగమైన ఈ మైదాన్... 1857 తిరుగుబాటు సమయంలో బహిరంగ ఉరిశిక్షలకు వేదికగా ఉండేది. ఆ తర్వాత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయవాద నిరసనలకు ఇది ముఖ్యమైన వేదికగా మారింది. 1931లో మహాత్మా గాంధీ ఇక్కడ ఒక భారీ బహిరంగ సభను నిర్వహించారు.ఇక్కడికి కొద్ది దూరంలోనే ముంబైకి చెందిన మరో నిరసన వేదిక 'ఆగస్టు క్రాంతి మైదాన్' ఉంది. ఇక్కడి నుంచే 1942లో గాంధీజీ 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించారు. అలాగే ప్రధాన రాజకీయ సభలకు వేదికగా నిలిచే 'శివాజీ పార్క్' కూడా దీనికి సమీపంలోనే ఉంది.

**ఫ్రీడమ్ పార్క్, బెంగళూరు :**

లండన్‌లోని హైడ్ పార్క్ తరహాలో రూపొందించబడిన ఈ పార్క్‌లో బహిరంగ సభలు, నిరసనల కోసం ప్రత్యేక స్థలం కేటాయించబడింది. మొదట ఇక్కడ బ్రిటిషర్లు నిర్మించిన కేంద్ర కారాగారం ఉండేది. చాలా మంది స్వాతంత్ర్య సమరయోధులు ఇక్కడ శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం ఎమర్జెన్సీ కాలంలో అనేక మంది ప్రతిపక్ష నాయకులను ఇక్కడే నిర్బంధించారు. అనంతరం 2008లో ఇది 'ఫ్రీడమ్ పార్క్'గా రూపాంతరం చెందింది. ఇందులో ఒక జైలు మ్యూజియం కూడా ఉంది.

**బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్, కోల్‌కతా :**

ప్లాసి యుద్ధ విజయం తర్వాత బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దళాల కోసం ఏర్పాటు చేసిన పరేడ్ గ్రౌండే ఈ బ్రిగేడ్ పరేడ్ మైదాన్. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా దేశబంధు చిత్తరంజన్ దాస్ నిర్వహించిన సభతో సహా ఇది స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఒక ప్రధాన నిరసన వేదికగా మారింది.భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ నాయకులకు ఇక్కడ బహిరంగ స్వాగతం పలికారు. పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించి బంగ్లాదేశ్ ఏర్పడిన తర్వాత ఇందిరాగాంధీ ముజిబుర్ రెహమాన్‌ను ఇక్కడి వేడుకకు ఆహ్వానించారు. వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ వంటి తదనంతరం అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ ఇక్కడ భారీ బహిరంగ సభలు నిర్వహించాయి. కోల్‌కతాలో ఎస్ప్లానేడ్ సమీపంలోని రాణి రాష్మణి అవెన్యూ, షహీద్ మినార్ మైదాన్, కాలేజ్ స్క్వేర్ వంటి ఇతర నిరసన వేదికలు కూడా ఉన్నాయి.



**గాంధీ మైదాన్, పాట్నా :**

గంగా నది ఒడ్డున ఉన్న ఈ విశాలమైన మైదాన్‌ను గతంలో 'పాట్నా లాన్స్', 'బంకీపూర్ మైదాన్' అని పిలిచేవారు. సైనిక విన్యాసాలు, గుర్రపు పందాలు, పోలో, గోల్ఫ్ కోర్సుల కోసం బ్రిటిషర్లు ఈ మైదాన్‌ను అభివృద్ధి చేశారు. చంపారణ్ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలకు ఇది కీలక వేదికగా నిలిచింది.1938లో ముహమ్మద్ అలీ జిన్నా ఇక్కడ ముస్లిం లీగ్ సమావేశాన్ని నిర్వహించగా, 1939లో సుభాష్ చంద్రబోస్ ఫార్వర్డ్ బ్లాక్ సమావేశం జరిపారు. స్వాతంత్ర్యం తర్వాత, జయప్రకాష్ నారాయణ్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా 'సంపూర్ణ విప్లవం' పిలుపునిచ్చిన జేపీ ఉద్యమానికి ఇది కేంద్ర బిందువుగా మారింది.

**తిలక్ ఘాట్, చెన్నై :**

బాలగంగాధర్ తిలక్ పేరు మీదుగా మెరీనా బీచ్‌లో ఉన్న ఈ ప్రాంతం స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన నిరసన వేదిక. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, అనిబిసెంట్ వంటి ప్రముఖ నాయకులు ఇక్కడ జరిగిన సభల్లో పాల్గొన్నారు. అయితే ప్రస్తుతం ఇది నిర్దేశిత నిరసన వేదిక కాదు.

చెన్నైలోని ఇతర నిరసన వేదికలలో వల్లూవర్ కొట్టమ్, స్వామి శివానంద సాలై ఉన్నాయి. వల్లూవర్ కొట్టమ్‌లో ప్రదర్శనలకు అనుమతులు నిలిపివేసిన నేపథ్యంలో, 2025 మార్చిలో పోలీసులు 'స్వామి శివానంద సాలై'ని ప్రత్యామ్నాయ నిరసన వేదికగా కేటాయించారు.

**బోట్ క్లబ్, ఢిల్లీ :**

జంతర్ మంతర్ కేవలం అబ్జర్వేటరీ కాకుండా నిరసన వేదికగా గుర్తింపు పొందకముందే... పార్లమెంట్, రాష్ట్రపతి భవన్ సమీపంలోని బోట్ క్లబ్ లాన్స్ ర్యాలీలు, నిరసనలకు ప్రధాన వేదికగా ఉండేది. ట్రాక్టర్లు, పశువులతో ఐదు లక్షలకు పైగా భారీ జనసందోహాన్ని సమీకరించి మహేంద్ర సింగ్ తికాయత్ ఆధ్వర్యంలో జరిగిన 1988 రైతు ఆందోళన తర్వాత బోట్ క్లబ్‌లో నిరసనలపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. 1993లో బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం బోట్ క్లబ్‌లో నిరసనలను పూర్తిగా నిషేధించారు.

**అయితే 2018 కోర్టు ఉత్తర్వుల ప్రకారం జంతర్ మంతర్‌తో పాటు ఇది కూడా కొంతకాలం** నిరసన వేదికగా అనుమతి పొందింది. లుట్యెన్స్ ఢిల్లీలోని ఈ రెండు ప్రాంతాలకు దూరంగా ఉన్న 'రామ్ లీలా మైదాన్' నేటికీ నిరసనలకు అధికారిక వేదికగా కొనసాగుతోంది. జమ్మూ కాశ్మీర్‌ను భారత యూనియన్‌లో పూర్తిగా విలీనం చేయాలని కోరుతూ శ్యామప్రసాద్ **ముఖర్జీ 1952లో ఇక్కడే సత్యాగ్రహాన్ని ప్రారంభించారు.**

ఎమర్జెన్సీ ప్రకటించిన రోజైన 1975 జూన్ 25న సోషలిస్ట్ నాయకుడు జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 2011 నాటి అవినీతి వ్యతిరేక ఉద్యమానికి కూడా ఇదే వేదికైంది. దేశంలోని మిగతా నగరాలకు కూడా సొంత నిరసన వేదికలు ఉన్నాయి. లక్నోలో 'ఎకో గార్డెన్', పనాజీలో 'ఆజాద్ మైదాన్' 'కంపాల్ పరేడ్ గ్రౌండ్', హైదరాబాద్‌లో 'ధర్నా చౌక్', 'గన్ పార్క్', 'లిబర్టీ సర్కిల్', అలాగే జైపూర్‌లో 'షహీద్ స్మారక్' వంటివి నిరసనలకు కేటాయించిన ప్రముఖ ప్రదేశాలుగా ఉన్నాయి.

## యెమెన్‌లోని పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు

**సనా :**

యెమెన్‌లోని పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగినట్లు హౌతీలు మంగళవారం పేర్కొన్నారు. ఎర్ర సముద్రంలోని కమరాన్ ద్వీపంపై రెండు వైమానిక దాడులు జరిగాయని, అలాగే హోడెయిడా రేవు నగరానికి వాయువ్యంగా 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖనవిస్ జిల్లాపై మూడవ దాడి జరిగిందని స్థానిక మీడియా అల్‌మసీరా పేర్కొంది. సౌదీ అరేబియా సరిహద్దులో ఉన్న జౌఫ్ ప్రావిన్స్‌లో కూడా వైమానిక దాడులు జరిగినట్లు నివేదించింది. ఈదాడులకు సౌదీ అరేబియా కారణమని మీడియా పేర్కొంది.



ఉత్తర యెమెన్‌లోని సాదా ప్రావిన్స్‌పై సౌదీ డ్రోన్‌ను కూల్చివేశామని హౌతీలు పేర్కొన్నారు. సౌదీ సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతం హౌతీల కంచుకోటగా ఉంది. రియాద్‌లోని ఖలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు తాము ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు హౌతీలు కూడా తెలిపారు. సోమవారం సౌదీ అరేబియా రియాద్‌లో వైమానిక దాడికి సంబంధించి సైరన్ మోగించిన కొన్ని గంటలకే ఈ పేలుళ్లు జరగడం గమనార్హం.

## ఎస్‌కెఎం సంచలన నిర్ణయం: ఢిల్లీ ముట్టడి

**న్యూఢిల్లీ:**

దేశంలో రైతు ఉద్యమాన్ని మరోసారి ఉధృతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నవంబర్ 26న ఢిల్లీతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రకటించింది. చారిత్రాత్మక దిల్లీ రైతు ఉద్యమ ఆరవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.అక్టోబర్ 12న హర్యానాలోని కర్నాల్‌లో జరిగిన ఎస్‌కెఎం నేషనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి 17 రాష్ట్రాల నుంచి 142 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఎస్ఐఆర్‌తో ముడిపడి ఉన్న విషయాలపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతకు మద్దతుగా అక్టోబర్ 23న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా/తాలూకా కేంద్రాల్లో భారీ ప్రజా ప్రదర్శనలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.ఢిల్లీలో విద్యార్థినులతో సహా ఆందోళనకారులపై జరిగిన అణిచివేతను, పోలీసు చర్యలను ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. శాంతియుత నిరసనలను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, ఆందోళనకారులను రక్షించేందుకు రైతులు ముందుకు వస్తారని నాయకత్వం స్పష్టం చేసింది. దేశ రాజధానిలో జరిగిన పరిణామాలపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయకపోవడాన్ని ఈ సమావేశం తప్పు పట్టింది. శాంతిభద్రతల క్షీణతను నివారించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఏకం కావాలని ఎస్‌కెఎం పిలుపునిచ్చింది.ప్రధాన డిమాండ్లు: కనీస మద్దతు ధర (MSP) చట్టాన్ని తీసుకురావడం. ఓటర్ల జాబితా సవరణను తక్షణమే నిలిపివేయడం, ఓటు హక్కు కోల్పోయిన 13.41 కోట్ల మంది పౌరుల హక్కులను పునరుద్ధరించడం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను తొలగించడం. రైతుల రుణాలన్నీ మాఫీ చేయడం మరియు ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ. 25 లక్షల నష్ట పరిహారం అందించడం. విద్యుత్ ప్రైవేటీకరణను మరియు సీడ్ బిల్లు 2025ను విరమించుకోవడం.స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (Free Trade Agreements) రద్దు చేయడం. రైతులు, ఆదివాసీలకు భూ హక్కులను భద్రపరచడం. లేబర్ కోడ్‌లను రద్దు చేయడం మరియు ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేయడం. రైతులకు పింఛను, భీమా రక్షణ కల్పించడం.ఈ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకు సుదీర్ఘకాలం పాటు నిరసనలకు సిద్ధంగా ఉండాలని దేశంలోని రైతాంగానికి సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు రూ. 4.26 కోట్లు మంజూరు**

**కంబోడియా, థాయ్‌లాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు**

**ఖమ్మంవుదయం బ్యూరో**
**నేలకొండపల్లి, అక్టోబర్ -13**




జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణపై బౌద్ధ బిక్షువుల సలహాలు, సూచనలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని తెలిపారు. నేలకొండపల్లి లో గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం, బౌద్ధ విహారాలు, సమావేశ మందిరాలు, ఇతర బౌద్ధ నిర్మాణాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పురావస్తు ఆధారాలు ప్రాచీన కాలంలో నేలకొండపల్లి ప్రముఖ బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిందని తెలియజేస్తున్నాయని, ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతోపాటు, దేశవిదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు. కేవలం ఒక భవన నిర్మాణంలా కాకుండా, బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా, దానికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన కోసం పురావస్తు శాఖ సంచాలకులతో పాటు బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కూడిన ఒక నిపుణుల కమిటీ (కోర్ టీమ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటకులకు అవసరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ. 1.76 కోట్ల వ్యయంతో ప్రాచీన బౌద్ధ విహారాలు, సమావేశ మందిరం, సంబంధిత పురావస్తు నిర్మాణాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధులను వైటీపీఎస్, తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చుకున్నట్లు అన్నారు. పురావస్తు కట్టడాల అసలు నిర్మాణ స్వరూపం, చారిత్రక ప్రాధాన్యత, నిర్మాణ శైలి దెబ్బతినకుండా శాస్త్రీయ పరిరక్షణ పద్ధతుల్లో పనులను చేపట్టనున్నట్లు హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ తెలిపారు. కంబోడియా, థాయ్‌లాండ్, భారత దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నేలకొండపల్లి ప్రాచీన బౌద్ధ క్షేత్రం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతపై ఆసక్తి వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మహాస్తూపం, బౌద్ధ విహారాలు, ఇతర ప్రాచీన నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, ప్రపంచ బౌద్ధ యాత్రికులను ఆకర్షించే ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. ఇట్టి చర్చల్లో హెరిటేజ్ తెలంగాణ శాఖ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు, పర్యాటక రంగ నిపుణులు, కన్సల్టెంట్లతోపాటు ఆంజనేయ రెడ్డి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సలహాలు, సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డా. పి. నాగరాజు, ఎన్. నరసింగ్, సూపరింటెండెంట్ ఎ. రాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, హైదరాబాద్ ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా. ఇ. శివనాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు, పురావస్తు పరిశోధకులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండోలో మునుగోడు గురుకుల విద్యార్థినుల పతకాల పంట




రెండు రజతాలు.. ఒక కాంస్యం కైవసం

**నల్గొండ జిల్లా**
**వుదయం ప్రతినిధి, అక్టోబర్ 13**

నల్లగొండ పట్టణంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న నల్గొండ జిల్లా మునుగోడులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. వికారాబాద్ జిల్లా పరిగి మినీ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 17 బాలబాలికల తైక్వాండో పోటీల్లో మూడు పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన పి. గిరిజ, కె. తేజశ్రీ రజత పతకాలు సాధించగా.. వి. ప్రణవి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చాటడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. తైక్వాండో ఎన్ఐఎస్ కోచ్ అంబటి ప్రణీత్ విద్యార్థినులకు శిక్షణ అందించి, రాష్ట్రస్థాయిలో రాణించేలా ప్రోత్సహించారు. పతక విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ కె. సంధ్యారాణి, పీడీ నాగమణి, పీఈటీ శ్రీలత, హౌస్ మేడమ్స్, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి ఈశ్వర్, వికారాబాద్ జిల్లా నిర్వాహణ కార్యదర్శి భూపాల్ కూడా విద్యార్థినులను అభినందించారు.చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు పేరు తీసుకురావడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**- న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె**
**హనుమకొండ, అక్టోబర్ 13**
**(వుదయం ప్రతినిధి) :**




తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న 17 వేల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్ హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోవిడ్ విపత్కర సమయంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల క్షేమమే పరమ పదిగా భావించి ప్రజల ప్రాణాలు కాపాడిన ఉద్యోగులను ఈ ప్రజా ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఆరోపించారు. హనుమకొండ జిల్లాలో 420 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పనిచేస్తున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు దృష్టి తీసుకొని సీఎం దృష్టికి తీసుకువెళ్లి రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని, కోరారు. అలాగే 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, 8 శాతం లాయల్టీ బోనస్, పీఆర్సీ ప్రయోజనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో ని 33 జిల్లాల ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నేటి నుంచి నిరవధిక సమ్మెను దిగుతున్నట్లు ప్రకటించారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ డా. పుట్ట మహేందర్ రావు,.జనరల్ సెక్రెటరీ రుక్మద్దీన్, కోశాధికారి నరేష్, జిల్లా ఎన్ హెచ్ ఎం జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపతి ప్రవీణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అభినందన్ రెడ్డి, ఏ ఎన్ ఎం వినోద, అనిత రెడ్డి,హనుమకొండ జిల్లా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ

**ఘనంగా బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేయాలి,**
**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**
**మహబూబాబాద్, అక్టోబర్.13.**
**(వుదయం జిల్లా ప్రతినిధి):**



సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ అని, జిల్లాలో ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు ఈ ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన సమస్యలు భద్రతలను నిర్ధారించడానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, బతుకమ్మ ఆడే ప్రదేశాలు చెరువులు కుంటలు దేవాలయాలు తదితర ప్రదేశాలలో ఏర్పాట్లు చేయాలని సంబంధిత మున్సిపల్, పంచాయతీరాజ్, అన్ని విభాగాల సిబ్బంది ని ఆయన ఆదేశించారు.దుర్గామాత విగ్రహాల నిమజ్జనం కోసం సూచించిన ప్రదేశాలలో క్రేన్, లైటింగ్ శానిటేషన్ రక్షణ (బందోబస్తు) ఏర్పాటు చేయాలని, మహిళలకు వేడుకలకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్త్రీ శిశు సంక్షేమ, మహిళా భద్రత, సఖి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ తదితర విభాగాల సంక్షేమ పథకాలు అమలు ప్రదర్శన ద్వారా బతుకమ్మ ఆటలు ఘనంగా నిర్వహించాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లా లోని ప్రతి ఒక్కరినీ, స్వచ్ఛంద సంస్థలను అన్ని వర్గాల వారిని ఈ వేడుకలలో భాగస్వాములను చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల వారు పక్కా ప్రణాళికతో బతుకమ్మ పండుగ నిర్వహించేందుకు కోఆర్డినేషన్ చేయాలని సూచించారు. జిల్లా లోని కళలను సాంస్కృతి సారథి ,ఇతర కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను, ప్రస్తుత ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అర్థమయ్యే విధంగా పాటలను రూపొందించి పాటలతో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కేంద్రం, పట్టణ, మునిసిపల్, గ్రామ పంచాయతీలలోని జరిగే బతుకమ్మ వేడుకలకు సంబంధించిన కార్యక్రమాల ఫోటోలను, వీడియోలను సేకరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ నాగలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా. రవి రాథోడ్, డీపీఓ. రమేష్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, అన్ని విభాగాల జిల్లా అధికారులు, సెక్షన్ పర్యవేక్షకులు పలు మండలాల ఎం.పి.డి.ఓ. లు మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దారులు పాల్గొన్నారు

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి..

**శాసనసభలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు**
**ప్రజాభవన్ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**
**భూపాలపల్లి, 13 అక్టోబర్**
**(వుదయం విలేకరి):**





సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా వారి సమస్యలను పరిష్కరించేందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేస్తున్న కృషిలో భాగంగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2026 వర్షాకాల శాసనసభ సమావేశాల్లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే జీఎస్సార్ శాసనసభ దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సింగరేణి ప్రాంతానికి చెందిన శాసనసభ్యులతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, ఆర్థిక ప్రయోజనాలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా, శాసనసభలో ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కృషి చేశారు. కేటీకే1, 8 ఇంక్లైన్ గేట్ మీటింగ్‌ల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు కార్మికుల హక్కులు, వారి కుటుంబాల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులకు పలు ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కార్మికులకు ప్రకటించిన కీలక ప్రయోజనాలు 34 శాతం లాభాల వాటా: సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా కింద మొత్తం రూ.1,754 కోట్ల పంపిణీకి సంబంధించిన ప్రకటన వెలువడింది. దీనివల్ల ఒక్కో కార్మికుడికి సగటున సుమారు రూ.1.54 లక్షలు అందే అవకాశం ఉందని దసరా సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 ప్రత్యేక ఆర్థిక ప్రయోజనం కల్పించే అంశాన్ని ప్రకటించారు. ప్రతి కార్మిక కుటుంబానికి ఇంటి స్థలం కల్పించాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలనే అంశం సమావేశంలో ప్రాధాన్యత పొందింది అధికారులకు అందుతున్న పెర్క్విజిట్స్ పన్ను మినహాయింపు సౌకర్యాన్ని కార్మికులకు కూడా వర్తింపజేసే అంశంపై నిర్ణయం తీసుకున్నారు.ఏళ్ల తరబడి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న మారుపేర్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. వివిధ కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానం ద్వారా తిరిగి ఉద్యోగంలోకి వచ్చే అవకాశం కల్పించే అంశంపై చర్యలు తీసుకుంటున్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేసి, 15 రోజుల్లో నియామక పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ కోసం కార్మికులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని నివారించేందుకు ఏరియా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నారు. అదేవిధంగా ఏరియా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల స్థాయికి అభివృద్ధి చేయాలనే అంశంపై దృష్టి సారించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం సింగరేణి కార్మికులు తమ శ్రమతో సంస్థ అభివృద్ధికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలకంగా నిలుస్తున్నారని, వారి కుటుంబాల సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం ముఖ్యమని ఎమ్మెల్యే పలుమార్లు పేర్కొన్నారు

## నేరాల నియంత్రణ పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**
**జయశంకర్ భూపాలపల్లి,అక్టోబర్ 13(వుదయం జిల్లా ప్రతినిధి):**



భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లాలో నేరాల పరిస్థితి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, నేర నియంత్రణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, ప్రతి కేసును బాధ్యతగా తీసుకొని బాధితులకు సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని స్పష్టం చేశారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేరస్థులకు చట్టప్రకారం శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ గుర్తించేందుకు సమన్వయంతో పనిచేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను తీవ్రంగా పరిగణించాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, ఆధారాల సేకరణ, కోర్టు విచారణకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో దొంగతనాల నివారణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో నమోదైన దొంగతనాల కేసులను సమీక్షిస్తూ నిందితులను గుర్తించడం, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించుకొని నేరాలను ఛేదించాలని, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని, సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతూ, గ్రామస్థాయిలో పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి విధుల్లో జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ, నేరాల నియంత్రణ, కేసుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ ఎ. సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## బస్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలి.**
**కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 13.**

వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న బస్‌స్టేషన్ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్‌చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయి తో కలిసి వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న బస్‌స్టేషన్ పనులను గుండు సుధారాణి పరిశీలించారు. బస్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన మ్యాపును పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా బస్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు అదనంగా కార్మికులను నియమించాలని సూచించారు. కాలమ్స్, స్లాబ్స్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఏకకాలంలో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కుడా ఈఈ భీమ్‌రావు, డీఈ జలాలుద్దీన్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## టి. యు .డబ్ల్యూ .జే .నూతన కమిటీకి

**ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం.**
**భూపాలపల్లి అక్టోబర్ 13**
**(వుదయం ప్రతినిధి):**

టేకుమట్ల మండలంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జర్నలిస్ట్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మారపల్లి రాజ కొమురయ్య ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ కోశాధికారి కన్నూరి రమేష్ భూపాలపల్లి డివిజన్ ఉప కార్యదర్శి దసారపు ప్రశాంత్ ను మర్యాద పూర్వకంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ రామచంద్ర మాదిగ దూడపాక శ్రీనివాస్ మాదిగ మండల నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు రేణికుంట్ల శంకర్ మాదిగ, అంబేద్కర్ యువజన మండల అధ్యక్షులు మారాపెల్లి కొమురయ్య,ఎమ్మార్పీఎస్ మండల ప్రధానకార్యదర్శి ఇల్లందుల శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి మచ్చ పైడి మాదిగ, ఎమ్మేస్ పి మండల ఉపాధ్యక్షులు ఎలుకటి నర్సయ్య మాదిగ, వికలాంగుల మండల అధ్యక్షులు అంబు కుమారస్వామి, వికలాంగుల మండల ప్రధానకార్యదర్శి తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ మచ్చ రాజయ్య, రమేష్, ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మారాపెల్లి చిన్న కొమురయ్య మాదిగ, సంపత్ పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి



యాదాద్రి భువనగిరి జిల్లా
(వుదయం ప్రతినిధి.):

జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వైద్య ఆరోగ్య శాఖ పనితీరు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా వైద్య సేవలు, గర్భిణుల నమోదు, ANC పరీక్షలు, ప్రసవానంతర సేవలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన గర్భిణులందరికీ సకాలంలో వైద్య పరీక్షలు అందేలా చూడాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై ప్రతి వైద్యాధికారి తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యేజారె




**దమ్మపేట అక్టోబర్ 13**
**(వుదయం ప్రతినిధి):**

దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు మెచ్చు రాణి W/O వెంకటేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో 'జీ తెలుగు' ఆధ్వర్యంలో నిర్వహించిన "గురు వందనం 2026" (గురు వందనం2026: ఎడ్యుకేషన్ కాన్క్లేవ్ & టీచర్స్ అవార్డ్స్ ) కార్యక్రమంలో ఆమె ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , కే.కేశవరావు తెలంగాణ ప్రభుత్వం ముఖ్య సలహాదారులు, ఎంపి ఈటల రాజేంద్ర , ఎమెల్యే హరీష్ రావు, ముఖ్య అతిథిగా హాజరుకాగా, మంత్రులు మరియు ప్రముఖులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు జిల్లా స్థాయిలో గుర్తింపు పొంది అవార్డు అందుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో కీలక పాత్ర పోషించడం గర్వకారణంగా ఉందని తెలిపారు. మెచ్చు రాణి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు...

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బేతి అశోక్ బాబుకు ఘన సన్మానం



**వరంగల్, అక్టోబర్ 13**
**(వుదయం ప్రతినిధి) :**

రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబును క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు రొటేరియన్ సోమ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ చిరంజీవి చేతన్ శౌర్యకు క్రీడల్లో మరింత రాణించేందుకు ఆర్థిక సహాయం అందజేశారు.

అలాగే రెడ్‌క్రాస్ సభ్యుడు తోట సంపత్‌తో పాటు వరంగల్ జిల్లా ఫోటోగ్రఫీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వంగరి వేణుగోపాల్‌ను సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే క్రీడాకారులను, ప్రతిభావంతులను ప్రోత్సహించడం అభినందనీయమని ప్రతినిధులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రొటేరియన్ నాయిని అనిల్ కుమార్, జూలూరి కృష్ణమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ పోరాడ్ల రత్నాకర్, కుమారస్వామి, కోరే చంద్రమౌళి, కొడం రాజేందర్, సుంకనపల్లి శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో నేడు బతుకమ్మ సంబరాలు. ముగ్గులు, పాటల పోటీలు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సతీష్ శారద.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబరు 13.**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. అక్టోబరు 14న సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉద్యోగులందరికీ పాటల పోటీలు, అంత్యాక్షరి, స్టాండప్ కామెడీ పోటీలు జరగనున్నాయి. అలాగే వివిధ శాఖల మధ్య ఉత్తమ బతుకమ్మ, ఉత్తమ వేషధారణ, ఉత్తమ బిందీ పోటీలను నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ కోరారు

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## లక్ష్యాన్ని సాధించే వరకు శ్రమించాలి

- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు కలెక్టర్ రాజర్షి షా సూచన

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 13:**

పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు పక్కా ప్రణాళికతో చదువుతూ, లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ప్రిలిమినరీ పరీక్షలతోపాటు శారీరక సామర్థ్య పరీక్షల్లోనూ రాణించేలా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో మంగళవారం ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కలెక్టర్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన ఉమాభారతిని శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యర్థులు క్రమం తప్పకుండా శిక్షణకు హాజరవుతూ, నిరంతరం అదే ఉత్సాహాన్ని కొనసాగించాలని సూచించారు. ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఫిజికల్ ఈవెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసు శాఖ సహకారంతో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఎక్కువ పాఠ్యాంశాలను చదవడం కంటే పరిమితమైన అంశాలను పదేపదే పునశ్చరణ చేయడం ఉత్తమమని సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నపత్రాల సాధన చేయడం విజయానికి దోహదపడుతాయని వివరించారు. అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని చేరుకుని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్, రమేష్, అధ్యాపకులు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ-సర్వే

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల /అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు భూముల హద్దులను పక్కాగా నిర్ధారించి, భూ రికార్డులలో పారదర్శకత లక్ష్యంగా ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండలం కోనంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రతి మండలంలో తొలి విడతగా 2 గ్రామాలను ఎంపిక చేసి ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాత భూ రికార్డులలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూముల విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. కొన్ని సందర్భాలలో వాస్తవంగా ఉన్న భూమి కంటే రికార్డులలో ఎక్కువ విస్తీర్ణం నమోదవడం, భూమి ఎక్కువగా ఉన్నప్పటికీ రికార్డులలో తక్కువగా నమోదవడం, భూ ఆక్రమణలు, హద్దుల వివాదాలు, గ్రామాల సరిహద్దులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే ద్వారా ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో కొలిచి, హద్దులను సాంకేతిక పరికరాల సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి సంబంధిత రికార్డులు, మ్యాపులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల సరిహద్దులలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల ఆక్రమణలకు



సంబంధించిన సమస్యలను రీసర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీసర్వే నిర్వహించే తేదీకి సంబంధించి భూయజమానులకు ముందుగానే నోటీసులు అందజేయడం జరుగుతుందని, భూముల కొలతలు నిర్వహించే తేదీకి కనీసం వారం రోజుల ముందే సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నోటీసులో పేర్కొన్న తేదీన భూయజమానులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించి, రికార్డులలో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలతో మ్యాపులు రూపొందిస్తామని, భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు సంబంధిత రికార్డులు, మ్యాపుల ఆధారంగా భూమి బదిలీ వివరాలను నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా భూముల హద్దుల విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించడంతో పాటు, భూముల యాజమాన్య వివరాలను స్పష్టంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. భూముల రికార్డుల నిర్వహణ మరింత పారదర్శకంగా మారుతుందని తెలిపారు. భూయజమానుల సహకారం ఉంటే నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేసి, సంబంధిత మ్యాపులను సిద్ధం చేయడంతో పాటు, నిబంధనల ప్రకారం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల జారీకి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని నెన్నెల మండలంలోని 2 గ్రామాలలో, తాండూరు మండలంలోని రాంపూర్ గ్రామంలో రీసర్వే నిర్వహించగా, సుమారు 95 శాతం వరకు సమస్యలు పరిష్కారమయ్యాయని, వారసత్వంగా వచ్చిన భూముల పంపకం, కుటుంబ సభ్యుల మధ్య భూముల వాటాల విషయంలో ఒప్పందాలు లేకపోవడం వంటి కొన్ని సమస్యలు మినహా, అనేక భూ వివాదాలను పరిష్కరించేందుకు రీసర్వే దోహదపడిందని తెలిపారు. అంతకుముందు మండల కేంద్రంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గోదావరి పుష్కర ఘాట్ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోమనపల్లి లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

- గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 13 అక్టోబర్ 2026**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం బాసరలో పర్యటించిన కలెక్టర్, ముందుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతి పై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించాలని సూచించారు. ఆలయ నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
అనంతరం రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి నది తీరంలోని పుష్కర ఘాట్లను పరిశీలించి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని, వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో జాబ్ మేళా

**కామారెడ్డి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 15102026 (గురువారం) రోజున ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో గల రూమ్ నెంబర్ 121, జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, కామారెడ్డి నందు ఈ జాబ్ మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ జాబ్ మేళాలో Svasantra Micro Fin Ltd., కామారెడ్డి సంస్థలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఖాళీల వివరాలు చేరియాల్ బ్రాంచ్ - 10, రామాయంపేట బ్రాంచ్ - 10, మాచారెడ్డి బ్రాంచ్ - 5.
పోస్టు: ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్




(లోన్ డిస్బర్స్‌మెంట్ & కలెక్షన్)
విద్యార్హత: 10వ తరగతి నుండి ఏదైనా డిగ్రీ వరకు
వయస్సు: 18 నుండి 30 సంవత్సరాలు
జీతం: నెలకు రూ. 15,000/ ఇన్సెంటివ్స్
ఇతర సౌకర్యాలు: పెట్రోల్ అలవెన్స్, వసతి, భోజన సదుపాయం.
నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు 2 సెట్ల బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫోటోలతో హాజరు కావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 89856 12908, 63057 43423 సంప్రదించాలన్నారు.

# ఎస్సీ ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- జిల్లాలో ఈ ఏడాది 79 అట్రాసిటీ కేసులు నమోదు
- బాధితులకు 6.90 కోట్ల రూపాయల పరిహారం చెల్లింపు
- గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహణకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహణ

**జగిత్యాల అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

ఎస్సీ ఎస్టీల పై అఘాయిత్యాల నిరోధక చట్టం అమలులో భాగంగా బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆదేశించారు ఎస్సీ ఎస్టీ లపై అఘాయిత్యాల నిరోధక చట్టం (సవరణ)2015 పౌర హక్కుల పరిరక్షణ చట్టం1955 అమలుపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 79 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 20 కేసులు నిరూపితమయ్యాయని మిగిలిన కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయని వివరించారు అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో కలెక్టరేట్ స్థాయిలో ఎలాంటి ప్రతిపాదనలు పెండింగ్‌లో లేవని తెలిపారు జిల్లాలో మొత్తం 7.60 కోట్ల రూపాయల పరిహారానికి గాను ఇప్పటివరకు 6.90 కోట్ల రూపాయలు చెల్లించామని మిగిలిన 79 లక్షలు రూపాయలు ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు ఎస్సీ ఎస్టీల హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెల గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు జనన మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆలస్యంగా ధ్రువీకరణ పత్రాలు పొందడం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించాలని తెలిపారు పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులకు సకాలంలో పత్రాలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఎస్సీ ఎస్టీ బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులు ఫిర్యాదుల కోసం పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు అధికారులు సానుకూలంగా స్పందించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామ అభివృద్ధి




కమిటీకి కుల వివక్షకు తావులేకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు పండుగ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు సమానంగా పాల్గొనేలా చూడాలని గ్రామాల్లో సామాజిక సామరస్యం సమానత్వ భావనలను పెంపొందించాలని పేర్కొన్నారు ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి బాధితులకు పరిహారం చెల్లింపు కుల ధ్రువీకరణ పత్రాల జారీ పౌర హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ చట్టాల అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్డీవోలు సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట గుండాయిపేట్, గుడ్లబోరి, రేణువలి, మొగడ్, ధగడ్, తాడపల్లి గ్రామాలకు చెందిన రైతులు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఆందోళన చేపట్టారు.తమకు వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సరైన సమయంలో విద్యుత్ అందకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని, దీంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, 24 గంటల విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నాను కొనసాగిస్తామని రైతులు పట్టుబట్టారు. పోలీసులు అధికారుల హామీ మేరకు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేలో వేగం పెంచాలి




- 0క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించాలి=
- 0కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం.

**రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన వివరాల సేకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో రీసర్వే పురోగతిపై సమీక్షించారు ,గ్రామాల సరిహద్దుల నిర్ధారణకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రీసర్వే చేపడుతున్న గ్రామాల్లో సంబంధిత జిల్లా అధికారులు, డీఐలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన మేరకు లైసెన్స్డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన సమాచారాన్ని కచ్చితత్వంతో సేకరించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఈసమావేశంలో డీఆర్వో జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐలు, సర్వేయర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలి

- రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి
- గుంజపడుగు హరిప్రసాద్ జిల్లా అధ్యక్షులు తెలంగాణ రక్షణ సేన కరీంనగర్

**కరీంనగర్ అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని తెలంగాణ రక్షణ సేన ఆద్వర్యంలో SE అఫిస్ ముట్టడి ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా తక్షణమే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామని. రైతులు సాగు చేస్తున్న పంటలకు అవసరమైన సమయంలో నీరు అందేలా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలి
రైతు దేశానికి వెన్నెముక అని, రైతు కష్టపడి పంటలు పండిస్తేనే ప్రజలందరికీ ఆహారం అందుతుందని అలాంటి రైతన్న వ్యవసాయం చేయడానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కోవడం ఆందోళనకరమైన విషయమని వారు అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ అనేది కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదని, రైతుల జీవనాధారానికి, పంటల దిగుబడికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైన అంశమని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.



రైతులు సాగునీటి కోసం బోరుబావులపై ఆధారపడుతున్నారు. వర్షాలు సకాలంలో కురవని పరిస్థితుల్లో బోరుబావులే పంటలకు ప్రధాన నీటి వనరుగా మారుతున్నాయిఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే రైతులు పంటలకు నీరు అందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు ఏర్పడితే రైతులు తమ వ్యవసాయ పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవడం కష్టమవుతుంది. పంటలకు కీలకమైన సమయంలో నీరు అందకపోతే మొక్కలు ఎండిపోయి దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని విద్యుత్ సమస్యలతో రైతులకు వ్యవసాయం పంట చేతికి వచ్చే వరకు రైతులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటారు. ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటికి అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు వృథా అయ్యే ప్రమాదం ఉంది. పంటలు ఎండిపోతే రైతులకు ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అప్పుల చెల్లింపులు వంటి అనేక సమస్యలు ఎదురవుతాయి. ఒక పంట నష్టపోతే దాని ప్రభావం రైతు కుటుంబంపై నెలల తరబడి ఉంటుంది. అందువల్ల వ్యవసాయ విద్యుత్ సమస్యను సాధారణ సమస్యగా కాకుండా రైతుల జీవనోపాధికి సంబంధించిన కీలక అంశంగా ప్రభుత్వం పరిగణించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుందని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.టిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యిందని క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి విద్యుత్ నాణ్యత, సరఫరా సమయం, అంతరాయాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధరలతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా కూడా అత్యంత ముఖ్యమైనదని తెలంగాణ రక్షణ సేన పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్, తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు శ్రీరాముల రమేష్, బుడిగె పర్శారం గౌడ్, బసవేణి రాజేందర్, మ్యాక వినోద్, చంటి శ్రీనివాస్, మ్యాకల తిరుపతి, జంగ అపర్ణ, కొత్తూరి నరేష్, జంపాల రీతిష్, అంబాలా హరీష్, యండి రాజీ, గర్షకుర్తి విద్యాసాగర్, అబ్దుల్ హాఫీజ్, కొత్తూరి రఘు, యండి హుస్సేన్, సిపెళ్ళి వెంకటేష్, మడిపల్లి వినీత్, పూసాల రణధీర్, సూత్రాల రాజన్న, పూసల పవన్, ఉల్లేంగుల నరేష్, నూతి చరణ్, వరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మన జిల్లా – మన రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి




- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- అక్టోబర్ 18న ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభం
- ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం
- మన జిల్లా – మన రామగిరి ఖిల్లా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని చారిత్రక వారసత్వ సంపద రామగిరి ఖిల్లా ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, అటవీ పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'మన జిల్లా - మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.మంగళవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష 'మన జిల్లా - మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అక్టోబర్ 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రామగిరి ఖిల్లాను సందర్శించి, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు చారిత్రక వారసత్వ విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల వారు పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.
ఇతర వృక్షసంపదకు ఎలాంటి నష్టం కలిగించకుండా ప్రకృతిని పరిరక్షించాలని నిర్వాహకులు కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ బాధ్యతతో వ్యవహరిస్తూ అటవీ సంపదను కాపాడేందుకు సహకరించాలని సూచించారు. రామగిరి ఖిల్లా వంటి చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వాటి పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్‌కు చెందిన అఖిల్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు), పెద్దపల్లి యువశక్తి సోషల్ మీడియా ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ సంబరాలకు కోనాపూర్‌లో ఏర్పాట్లు

**బాన్సువాడ అక్టోబర్13 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని కోనాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యువనాయకుడు దిల్‌రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, పిచ్చిమొక్కలను తొలగిస్తూ ప్రదేశాన్ని



శుభ్రం చేస్తున్నారు. గ్రామ సర్పంచి కిష్టవ్వ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనుల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొంటున్నారు. బతుకమ్మ పండుగను గ్రామస్థులంతా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని సూచించారు.

# చంద్రఘంట రూపంలో దర్శన మిచ్చిన అమ్మవారు

- నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ

**ధర్మపురి అక్టోబర్13 (వుదయం ప్రతినిధి):**

పట్టణంలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న త్రయోదశ శరన్నవరా త్రోత్సవాలు వైభవంగా కొనసా గుతున్నాయి.ఉత్సవాల్లో భాగం గా మంగళవారం మూడవ రోజు అమ్మవారిని చంద్రఘంటరూపం లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సహస్ర దీపాలంకరణ కార్యక్రమా న్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వేద పండితులు కాసర్ల వంశీ కృష్ణశర్మ ఆచార్యత్వంలో నారంభట్ల ప్రశాంత్ శర్మ, కసోజ్జుల బాలకృష్ణ శర్మల ఆధ్వర్యంలో ఉదయం చతుష్షష్టి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు, నీరాజనం,మంత్ర పుష్పం,నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిం చారు.అనంతరం దేవీ భాగవత పురాణ ప్రవచనం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అంద జేశారు.అమ్మవారిని చంద్రఘం ట రూపంలో దర్శించుకునేం దుకు భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సహస్ర దీపాలంకరణతో కల్యా ణ మండపం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల అమ్మ వారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.ఈ కార్య క్రమం భక్తిప్రపత్తులతో వైభవం గా సాగింది.ఈ కార్యక్రమంలో భవాని దీక్షా పరులు,భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు




## వనపర్తి జిల్లాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు, పర్యాటకాభివృద్ధికి చర్యలు
### : అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

- **జిల్లాలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు.**

**వనపర్తి అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

మంగళవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, పర్యాటక శాఖ ఎండీ వల్లూరు క్రాంతి జిల్లా అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, బతుకమ్మ వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. వీసీ అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ, జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అక్టోబర్ 14న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, అక్టోబర్ 15న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, అక్టోబర్ 16న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమకు కేటాయించిన తేదీల్లో వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా జిల్లాలోని పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జడ్పీ సీఈఓ యాదయ్య, డీపీఆర్వో సీతారాం, డీ వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, డీ డబ్ల్యూ ఓ సుధారాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్‌లో గేమింగ్ ఉచ్చు!

- **రూ.2.65 లక్షల గెలుపు ఆశ చూపి.. రూ.1.58 లక్షలు కాజేశారు!**
- **కళ్యాణ్ మార్నింగ్'.. 'మిలన్ మార్నింగ్'.. 'శ్రీదేవి' పేర్లతో నకిలీ విజేతల వీడియోలు**
- **ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, సర్వీస్ ఛార్జీల పేరుతో వసూళ్లు.. కామారెడ్డిలో మరో ముగ్గురు అరెస్ట్**
- **వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరిక.. ఆన్‌లైన్ పెట్టుబడుల ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన**

**వికారాబాద్ అక్టోబర్ 13 (వుదయం బ్యూరో)**

సోషల్ మీడియాలో కనిపించే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, పెట్టుబడుల ప్రకటనలను నమ్మితే జేబులు ఖాళీ కావడం ఖాయమని వికారాబాద్ జిల్లా పోలీసులు హెచ్చరిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు వస్తాయంటూ ఆకర్షించే ప్రకటనలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే నకిలీ వీడియోలు, మనీ వోచర్లతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**రూ.2.65 లక్షల గెలుపు.. చేతిలో మాత్రం నష్టం!**

కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గట్టనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనను చూసి మోసపోయిన ఘటన ఈ తరహా సైబర్ నేరాల తీవ్రతను వెల్లడిస్తోంది. 'కళ్యాణ్ మార్నింగ్' పేరుతో కనిపించిన ప్రకటనలోని మొబైల్ నంబర్‌కు బాధితుడు ఫోన్ చేయగా, తొలుత కొంత డబ్బు పెట్టుబడిగా పంపితే ఆదాయం వస్తుందని నమ్మించారు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు పేరుతో మరిన్ని డబ్బులు చెల్లించేలా చేశారు. ఆ తర్వాత 'కళ్యాణ్ మార్నింగ్', 'మిలన్ మార్నింగ్', 'శ్రీదేవి' పేర్లతో గెలుపొందినట్లు చూపించే నకిలీ మనీ వోచర్లను పంపించారు. బాధితుడు సుమారు రూ.2.65 లక్షలు గెలుచుకున్నాడని నమ్మబలికారు. ఆ మొత్తాన్ని విడుదల చేయాలంటే సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర పన్నులు చెల్లించాలంటూ విడతలవారీగా డబ్బులు వసూలు చేశారు. ఇలా పలు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా బాధితుడి నుంచి మొత్తం సుమారు రూ.1,58,300 బదిలీ చేయించుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించి, అనంతరం కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 35/2026గా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.






**నకిలీ వీడియోలు.. నిజమైన వసూళ్లు!**

సోషల్ మీడియా వేదికలపై నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు, ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రజలను సంప్రదించేలా చేయడం ఈ మోసాల ప్రధాన వ్యూహంగా పోలీసులు గుర్తించారు. గెలుచుకున్న మొత్తాన్ని పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ తదితర పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితులు పంపిన మొత్తాలను వివిధ బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ పేమెంట్ మార్గాల ద్వారా బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**కామారెడ్డిలో మరో ముగ్గురు అరెస్ట్**

కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు విశ్వసనీయ సమాచారం ఆధారంగా కామారెడ్డి పట్టణ బస్‌స్టాండ్ ప్రాంతంలో మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ తన బృందంతో ఈ చర్యలు చేపట్టారు. నిందితుల వద్ద నుంచి తెల్లరంగు మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గతంలోనూ కొందరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నిందితుల పాత్రను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ వివరాలను పరిశీలిస్తూ సీసీఎస్ బృందం కేసును ముందుకు తీసుకెళ్తోంది. నేరంలో ఎవరెవరి ప్రమేయం ఉందన్న అంశంపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

**ప్రజలారా.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి!**

ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో కనిపించే పెట్టుబడి ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని ఎస్పీ సూచించారు. గెలిచిన డబ్బును విడుదల చేయాలంటే ముందుగా రుసుములు చెల్లించాలని కోరే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు డబ్బులు పంపడం, వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు పంచుకోవడం చేయవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ cybercrime.gov.in ద్వారా కూడా సమాచారం అందించాలని సూచించారు. ఆలస్యం చేయకుండా స్పందిస్తే మోసపోయిన డబ్బును నిలిపివేసే అవకాశాలు మెరుగుపడవచ్చు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కష్టపడి సంపాదించిన సొమ్మును కోల్పోవద్దని, ఇలాంటి మోసాలపై కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ స్నేహ మెహ్రా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





## గాయత్రీ మాతగా వాసవి అమ్మవారి దర్శనం
### - అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 13 (వుదయం బ్యూరో):**

జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజైన మంగళవారం అమ్మవారు వేదమాత అయిన శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖాలతో, శ్వేత వస్త్రాలతో దేదీప్యమానంగా దర్శనమిస్తున్న అమ్మవారిని చూసేందుకు తెల్లవారుజాము నుండే భక్తులు బారులు తీరారు. గాయత్రీ రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు పులకించారు.

ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దంపతులు ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక పూజలు, గణపతి, సుబ్రహ్మణ్యం, దుర్గా, సరస్వతి, లక్ష్మీ హోమాలు, లఘు పూర్ణాహుతి జరిగాయి. ఆలయ పూజారి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో మహా నీరాజనం సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదం అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు సాయంత్రం ప్రదోష పూజ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, తులసి అర్చన, పుష్పార్చన, పల్లకీ సేవ, డోలోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో బాదం రాధిక ఆధ్వర్యంలో దుర్గాభవాని బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. చిన్నారుల భక్తి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పట్టణ ఆర్యవైశ్య మహిళా కమిటీ ఆధ్వర్యంలో మెగా తంబోలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు హరిబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ మాచిపెద్ది శివకుమార్, ఉపాధ్యక్షుడు హకీం రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, వివిధ ఆర్యవైశ్య సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులకే ప్రాధాన్యమా?

- **జర్నలిస్టులకు డీపీఓ కార్యాలయంలో మొండిచేయి!**
- **ఫోన్ చేసినా స్పందన కరువు.. సమాచారం అడిగితే తర్వాత రావాలంటూ దాటవేత!**

**సంగారెడ్డి, అక్టోబర్ 13 :వు దయం.**

సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయంలో జర్నలిస్టులకు తగిన ప్రాధాన్యం లభించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు సమయం కేటాయిస్తూ, జర్నలిస్టులు సమాచారం కోసం కార్యాలయానికి వెళితే మాత్రం అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారుల వ్యవహారశైలిపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ పేరుతో కాలయాపనా ?ప్రజా సమస్యలు, గ్రామపంచాయతీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అధికారుల వివరణ తెలుసుకునేందుకు జర్నలిస్టులు డీపీఓకు ఫోన్ చేస్తున్నప్పటికీ, ఆయన అందుబాటులో ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. కార్యాలయానికి వెళ్లి సమాచారం అడిగితే, మరోసారి మాట్లాడదామంటూ పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశాల పేరుతో జర్నలిస్టులకు సమయం ఇవ్వడం లేదనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**ప్రజాప్రతినిధులకు ఒక న్యాయం.. జర్నలిస్టులకు మరో న్యాయమా?**

ప్రజాప్రతినిధులు కార్యాలయానికి వస్తే వారికి సమయం కేటాయించి, ఎదురుగా కూర్చోబెట్టుకొని మాట్లాడుతున్నారని, జర్నలిస్టుల విషయంలో మాత్రం భిన్నమైన వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టుల పట్ల ఇలాంటి వ్యవహారశైలి సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పత్రికల్లో వార్తలు వస్తే చులకనగా మాట్లాడుతున్నారా? పత్రికల్లో వార్తలు ప్రచురితమైన సందర్భాల్లో సదరు అధికారి చేసినట్లు చెబుతున్న వ్యాఖ్యలు జర్నలిజాన్ని కించపరిచేలా ఉన్నాయని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై వార్తలు రాయడం, అధికారులను వివరణ కోరడం జర్నలిస్టుల బాధ్యత అని, అలాంటి సందర్భాల్లో సహకరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల వ్యవహారంపైనా ఆరోపణలు! గ్రామపంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన పలు అంశాల్లోనూ డీపీఓపై ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు, అధికారిక వివరణ వెలుగులోకి రావాల్సి ఉంది. సంబంధిత అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు సమాచార సేకరణకు వెళ్లే జర్నలిస్టులకు సహకరించాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే ప్రాధాన్యం మాదిరిగానే ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులకూ సమయం కేటాయించి, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

జర్నలిస్టుల పట్ల డీపీఓ వ్యవహారశైలిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తారా? ఆరోపణలపై విచారణ జరిపిస్తారా? అనేది వేచి చూడాలి..



## అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవు

- **5 ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్ చేసిన వైద్యాధికారులు**

**మహబూబ్ నగర్**

నిబంధనలకు విరుద్ధంగా, అర్హతకు మించి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి, కానీ ఆంటిబయోటిక్ ఇంజక్షన్ లు, ఐ వి ఫ్లూయిడ్స్ పెట్టడం, నెబులైజర్ ను వాడడము చేస్తున్నట్లు గమనించి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం రోజు 5 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను మూసివేయడం జరిగింది. మిడ్జిల్ లో ఒకటి, ఇదే మండలము లోని బోయిని పల్లి లో ఒక కేంద్రం, కొత్త పల్లి లోని ఒక కేంద్రము, బాలానగర్ మండలం లోని హేమజీపూర్ లో ఒక కేంద్రము, నవాబ్ పేట లోని కాకర్లపహాడ్ లోని ఒక కేంద్రము మొత్తం 5 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను మూసివేయడం జరిగింది. ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి, పరిధి దాటి చికిత్సలు చేయకూడదని ఆదేశించారు.

ఇట్టి కార్యక్రమం లో డా. రాజు (DLO), నోడల్ ఆఫీసర్ డా. శివకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి జి. నర్సింహారెడ్డి, హన్మంతు హెల్త్ ఎడ్యుకేటర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధ సంస్థలను బజారుకీడుస్తున్న ఇండి కూటమి

- **కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్**

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**



ప్రతి ఎన్నికల్లో ఓటమి చెందుతున్న కాంగ్రెస్ ఇండి కూటమి రాజ్యాంగ బద్ధ సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నాయి అని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారం అందని ద్రాక్షగా మిగలడంతో అక్కసుతో పార్లమెంట్ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ విచ్ఛిన్నకర శక్తులతో కలిసి ఆందోళన చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు అంటే కూడా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి ఎంపీగా ఎన్నికైనప్పటికీ రాహుల్ గాంధీకి ఇంకా రాజకీయ పరిపక్వత రాలేదని విమర్శించారు. నిన్నటి ఎస్ ఐ ఆర్ వ్యతి రేక ర్యాలీసుప్రీం కోర్టు వైపు వెళ్లడం తెలియజేస్తుంటే, ఆయనకంటే ఎక్కువ అనుభవం ఉన్న కాంగ్రెస్ ముఖ్య మంత్రులు రేవంత్ రెడ్డి డీకే శివకుమార్ రాహుల్ గాంధీ తోక పట్టుకొని సుప్రీంకోర్టుకు వెళ్లడం చూస్తుంటే వారి రాజకీయ అనుభవం ఎక్కడ పోయిందో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి కోతి పనులు చేసే రాహుల్ గాంధీ తన తప్పుడు వ్యాఖ్యానాలపై తప్పుడు పద్ధతులపై సుప్రీంకోర్టు చేత గతంలో అనేకసార్లు మొట్టికాయలు తిన్న సంగతి ఇంకా ప్రజానీకం మరువలేదన్నారు. అయినప్పటికీ విదేశీ నిధుల చేత భారత దేశాన్ని కబలించే సోరోస్ నిధుల చేత డీప్ సేథ్ శక్తుల చేత నడిపించబడుతున్న ఓటు చోరీ వ్యతిరేక ఆందోళన గురించి సుప్రీం కోర్టు ఇప్పటికే చాలా స్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించిందనీ తెలిపారు. మామూలు వ్యక్తిని మొదలుకొని ప్రతిపక్ష నాయకుని వరకు ప్రతి ఒక్కరికి కోర్టు తలుపులు తెరిచే ఉంటాయని కోర్టు పద్ధతి ప్రకార మే రావాలని సూచించిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో భారత న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉంచి పిటిషన్ ల ద్వారా ఈ సమస్య పరిష్కరించుకోవాలన్న ధ్యాస లేదా అని అన్నారు. ప్రజాభిమానం కోల్పోయిన తరునా ఇండికూటమి నాయకుల ప్రవర్తన ముందే కోతి ఆపై కల్లు తాగింది అన్న చందాన మారిందనీ విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వ్యతిరేకంగా ఆందోళన చేస్తే వారికి ఒరిగేదేమి ఉండదనీ తెలిపారు. ఇండి కూటమి సి జే ఐ చెప్పిన విధంగా కోర్టు కు వెళ్లాలని, సుప్రీం కోర్టుకు ర్యాలీలు తీసుకు వెళ్లడం సరైన పద్ధతి కాదని అన్నారు.

ఇలాంటి పొర పాటు చేసినందుకు ఇండి కూటమి కూటమి నాయకులందరూ సుప్రీంకోర్టుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## దిగ్వాల్‌లో భూగర్భ జలాల తరలింపుపై ఆరోపణలు!

- **పిర్మల్ కంపెనీకి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా? అనుమతులపై విచారణకు స్థానికుల డిమాండ్**
- **అడుగంటుతున్న భూగర్భ జలాలు.. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడికి ప్రమాదం**

**కోహీర్, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):**




సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామ పరిధిలో భూగర్భ జలాల వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుపై ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. గ్రామ పరిధిలోని బోర్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా తరలించి పిర్మల్ కంపెనీకి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందూర్ వాటర్, విజయలక్ష్మి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ నీటి సరఫరాకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే నీటిని సేకరించి వినియోగిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అనుమతులు ఉన్నాయా? అధికారుల విచారణ ఎప్పుడు? గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను అధికంగా తోడటం వల్ల భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాలు సరిగా కురవని సమయాల్లో భూగర్భ జలాలపై ఆధారపడే గ్రామాల్లో బోరుబావుల నీటిమట్టం తగ్గితే వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వాణిజ్య అవసరాల కోసం నీటిని పెద్ద మొత్తంలో తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. భూగర్భ జలమట్టాలు తగ్గితే తీవ్ర ప్రభావం అవసరానికి మించి భూగర్భ జలాలను తోడటం వల్ల నీటిమట్టాలు క్రమంగా తగ్గిపోయి బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు, గ్రామాల్లో తాగునీటి సరఫరాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. భూగర్భ జలాల పునరుద్ధరణకు వర్షపు నీరు భూమిలోకి ఇంకడం ఎంతో అవసరం. అయితే భూమిలోకి చేరుతున్న నీటి పరిమాణం కంటే ఎక్కువగా నీటిని తోడితే భవిష్యత్తులో తీవ్రమైన నీటి సంక్షోభం తలెత్తవచ్చని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిన వారు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలిదిగ్వాల్ గ్రామ పరిధిలో బోర్ల నుంచి నీటిని సేకరించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నీటిని ఏ అవసరాల కోసం వినియోగిస్తున్నారు? ట్యాంకర్ల ద్వారా ఎంత పరిమాణంలో నీటిని తరలిస్తున్నారు? అనే అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నీటి సేకరణకు సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు, నీటి వినియోగ వివరాలను పరిశీలించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలిభూగర్భ జలాలు ప్రజలందరికీ అవసరమైన సహజ వనరులని, వాటి పరిరక్షణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు కలగకుండా భూగర్భ జలాల వినియోగంపై పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు. దిగ్వాల్ గ్రామ పరిధిలో నీటి తరలింపుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

## థర్డ్ డిగ్రీ ఆరోపణలు.. యువకుడి ఆత్మహత్యాయత్నం!

- **ధరూర్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి**
- **హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి: పౌర హక్కుల సంఘం డిమాండ్**

**గద్వాల, అక్టోబరు 13 (వుదయం బ్యూరో)**



బైక్ పార్కింగ్ వివాదంలో పోలీసుల వేధింపులకు గురయ్యాడన్న ఆరోపణల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో కలకలం రేపింది. ధరూర్ మండలం బురెడ్డిపల్లికి చెందిన కురువ వీరేష్ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. సంఘం తెలిపిన వివరాల ప్రకారం.. తన పొలంలో బైక్ పార్కింగ్ విషయంలో వడ్డే సవారన్నతో వీరేష్‌కు వివాదం తలెత్తింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో వీరేష్‌ను అక్టోబరు 8, 9 తేదీల్లో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. బైక్ నష్టపరిహారంగా రూ.7,500 చెల్లించిన అనంతరం ఎస్ఐ నందికర్ వీరేష్‌ను తీవ్రంగా కొట్టి, థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు సంఘం నాయకులు ఆరోపించారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన వీరేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు అతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి, చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరించాలని సంఘం నాయకులు కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐతో పాటు సంబంధిత పోలీసు సిబ్బందిని విధుల నుంచి తప్పించి నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిజనిర్ధారణ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జక్కా బాలయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సుభాన్, వెంకటేష్, మహేష్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నంబావి మండలనికి సాగు నీరు విడుదలకై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల ధర్నా

- **ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్ రెడ్డి**

**చిన్నంబావి మండలం 13 వుదయం రిపోర్టర్**



చిన్నంబావి మండలంలో మండల బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో ముఖ్య కూడలిలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుచున్నది. రైతులకు నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండుతున్న పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం, చిన్నంబావి మండలంలో పంటలు ఎండుతున్న పట్టించుకోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులకు నీళ్లు అందించి ఎండుతున్న పంటలను కాపాడాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మండల మాజీ, తాజా ప్రజా ప్రతి నిధులు పాల్గొంటున్నారు. కావున మండలంలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. మండలంలోని నీళ్ళు అందక ఎండుతున్న పంటల రైతులందరూ కూడా ధర్నా కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా అదే విధంగా గ్రామ, గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు రైతులు తప్పకుండా ఈ కార్యక్రమనికి హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రైతులకు నీళ్లు వచ్చేంత వరకు పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండ

- **లబ్ధిదారులకు రూ.79,500 విలువైన చెక్కుల అందజేత**

**దౌల్తాబాద్ అక్టోబర్ 13 (వుదయం):**

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు ఆదేశాల మేరకు ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. దౌల్తాబాద్ మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన పెనుకుల పద్మకు రూ.51,000, సూరంపల్లి గ్రామానికి చెందిన చిందం జగన్నాథానికి రూ.28,500 విలువైన చెక్కులను అందించారు. మొత్తం రూ.79,500 ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు.



అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా ఎంపీ రఘునందన్‌రావు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేవుడి లావణ్య నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులు చిక్కుడు స్వామి, స్వామి నాథ్, మండల మాజీ అధ్యక్షుడు పోతరాజు కిషన్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పిట్ల మల్లేష్, దుబ్బాక నియోజకవర్గ మన్‌కీ బత్ కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గంగధర్ స్వప్న స్వామి, ఉప సర్పంచ్ తాటి సాయి, బీజేపీ బూత్ అధ్యక్షులు తైల కుమార్, మంగలి నరేష్, కొనాయపల్లి మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

- **పెండింగ్ పనులు వేగవంతం చేయాలి - అధికారులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశం**

**దుబ్బాక అక్టోబర్13 (వుదయం ప్రతినిధి):** దుబ్బాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కాలువలు, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరిత గతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం దుబ్బాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్, చేగుంట, నార్సింగి మండలాల్లో శంకరంపేట కెనాల్ కాలువల నిర్మాణం, పెండింగ్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు . అదే విధంగా మంజూరైన సూరంపల్లినాచారం, మెట్టు రోడ్డు, దౌల్తాబాద్‌తిమ్మాపూర్ రహదారుల అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. పనుల అమలులో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.కాలువల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ భూముల సమస్యలను కూడా సమీక్షించారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వ స్థాయిలో అవసరమైన అనుమతులు త్వరితగతిన వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి

- **21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా సంస్మరణ కార్యక్రమాలు**
- **విద్యార్థులకు వ్యాసరచన.. యువతకు షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు**
- **ల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



**గద్వాల, అక్టోబర్ 13 (వుదయం బ్యూరో)** విధి నిర్వహణలో ప్రాణాలర్పించి దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ కోసం అమూల్యమైన త్యాగాలు చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకునేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా వివిధ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.అమరవీరులకు నివాళులు.. ప్రజలకు అవగాహన పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా అక్టోబర్ 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి అమర పోలీసులకు నివాళులర్పించనున్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పోలీసు విధులు, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించనున్నారు. రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు అమరవీరుల కుటుంబాలను పరామర్శించనున్నారు. యువతకు సృజనాత్మక పోటీలు విద్యార్థులు, పోలీసు సిబ్బందికి తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై వ్యాసాలు రాయవచ్చు. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ప్రతి విభాగంలో తొలి ముగ్గురు విజేతలకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. పాల్గొనేవారు వ్యాసాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.పోలీసుల సేవలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నారు. షార్ట్‌ఫిల్మ్ నిడివి మూడు నిమిషాలకు మించకూడదు. ఆసక్తి ఉన్నవారు తమ ఫొటోలు, వీడియో లను అక్టోబర్ 24లోగా జిల్లా పోలీసు కార్యాలయంలోని పీఆర్వోకు అందజేయాలని ఎస్పీ సూచించారు. అమరవీరుల త్యాగాలు పోలీసు శాఖకు నిరంతర స్ఫూర్తి అని ఎస్పీ పేర్కొన్నారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సంస్మరణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

# కేసరి సముద్రం చెరువులో అమ్మవారి నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలి



**నాగర్ కర్నూల్, అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):** నాగర్ కర్నూల్ పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ సునేంద్రను దేవీ శరన్నవరాత్రి ఉత్సవ మండపాల నిర్వాహకులు కోరారు.

గత 20 ఏళ్లుగా పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఏటా కేసరి సముద్రం చెరువులో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. గతంలో విగ్రహాలు చిన్నవిగా ఉండటంతో ఎండబెట్ల బ్రిడ్జి వద్ద తామే నిమజ్జనం చేసుకునేవారమని పేర్కొన్నారు.ప్రస్తుతం చెరువులో నీటిమట్టం తక్కువగా ఉండటంతో నిమజ్జనానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, భక్తులకు, నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా క్రేన్ తో పాటు మున్సిపల్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

# చిట్టాపూర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



- **చెరుకు శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి**

**అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 13 ( వుదయం ప్రతినిధి )** చిట్టాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్ లోని చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిసి గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులతో పాటు, నీటి ఎద్దడి నివారణకు కొత్త బోర్లు మంజూరు చేయాలని కోరారు. నాయకుల విజ్ఞప్తిపై చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. చిట్టాపూర్ గ్రామ సమస్యల పరిష్కారానికి,నిధుల మంజూరుకు అధికారులతో మాట్లాడి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, ర్యాకం శ్రీరాములు, ఇరుకోటి శ్రీనివాస్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డి బాల్ నర్సింలు, ఫిషర్మెన్ అధ్యక్షుడు జంగి బిక్షపతి, సిద్ధిని రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ సరిహద్దుల స్పష్టమైన గుర్తింపునకు రీసర్వే దోహదం





- **అదనపు కలెక్టర్ హరిప్రియ**
- **చీకర్లపల్లి గ్రామంలో రీసర్వే పనుల పరిశీలన**

**మహబూబ్‌నగర్:** హన్వాడ మండలం చీకర్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివానితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, హన్వాడ తహశీల్దార్ పాల్గొన్నారు. రీసర్వే పనుల పురోగతిని పరిశీలించిన అదనపు కలెక్టర్ గ్రామస్థులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితంగా చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (ఎల్‌పీఎంలు) అందజేస్తామని తెలిపారు. వీటి ద్వారా భూముల సరిహద్దులపై స్పష్టత ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో భూ సరిహద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించిన వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.రీసర్వే కార్యక్రమాన్ని సజావుగా, సమర్థంగా పూర్తి చేసేందుకు గ్రామస్థులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ హరిప్రియ విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

- **అర్హులైన ఎస్సీ, ఎస్టీ డిగ్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి**
- **జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి**
- **అక్టోబర్ 14 వరకు దరఖాస్తుల స్వీకరణ**



**నాగర్ కర్నూల్, అక్టోబర్13 (వుదయం ప్రతినిధి)** నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న యువతీ, యువకులు పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. ఉమాపతి మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అర్హులైన డిగ్రీ ఉత్తీర్ణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు డిసెంబర్ 20వ తేదీ వరకు ఉచిత వసతితో కూడిన శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన అభ్యర్థులు 2026 అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని ఉమాపతి సూచించారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి ఆఫ్‌లైన్ విధానంలో అందజేయాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఉంటుందని స్పష్టం చేశారు. పోలీస్ ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8977340006, 8500334470, 8309657774 ఫోన్ నంబర్లను సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. ఉమాపతి సూచించారు.

# తెలంగాణకు రహదారుల వరాలు

- **ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం**
- **కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ**





**నల్గొండ జిల్లా అక్టోబర్ 13 ( వుదయం ప్రతినిధి** న్యూఢిల్లీ తెలంగాణలో రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు. పలు ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.ముఖ్య ప్రాజెక్టులకు ఆమోదంఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా సానుకూలత వ్యక్తమైంది. ఈ వంతెనతో ఎన్‌హెచ్ 167కే మీదుగా తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య రాకపోకలు మెరుగుపడటంతోపాటు పర్యాటక రంగానికి ప్రయోజనం చేకూరనుంది.

హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 765)పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. ఎన్‌హెచ్ 65పై హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం రహదారి విస్తరణ పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.

ఐదు రోప్‌వేలకు గ్రీన్‌సిగ్నల్‌పర్వతమాల పథకం కింద తెలంగాణలో ఐదు రోప్‌వేల ఏర్పాటుకు ఆమోదం లభించింది. హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీ) నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

రాష్ట్రంలో 34 అభివృద్ధి పనులకు కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) కింద నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. దీనిపై సంబంధిత అధికారులకు నితిన్ గడ్కరీ ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా..పుల్లూరు-అలంపూర్-జట్రపోలు-పెంట్లవెల్లి-కొల్లాపూర్-లింగాల-అచ్చంపేట-డిండి-దేవరకొండ-మల్లేపల్లి-నల్లగొండ మార్గంలోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనపైనా సానుకూల స్పందన లభించింది.ఐఆర్‌సీకి గడ్కరీకి ఆహ్వానంహైదరాబాద్‌లో నవంబరు 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై గడ్కరీ సానుకూలంగా స్పందించి కార్యక్రమానికి హాజరవుతానని తెలిపినట్లు సమాచారం.

తెలంగాణలో రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రవాణా సౌకర్యాలను విస్తరించడం, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాల్లో ఈ సమావేశం కీలకంగా నిలిచింది. ఈ భేటీలో మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు రాష్ట్రానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యంలో ఆరోపణలు చేయడం సులభం

- **ఆధారాలతో నిరూపించడం ముఖ్యం! ఓటు హక్కు రక్షణకు, ఎన్నికల పారదర్శకతకు మేము ప్రాధాన్యత ఇస్తాం."**
- **రవీందర్ కంకల్ బీజేపీ జిల్లా ఐటీ ఇంచార్జి వికారాబాద్ జిల్లా.**



**పూడూర్ అక్టోబర్ 13 వికారాబాద్ జిల్లా అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):** రాజీనామా డిమాండ్ చేయడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని భావిస్తే, వాటిని నిర్దిష్టంగా గుర్తించి సరిదిద్దేలా కృషి చేయాలి. అదే సమయంలో ఎన్నికల కమిషన్ కూడా ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పారదర్శకతతో వ్యవహరించాలి.

ప్రజాస్వామ్యం అనేది కేవలం రాజకీయ పార్టీల మధ్య పోరాటం కాదు. అది ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడే వ్యవస్థ. అందువల్ల ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే వాస్తవాలు, ఆధారాలు, రాజ్యాంగబద్ధమైన పరిష్కారాలకే ప్రాధాన్యత ఇవ్వాలి.

మా స్పష్టమైన అభిప్రాయం: ఎన్నికల ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని ఆధారాలతో నిరూపించాలి. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు రక్షించబడాలి. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, పారదర్శకత, ప్రజల విశ్వాసం




# ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణీ

**నిజాంపేట అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):** మండలం వెంకటాపూర్ (కె ) గ్రామ పంచాయతీ లో SWM 2026 రూల్స్ ప్రకారం ఘన వ్యర్థలను తడి చెత్త,పొడి చెత్త, హానికర చెత్త, ప్రత్యేక హానికర చెత్త 4రకాలుగా వేరు చేయుటలో భాగంగా గౌరవ సర్పంచ్ ముత్యాల సరిత మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నుండి ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణీ చేయడం జరిగింది. ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్, వార్డుసభ్యులు మాదిరే మహేష్, బైండ్ల మల్లేష్, చెనమైన అశోక్,గోపరి రాజమణి పెంటయ్య,మూడవత్ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి ప్రేమ, ఆశావర్కర్ అక్కల కవిత, గ్రామ సంఘము అధ్యక్షురాలు దుబ్బాక లావణ్య, VOA కవిత, గ్రామస్తులు, మహిళలు పాల్గొనడం జరిగింది.

# మాజీ మంత్రి చంద్రశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

## ఐదుసార్లు ఎమ్మెల్యేగా.. మంత్రిగా పనిచేసిన అనుభవం

- **జహీరాబాద్ అభివృద్ధికి, ప్రజాసేవకు ఆయన అనుభవం అవసరం – మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ అష్రఫ్ అలీ డిమాండ్**



**కోహీర్ , అక్టోబరు 13 (వుదయం ప్రతినిధి):** రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, ప్రజా సేవలో విశేష గుర్తింపు కలిగిన మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ అష్రఫ్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న నాయకుడికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు.డాక్టర్ ఏ. చంద్రశేఖర్ రాజకీయ ప్రస్థానం, ప్రజలతో ఉన్న అనుబంధం, పాలనాపరమైన అనుభవం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని అష్రఫ్ అలీ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతూ, ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉందన్నారు. ఇలాంటి అనుభవజ్ఞుడైన నాయకుడికి ఎమ్మెల్సీ పదవి కల్పించడం ద్వారా ఆయన సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి రాజకీయ అనుభవం ఉన్న నాయకత్వం ఎంతో అవసరమని అష్రఫ్ అలీ అన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతమిచ్చేందుకు డాక్టర్ చంద్రశేఖర్ వంటి సీనియర్ నాయకుడికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం, ప్రజల కోసం సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న నాయకుల సేవలను గుర్తించడం రాజకీయంగా సముచితమని పేర్కొన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని డాక్టర్ చంద్రశేఖర్ అభ్యర్థిత్వాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

జహీరాబాద్ ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ,

సీనియర్ నాయకుడైన డాక్టర్ ఏ. చంద్రశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవి కల్పించి తగిన గౌరవం ఇవ్వాలని మహమ్మద్ అష్రఫ్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రైతులు వేరుశనగ సాగును సద్వినియోగం చేసుకోవాలి



- **మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,**

**పూడూర్ అక్టోబర్ 13, (వూదయం )** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో , రాష్ట్రంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ నూనె గింజల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాం రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు . జాతీయ నూనె గింజలు మిషన్ పథకం కింద స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం రాయితీ శనిగలు 100% రాయితీ వేరుశనగ విత్తనాలు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ మిషన్ ద్వారా రైతులు సంప్రదాయ సాగు పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతికను ఉపయోగించుకోవాలని వేరుశనగ సాగులో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు, కుల్కచర్ల ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు, కులక్చర్ల పిఎసిఎస్ చైర్మన్ భీమిరెడ్డి, పరిగి దోమ మండలాల వ్యవసాయ అధికారులు రజిత,

ప్రభాకర్ రెడ్డి, ఏ ఈ ఓ లు ఆయా గ్రామాల రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- **కబడ్డీ పోటీలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేస్తున్న సురోతం రెడ్డి శివకుమార్**

**ఆందోల్ వు దయం.** జోగుపేట ఎన్టీఆర్ స్టేడియం లో కబడ్డీ ఆట పోటీలు నిర్వహించిన సురోతం రెడ్డి సార శివకుమార్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా 40 టీం లకు జోగిపేటఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలకు సోమవారం ఫైనల్ మ్యాచ్ జై హనుమాన్ మరియు జై హనుమాన్ రెండవ బహుమతిగా నిలవడంతో ముఖ్య అతిథిగా సురోతం రెడ్డి సారా శివ కుమార్ ఆధ్వర్యంలో బహుమతి ప్రధానం చేశారు సురోతం రెడ్డి మాట్లాడుతూ ఓటమి గెలుపు సహజమే అని అన్నారు గత వినాయక నిమజ్జనం సందర్భంగా కూడా కూచిపూడి విద్యార్థులకు కూడా మొదటి ప్రైజ్ రెండో ప్రైజ్ బహుమానం ప్రధానం చేశారు సురోతం రెడ్డి సార్ శివకుమార్ వారంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు దానికి అనుగుణంగా ఆదివారం సోమవారం కబడ్డీ ఆట పోటీలు కూడా నిర్వహించి మొదటి బహుమతి 20వేల నగదు రెండో బహుమతి 10000 బహుమతి ప్రధానం చేశారు జోగిపేట ఎస్సై గిరి ఆనంద్ వర్ధన్ సీనియర్ జర్నలిస్ట్ తుపాకుల సునీల్ పిటి శ్రీనివాస్ సిద్ధు గణేష్ కబడ్డీ వెల్ఫేర్ అసోసియేషన్ సోను ఆర్గనైజర్ టీం పాల్గొన్నారు




# అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం

- **ప్రత్యేక పూజలు.. వడి బియ్యం సమర్పించిన మహిళా భక్తులు**



**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు వడి బియ్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అన్నపూర్ణాదేవి కటాక్షంతో ప్రజలందరికీ అన్నసమృద్ధి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పసుపుల సుందర్, ప్రధాన అర్చకులు గవ్వమటం విజయ్ కుమార్ శాస్త్రితోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## క్యాన్సర్ నివారణకు వీటిని పాటించాలి..

క్యాన్సర్ నివారణ అంటే పొగతాగడం మానేయడం, మద్యపానానికి దూరంగా ఉండడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, శారీరకంగా చురుకుగా ఉండడం



మాత్రమే కాదు. కొన్ని రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా వల్ల కలిగే ఇన్‌ఫెక్షన్లు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతాయని తాజా విశ్లేషణ వెల్లడించింది. ది లాన్సెట్ ఆంకాలజీలో ప్రచురితమైన విశ్లేషణ ప్రకారం.. 2024లో ప్రపంచవ్యాప్తంగా నమోదైన కొత్త క్యాన్సర్ కేసుల్లో సుమారు 23 లక్షల కేసులు ఇన్‌ఫెక్షన్లతో సంబంధం కలిగి ఉన్నాయి. అంటే ప్రతి ఎనిమిది క్యాన్సర్ కేసుల్లో ఒకటి ఇన్‌ఫెక్షన్లతో ముడిపడి ఉన్నట్లు అంచనా. భారత్‌లోనూ వైరస్‌లు, బ్యాక్టీరియా సంబంధిత ఇన్‌ఫెక్షన్ల కారణంగా సుమారు 1.9 లక్షల క్యాన్సర్ కేసులు నమోదైనట్లు ఈ విశ్లేషణ పేర్కొంది. అయితే ఇన్‌ఫెక్షన్ సోకిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ వస్తుందని దీని అర్థం కాదు. కొన్ని ఇన్‌ఫెక్షన్లు శరీరంలో దీర్ఘకాలం కొనసాగితే కణాలు, కణజాలాల్లో పదేపదే వాపు ఏర్పడటం, దెబ్బతినడం వంటి మార్పులు సంభవిస్తాయి. కాలక్రమేణా ఇవి కణాల్లో అసాధారణ మార్పులకు దారితీసి క్యాన్సర్ ముప్పును పెంచే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ), హెలికోబాక్టర్ పైలోరి (హెచ్ పైలోరి) బ్యాక్టీరియా, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు, ఎప్‌స్టీన్ బార్ వైరస్ వంటి ఐదు రకాల ఇన్‌ఫెక్షన్లు ప్రపంచవ్యాప్తంగా ఇన్‌ఫెక్షన్లతో సంబంధం ఉన్న క్యాన్సర్ కేసుల్లో అధిక భాగానికి కారణమవుతున్నాయి. ఇన్‌ఫెక్షన్ రకం, అది శరీరంలో ఎంతకాలం కొనసాగుతోంది, రోగనిరోధక వ్యవస్థ పనితీరు, జీవనశైలి, జన్యుపరమైన అంశాలను బట్టి క్యాన్సర్ ముప్పు మారుతుందని నిపుణులు వివరిస్తున్నారు.

హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్ దీర్ఘకాలం కొనసాగితే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అలాగే మలద్వారం, పురుషాంగం, యోని, బాహ్య జననేంద్రియాలు, గొంతు ప్రాంతాల్లో వచ్చే కొన్ని క్యాన్సర్లతోనూ ఈ వైరస్‌కు సంబంధం ఉంటుంది. హెచ్‌పీవీ టీకా తీసుకోవడం, గర్భాశయ ముఖద్వార పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ తరహా క్యాన్సర్ల ముప్పును తగ్గించుకోవచ్చు. మరోవైపు, హెచ్ పైలోరి బ్యాక్టీరియా జీర్ణాశయంలోని లోపలి పొరలో దీర్ఘకాలిక వాపును కలిగించి జీర్ణాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా ఈ బ్యాక్టీరియాతో సంబంధం ఉన్న క్యాన్సర్ కేసులు సుమారు 7.6 లక్షలుగా నమోదైనట్లు విశ్లేషణ అంచనా వేసింది. అలాగే హెపటైటిస్ బి, సి వైరస్‌ల వల్ల కాలేయం దీర్ఘకాలం దెబ్బతిని కాలేయ క్యాన్సర్ వచ్చే ముప్పు పెరుగుతుంది. హెపటైటిస్ బికి టీకా అందుబాటులో ఉండగా, హెపటైటిస్ సికి టీకా లేదు. అయితే సమర్థవంతమైన యాంటీవైరల్ మందులతో హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్‌ను చాలావరకు పూర్తిగా నయం చేయవచ్చు. కొన్ని ఇన్‌ఫెక్షన్లను నివారించడం, ముందుగానే గుర్తించడం, సరైన చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చు.

ఇందుకోసం హెచ్‌పీవీ, హెపటైటిస్ బి టీకాలను వైద్యుల సూచనల మేరకు తీసుకోవాలి. హెపటైటిస్ వంటి ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉన్నవారు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. సూదులను సురక్షితంగా ఉపయోగించడం, రక్తమార్పిడి సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించడం, లైంగిక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కొన్ని ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. హెచ్ పైలోరి వంటి ఇన్‌ఫెక్షన్లను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. వీటితో పాటు పొగాకు వాడకానికి దూరంగా ఉండడం, మద్యపానాన్ని పరిమితం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం కూడా క్యాన్సర్ నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

## శీతాకాలంలో వీరికి శ్వాసకోశ సమస్యల ముప్పు ఎక్కువ..

అక్టోబర్ నెల వచ్చిందంటే శీతాకాలంలో వ్యాపించే ఫ్లూ వంటి శ్వాసకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఈ వ్యాధుల నుంచి తీవ్రమైన అనారోగ్య



ముప్పును తగ్గించుకోవడానికి టీకాలు తీసుకోవడం ముఖ్యమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, ఉబ్బసం, మధుమేహం, గుండె జబ్బులు ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఫ్లూ సోకితే సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఆరు నెలల వయసు నుంచి ఫ్లూ టీకా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే టీకా తీసుకున్నంత మాత్రాన వ్యాధి పూర్తిగా రాకుండా ఉంటుందని హామీ లేదు. కానీ ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితులు, తీవ్రమైన అనారోగ్యం, మరణ ముప్పును తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. ఫ్లూ టీకాలతోపాటు కోవిడ్ టీకాలపై కూడా వైద్య నిపుణులు దృష్టి సారించాలని చెబుతున్నారు. గతంలో మాదిరిగా అందరికీ ఒకే విధమైన సిఫార్సులు లేకపోయినా, వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి కోవిడ్ టీకా ముఖ్యమని వైద్య సంఘాలు పేర్కొంటున్నాయి. కొన్ని వైద్య సంఘాలు పెద్దలందరూ టీకా తీసుకోవాలని సూచిస్తున్నాయి. పిల్లల్లో ఆరు నెలల నుంచి రెండేళ్ల లోపు వారికి, అలాగే అధిక ముప్పు ఉన్న కాస్త వయస్సు పైబడిన పిల్లలకు టీకా ఇవ్వాలని అమెరికా పీడియాట్రిక్స్ నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. గర్భిణులు కూడా వైద్యుల సలహాతో టీకా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో కోవిడ్ టీకా తీసుకోవడం వల్ల గర్భస్రావం లేదా ఇతర సమస్యలు పెరుగుతాయని ఆధారాలు లేవని వారు పేర్కొంటున్నారు.

ఫ్లూ, కోవిడ్ టీకాలు తీసుకున్న తర్వాత సాధారణంగా ఇంజెక్షన్ ఇచ్చిన చోట నొప్పి, అలసట, తలనొప్పి, కండరాల నొప్పులు, స్వల్ప జ్వరం వంటి దుష్ప్రభావాలు కనిపించే అవకాశం ఉంటుంది. ఇవి సాధారణంగా తాత్కాలికంగానే ఉంటాయి. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఎంఆర్ఎన్ఏ సాంకేతికతతో తయారైన మోడెర్నా ఫ్లూ టీకా ఎంఫ్లూసివాను 50 ఏళ్లు పైబడినవారికి వినియోగించేందుకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ అనుమతించింది. ఒక అధ్యయనం ప్రకారం, 50 నుంచి 64 ఏళ్ల వయసువారిలో సాధారణ ఫ్లూ టీకాతో పోలిస్తే ఇది లక్షణాలతో కూడిన ఫ్లూ వ్యాధిని నివారించడంలో 27 శాతం ఎక్కువ ప్రభావవంతంగా ఉన్నట్లు తేలింది. అయితే ఈ కొత్త టీకా తీసుకున్నవారిలో సాధారణ ఫ్లూ టీకాతో పోలిస్తే దుష్ప్రభావాలు కొంత ఎక్కువగా కనిపించినట్లు వెల్లడైంది. ఫ్లూ టీకా తీసుకోవడానికి అక్టోబర్ అనుకూలమైన సమయమని నిపుణులు సూచిస్తున్నారు. టీకా తీసుకున్న తర్వాత రక్షణ ఏర్పడడానికి సుమారు రెండు వారాలు పడుతుంది. అయితే ఆ తర్వాత కూడా శీతాకాలంలో టీకాలు అందుబాటులో ఉంటా యి. మరోవైపు శిశువులు, వృద్ధుల్లో తీవ్రమైన సమస్యలకు కారణమయ్యే ఆర్ఎస్‌వీ వైరస్ నుంచి రక్షణ పొందడం కూడా ముఖ్యం. 75 ఏళ్లు పైబడినవారు, 50 నుంచి 74 ఏళ్ల మధ్య వయసులో అధిక ముప్పు ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న కొందరు వ్యక్తులు ఈ టీకా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గర్భధారణ చివరి దశలో టీకా తీసుకోవడం ద్వారా పుట్టబోయే శిశువుకు కూడా రక్షణ కల్పించవచ్చని చెబుతున్నారు.

## ప్రెగ్నెన్సీలో ప్రయాణాలు.. మంచిదేనా?

గర్భం ధరించామని తెలియగానే కొంతమంది తమ పనులు తాము చేసుకోవడానికి కూడా వెనకా ముందూ అవుతుంటారు. ఇంకొంతమందైతే అత్యవసర పరిస్థితుల్లో తప్ప డెలివరీ అయ్యే దాకా ప్రయాణాలు కూడా మానుకుంటారు. ఇలా తమ పనుల వల్ల కడుపులోని బిడ్డకు ఏదైనా అసౌకర్యం కలుగుతుందేమో అని జాగ్రత్తపడుతుంటారు కాబోయే అమ్మలు. అయితే ప్రెగ్నెన్సీ అనేది అనారోగ్యం కాదని, ఈ క్రమంలో శరీరం, ఆరోగ్యం సహకరిస్తే ఎవరికి వారు అన్ని పనులు చేసుకోవచ్చని, తద్వారా మరింత చురుగ్గా ఉండగలుగుతారని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. గర్భంతో ఉన్నప్పుడు ప్రయాణాలు కూడా చేయచ్చని, అయితే అందుకు ముందుగా డాక్టర్ సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక దీంతో పాటు ప్రయాణం చేయాలనుకునే గర్భిణులు కొన్ని జాగ్రత్తలు కూడా పాటించడం అన్ని విధాలా శ్రేయస్కరమంటున్నారు. మరి, ఇంతకీ అవేంటో తెలుసుకుందాం రండి..

గర్భం ధరించిన మహిళల్లో వికారం, వాంతులు.. వంటి లక్షణాలు కొన్ని నెలల పాటు కొనసాగుతాయి. అందుకే ప్రయాణాల్లో ఇలాంటి సమస్యలు లేకుండా ఉండాలంటే సులభంగా జీర్ణమయ్యే పోషకాహారాన్ని తక్కువ మొత్తంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ప్రయాణ సమయంలోనూ తేలికపాటి ఆహారమే మంచిది. ప్రెగ్నెన్సీ రిపోర్టులు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్స్, మందులు.. వంటివన్నీ ఎప్పుడూ వెంటే ఉంచుకోవాలి. తద్వారా ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే అక్కడికి దగ్గర్లోని ఆస్పత్రిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవచ్చు.

ఓ నీళ్ల బాటిల్‌ను వెంట ఉంచుకోవడమూ మరవద్దు. అలాగే మధ్యమధ్యలో వీలుంటే కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరంలో నీటి స్థాయులు పడిపోకుండా ఉంటాయి.. అలాగే శరీరానికి తక్షణ శక్తి కూడా వస్తుంది.



ప్రయాణాల్లో బిగుతైన దుస్తులు కాకుండా వదులుగా, సౌకర్యవంతంగా ఉండే దుస్తులు వేసుకోవడం మంచిది. తద్వారా కూర్చున్నా ఇబ్బందిగా అనిపించదు. అలాగే చెప్పుల విషయంలోనూ ఫ్లాట్స్‌ని ఎంచుకుంటే కంఫర్టబుల్‌గా నడవడానికి వీలవుతుంది.

ఇక మధ్యమధ్యలో టాయిలెట్స్‌కి వెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఈ క్రమంలో ఆయా వాష్‌రూమ్స్ డోర్స్, నాబ్స్‌ని తాకినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడానికి వీలుగా మీ వెంటే ఓ మినీ హ్యాండ్‌వాష్ బాటిల్‌ను ఉంచుకోవడం మంచిది. అలాగే మధ్యమధ్యలో చేతులు శానిటైజ్ చేసుకోవడమూ ముఖ్యమే.

ఇక కారులో వెళ్లే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మధ్యమధ్యలో ప్రశాంతమైన వాతావరణం ఉన్న ప్రదేశంలో వాహనాన్ని ఆపి కాసేపు రిలాక్సవడం, అటూ ఇటూ తిరగడం వల్ల ప్రయాణ అలసటను దూరం చేసుకోవచ్చు. అయితే కొన్ని అనారోగ్యాలున్న గర్భిణులు మాత్రం ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఈ క్రమంలో..

గతంలో గర్భస్రావం లేదా ప్రి-మెచ్యూర్ డెలివరీ అయిన వారు

గర్భాశయంలో ఏదైనా సమస్యలుంటే..

గర్భం దాల్చిన తొలి నెలల్లో రక్తస్రావం లేదా ఇతర సమస్యలెదురైతే..

లేటు వయసులో గర్భం ధరించడం, కవలలు లేదా ట్రిప్లెట్స్ తమ గర్భంలో పెరుగుతున్నప్పుడు (మల్టిపుల్ ప్రెగ్నెన్సీ).. ఇలాంటి వారు ప్రయాణాలు చేయకపోవడమే మంచిదట.

## బరువు తగ్గించే చియా!

ఇంటిల్లిపాది ఆరోగ్యం కోసం ఆలోచించే మహిళలు తమ ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా పోషకాహారాన్ని తీసుకోవాలి. అలా మీ డైట్‌లో తప్పక చేర్చుకోవలసిన వాటిల్లో చియా సీడ్స్ ఒకటి. ఈ సూపర్‌ఫుడ్ ప్రయోజనాలేంటంటే...

చియా గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని నీటిలో నానబెడితే ఉబ్బి జెల్‌లాగా మారతాయి. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయకుండా ఉండి, అతిగా తినే అలవాటు అదుపులోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునే మహిళలకు ఇది మంచి ఎంపిక. ఈ రోజుల్లో చాలామంది మహిళలు పీసీఓడీ, హార్మోన్ల అసమతుల్యత సమస్యలతో బాధపడుతున్నారు. చియా గింజల్లో లభించే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు శరీరంలో మంట, వాపుల్ని తగ్గించి, ఇన్సులిన్ స్థాయులను హార్మోన్లను నియంత్రించడంలో సహాయపడతాయి. మహిళల్లో వయసు పెరిగే కొద్దీ ఎముకల సాంద్రత తగ్గి ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు వచ్చే ముప్పు ఉంది. చియా గింజల్లో కాల్షియం,



మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలు, పళ్లను దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. చియా గింజల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల చర్మ కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. ఇవి ముడతలను తగ్గిస్తాయి. వీటిలో ఉండే ప్రొటీన్, ఐరన్ జుట్టు రాలడాన్ని తగ్గించి, దృఢంగా పెరగడానికి దోహదపడతాయి.

మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడేవారికి చియా గింజలు మేలు చేస్తాయి. వీటిలోని ఫైబర్ జీర్ణక్రియనువేగవంతం చేసి, పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చియా గింజలను అరగంట నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. అదీ రెండు స్పూన్లకు మించకూడదు. వీటిని రోజూ తాగే ఫ్రూట్ జ్యూస్‌లు, ప్రొటీన్ షేక్స్, స్మూతీస్‌లో కలిపి తీసుకోవచ్చు.

## మహిళలు చేయాల్సిన వ్యాయామాలు ఇవే..

పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్), హార్మోన్ల అసమతుల్యత, జీవక్రియ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న మహిళలు తమ దినచర్యలో బరువులతో చేసే వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కేవలం నడక, పరుగు వంటి కార్డియో వ్యాయామాలకే పరిమితం కాకుండా కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని చెబుతున్నారు.



శరీరంలో కండరాల పరిమాణం పెరిగితే రక్తంలోని గ్లూకోజ్‌ను శక్తిగా ఉపయోగించుకునే సామర్థ్యం మెరుగుపడుతుంది. దీనివల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడం సులభమవుతుంది. కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడమే కాకుండా శరీరంలో వాపును తగ్గించడంలోనూ సహాయపడతాయని నిపుణులు వివరిస్తున్నారు. ఇన్సులిన్‌ను శరీరం సమర్థంగా ఉపయోగించుకోగలిగినప్పుడు గ్లూకోజ్ వినియోగం మెరుగుపడుతుంది. దీనివల్ల జీవక్రియ ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. అలాగే పేగుల ఆరోగ్యం, వాటిలో ఉండే సూక్ష్మజీవుల సమతుల్యత మెరుగుపడడానికి కూడా వ్యాయామం తోడ్పడుతుందని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మార్పులు హార్మోన్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ ఉపయోగపడతాయని తెలిపారు. బరువులతో వ్యాయామాలు చేస్తే శరీరం స్థూలంగా మారుతుందని, కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలు పెరుగుతాయని కొందరు మహిళలు ఆందోళన చెందుతుంటారు. అయితే బరువులతో వ్యాయామం చేసినంత మాత్రాన ప్రతి ఒక్కరిలోనూ ఈ మార్పులు తప్పనిసరిగా సంభవించవని నిపుణులు చెబుతున్నారు. పీసీఓఎస్‌తో బాధపడుతున్న మహిళలు కూడా తమ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం గురించి ఆలోచించాలని సూచిస్తున్నారు. వ్యాయామం ప్రారంభించే ముందు అవసరమైతే వైద్యులు లేదా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

వ్యాయామంతోపాటు ఆహారపు అలవాట్లపైనా దృష్టి పెట్టాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గుడ్లు, పప్పుధాన్యాలు, పనీర్ వంటి ప్రొటీన్లు అధికంగా ఉండే పదార్థాలతో పాటు కూరగాయలు, పీచు పదార్థాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఇవి కడుపు నిండిన భావనను ఎక్కువ సేపు కొనసాగించడంతోపాటు రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగడం, తగ్గడం వంటి మార్పులను నియంత్రించడంలో తోడ్పడతాయి. కార్డియో వ్యాయామాలు, కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు, సమతుల ఆహారాన్ని కలిపి పాటించడం ద్వారా పీసీఓఎస్, హార్మోన్ల అసమతుల్యత, జీవక్రియ సమస్యల నిర్వహణకు సహాయపడతాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

## వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా..!

కాస్త ఓపిక ఉంటే.. ఇంట్లో సహజంగా లభించే పదార్థాలతోనే చర్మాన్ని మెరిసేలా చేయడంతో పాటు చర్మ పోషణకు అవసరమయ్యే పోషకాలను కూడా అందించవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సహజసిద్ధంగా లభించే అరటిపండు



మనకు ఏవిధంగా ఉపయోగపడుతుందో చూద్దాం..!

బాగా ముగ్గిన అరటిపండు – 1

తేనె – చెంచా, బార్లీ పౌడర్ – చెంచా,

ఈ ప్యాక్ కోసం తీసుకునే అరటిపండు బాగా ముగ్గినదై ఉండాలి. అలాంటి అరటిపండు, తేనె, బార్లీపౌడర్ ఒక గిన్నెలో తీసుకుని బాగా కలపాలి. అరటిపండు చర్మాన్ని పట్టి ఉండదు.. వెంటవెంటనే జారిపోతూ ఉంటుంది. అందుకే ఇది చర్మానికి పట్టి ఉండేలా చేయడానికే ఇందులో బార్లీ పౌడర్ కలిపాలి. ఒకవేళ అరటిపండు మరీ బాగా ముగ్గిపోయినట్లయితే బార్లీ పౌడర్‌కు బదులు వరిపిండి చెంచా వేసి కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖం కింద నుంచి పైకి పూతలా వేసుకోవాలి. 10 నుంచి 20 నిమిషాల పాటు ఆరనిచ్చి చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. అయితే ఆరనివ్వమన్నాం కదా అని ఫ్యాన్ కింద ఉంటే పొరపాటే. ఈ ప్యాక్ ఎంత సహజంగా ఆరితే అంత ప్రయోజనం ఉంటుంది. ఇలా వారానికోసారి ఈ ఫేస్‌ప్యాక్‌ను అప్లై చేసుకోవడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే, ఈ చిట్కాను పాటించేముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మర్చిపోవద్దంటున్నారు.

## చక్కగా నిద్ర పట్టాలంటే..!

ఈ ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో పాటు, మొబైల్ ఫోన్ వంటి గ్యాడ్జెట్లను విరివిగా వినియోగించడం వల్ల చాలామంది ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా శారీరకంగా, మానసికంగా పలు అనారోగ్యాల పాలవుతున్నారు. అయితే మన రోజువారీ అలవాట్లలో కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవడం వల్ల సుఖ నిద్రను సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.

చాలామంది కెరీర్ బిజీలో పడిపోయి వేళకు నిద్రపోవడం మర్చిపోతున్నారు. అయితే సుఖ నిద్ర కోసం రోజూ ఒక సమయం పెట్టుకుని ఆ సమయానికే నిద్రపోవడం, నిద్ర లేచే విషయంలోనూ సమయపాలన పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా చక్కటి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు వయసునూ దాచేయచ్చంటున్నారు.

చాలా మంది పడుకునే ముందు గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేస్తుంటారు. అయితే ఆ నీళ్లలో కొన్ని వేపాకులు వేసుకోవడం వల్ల ప్రశాంతంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. వేపాకులు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంతో పాటు రోగనిరోధక శక్తినీ మెరుగు పరుస్తాయి. అలాగే స్నానం చేసే నీటిలో కొన్ని ఎసెన్షియల్ ఆయిల్స్‌ను కలుపుకొంటే తాజాదనం సొంతమవుతుంది అంటున్నారు నిపుణులు. కొంతమంది గ్యాస్, పొట్ట ఉబ్బరం.. వంటి సమస్యలతో ఇబ్బందిపడుతుంటారు. దీనివల్ల వారు రాత్రి పూట సరిగా నిద్రపోలేరు. ఇలాంటి వారు అరికాళ్లకు నెయ్యితో మర్దన చేసుకుంటే ఫలితం ఉంటుంది. ఇలా చేయడం వల్ల నిద్రలేమి సమస్యను చాలావరకు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అలాగే అలసటగా, ఆందోళనగా ఉన్నప్పుడు కూడా ఈ పద్ధతి ద్వారా త్వరితగతిన ఉపశమనం పొందచ్చంటున్నారు. సుఖనిద్ర కోసం ఈ అలవాట్లతో పాటు కొన్ని జాగ్రత్తలు కూడా పాటించాలని సూచిస్తున్నారు నిపుణులు.



రాత్రి భోజనానికి, నిద్రపోవడానికి మధ్య కనీసం రెండు, మూడు గంటల సమయం ఉండేలా చూసుకోవాలి. నిద్ర పోవడానికి 60 నిమిషాల ముందు నుంచే గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయాలి.

నిద్రపోయే గదిలో సరైన వెంటిలేషన్ ఉండడంతో పాటు చీకటిగా ఉండేలా చూసుకోవాలి. అలా ఇష్టపడని వారు తక్కువ వెలుతురు వచ్చే లైట్ ఏర్పాటుచేసుకోవచ్చు.

పడుకునే ముందు ధ్యానం చేయడమూ మంచిదే!

**సెన్సెక్స్ 1100 పాయింట్లు పైకి**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ప్రధానంగా ఐటీ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. హెచ్‌సీఎల్ మెరుగైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5 శాతం మేర లాభపడింది. ఎల్‌టీసీజీ, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను సమీక్షిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడంతో పీఎస్‌యూ బ్యాంక్స్, రియాలిటీ స్టాక్స్ రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. మన మార్కెట్ రాణించడం విశేషం. సెన్సెక్స్ 1100 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 22,700 ఎగువన ముగిసింది.




# దీపావళి తర్వాతే ఎండీఆర్ ఛార్జీలు: కేంద్రం ప్రకటన



పండగ సీజన్‌లో వ్యాపారులకు కేంద్రం ఊరట కల్పించింది. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (MDR) అమలును వాయిదా వేసింది. అక్టోబర్ 15వ తేదీకి బదులు దీపావళి తర్వాత ఈ ఛార్జీల అమలు ఉంటుందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) ప్రకటించింది.

పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని.. యూపీఐ, సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎండీఆర్ ఛార్జీల అమలుకు సంబంధించి కచ్చితమైన తేదీని త్వరలో వెల్లడిస్తామని ఎన్‌పీసీఐ (NPCI) వెల్లడించింది. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ప్రవేశపెట్టడాన్ని హోల్‌సేల్, రిటెయిల్ వ్యాపారులు వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా పండగ సీజన్‌లో ఎండీఆర్ ఛార్జీల వల్ల ఖర్చులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌పీసీఐ నేతృత్వంలోని స్టీరింగ్ కమిటీ.. ఛార్జీల అమలును తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించింది.

యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటును (MDR) నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) ఇటీవల ఖరారు చేసిన సంగతి తెలిసిందే. రూ.2వేలు పైబడి వ్యాపారులకు వ్యక్తులు చేసే చెల్లింపులపై 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని స్పష్టంచేసింది. అయితే, సాధారణ వినియోగదారులు ఎప్పటిలాగే యూపీఐ లావాదేవీలను ఉచితంగానే కొనసాగించవచ్చని పేర్కొంది. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు (P2P), రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు (P2M) ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టం చేసింది.

# 7 శాతంగా జీడీపీ.. భారత్ వృద్ధి అంచనాలను పెంచిన ఐఎంఎఫ్




అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) భారతదేశ వృద్ధి అంచనాలను పెంచింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధిరేటు సాధించనుందని వెల్లడించింది. జులైలో ఈ అంచనాలు 6.4 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. తాజా గణాంకాలతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. దేశీయ డిమాండ్ బలంగా ఉండటం, సేవా రంగంలో వృద్ధి, నిర్మాణాత్మక సంస్కరణలు ఇందుకు కారణాలుగా ఐఎంఎఫ్ వెల్లడించింది.

అమెరికా-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతల వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ముడి చమురు ధరలు పెరగడం వంటి ప్రతికూలతలు ఉన్నా.. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతోందని ఐఎంఎఫ్ పేర్కొంది. 2026లో ప్రపంచ వృద్ధి రేటు 3.1%గా, 2027లో 3.4%గా ఉంటుందని అంచనా వేసింది. అభివృద్ధి చెందిన దేశాల వృద్ధి రేటు 2027 నాటికి 1.8% నుంచి 2.1%గా మధ్యలో ఉండొచ్చని లెక్కేసింది. చైనా, రష్యా, బ్రెజిల్ వంటి దేశాల వృద్ధి మందగమనంలో ఉండొచ్చని తన అంచనాల్లో పేర్కొంది.

# సెప్టెంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం 5.54%



ఉల్లిపాయలు, ఇతర ఆహార వస్తువుల ధరలు భగ్గుమనడంతో.. సెప్టెంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి చేరింది. ఆర్‌బీఐ నిర్దేశించుకున్న గరిష్ఠ పరిమితి (6%)కి ఇది దగ్గరగా ఉంది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా రిటెయిల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. ఆగస్టులో ఇది 4.83%. ఈ ఏడాది జనవరిలో కొత్త సిరీస్‌లో ద్రవ్యోల్బణ గణాంకాలను విడుదల చేయడం ప్రారంభించాక, సెప్టెంబరులో నమోదైన ద్రవ్యోల్బణమే ఇప్పటివరకు ఎక్కువ. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 7.74 శాతానికి పెరిగింది. ఆగస్టులో ఇది 5.97 శాతమే. ద్రవ్యోల్బణం అధికంగా నమోదైన వస్తువుల్లో ఉల్లిపాయలు (108.09%), వెండి ఆభరణాలు (87.8%), అల్లం (62.85%), వెల్లుల్లి (54.62%), నిమ్మకాయలు (36.41%) ఉన్నాయి. బంగాళదుంపలు, టమాటాలు, మోటార్‌కార్‌లు, జీపులు, బెండ, కొబ్బరికాయల్లో క్షీణత (ప్రతి ద్రవ్యోల్బణం) కొనసాగింది. సెప్టెంబరులో పట్టణ ప్రాంతాల్లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 6.08% కాగా.. గ్రామీణ ప్రాంతాల్లో 4.88 శాతంగా నమోదైంది. అధిక ద్రవ్యోల్బణం నమోదైన మొదటి 5 రాష్ట్రాల్లో తమిళనాడు, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. మిజోరాంలో అత్యల్ప ద్రవ్యోల్బణం ఉంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో రేటును 0.25% పెంచి 5.50% చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది వర్షపాతం బలహీనంగా ఉన్నందున, రాబోయే నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం అధిక స్థాయుల్లోనే కొనసాగొచ్చని క్రిసిల్ ముఖ్య ఆర్థికవేత్త దీప్తి దేశ్‌పాండే అంచనా వేశారు.

# 21% పెరిగిన హెచ్‌సీఎల్ టెక్ లాభం




దేశ ఐటీ దిగ్గజ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.5,132 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2025-26 ఇదే కాల లాభం రూ.4,235 కోట్ల కంటే ఇది 21.18% అధికం. అడ్వాన్స్‌డ్ ఏఐ (కృత్రిమమేధ) కార్యకలాపాల మార్జిన్లు అధికంగా ఉండటం ఇందుకు కారణం. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.31,942 కోట్ల నుంచి 11.5% పెరిగి రూ.35,620 కోట్లకు చేరింది. త్రైమాసికం వారీగా చూస్తే నికరలాభం 11%, నికర ఆదాయం 3% పెరిగాయి. స్థిర కరెన్సీలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను 2.5 - 4 శాతానికి సంస్థ సవరించింది. ఇంతకు ముందు అంచనా 1-4%. ఆర్డర్లు బాగుండటం, ఏఐ ఆధారిత సేవలకు గిరాకీ ఇందుకు కారణమని సంస్థ ఎండీ, సీఈఓ సి.వి జయ్‌కుమార్ తెలిపారు. ఏడాది వ్యవధిలో ఐటీ, వాణిజ్య సర్వీసుల ఆదాయం రూ.23,693 కోట్ల నుంచి రూ.26,938 కోట్లకు చేరింది. ఇంజినీరింగ్-ఆర్అండ్‌డీ సేవల ఆదాయం రూ.5,423 కోట్ల నుంచి రూ.5,973 కోట్లకు పెరిగినా, హెచ్‌సీఎల్ సాఫ్ట్‌వేర్ ఆదాయం మాత్రం రూ.2,826 కోట్ల నుంచి రూ.2,709 కోట్లకు తగ్గింది.

సమీక్షా త్రైమాసికంలో 3.3 బి.డా. (సుమారు రూ.31,700 కోట్ల) కొత్త ఆర్డర్లు లభించాయి. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే, ఇవి 27% అధికం. కంపెనీ చరిత్రలోనే ఇవి రెండో అత్యధికమని సంస్థ పేర్కొంది. అడ్వాన్స్‌డ్ ఏఐ ఆదాయాలు ఏడాది క్రితంతో పోలిస్తే, 78% పెరిగి 219 మి.డా.కు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10,000 మంది తాజా ఉత్తీర్ణులను కంపెనీలో చేర్చుకుంటామని కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామ్‌సుందర రాజన్ తెలిపారు. సెప్టెంబరు త్రైమాసికంలో చేరిన 6,450 మందితో కలిసి సెప్టెంబరు చివరకు హెచ్‌సీఎల్ టెక్ సిబ్బంది సంఖ్య 2,30,339కి చేరింది. వీరిలో ఫ్రెషర్లే 6,136 మంది ఉన్నారు. ఏప్రిల్-జూన్‌లో 3,292 మంది సిబ్బంది తగ్గిన సంగతి విదితమే. సిబ్బంది వలసలు 12.8 శాతంగా ఉన్నాయి. గ్రీన్‌కార్డుల కోసం ఇటీవలి సంవత్సరాల్లో అతి తక్కువగా దరఖాస్తు చేస్తున్నందున, అమెరికా తాజా ఆంక్షలు ఏమీ ఇబ్బంది పెట్టవని రాజన్ పేర్కొన్నారు.

రూ.12 మధ్యంతర డివిడెండ్: ప్రతి షేరుకు రూ.12 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. ఇందుకు ఈనెల 16ను రికార్డు తేదీగా ప్రకటించింది. మార్కెట్ నష్టపోయినా, హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్ఈలో 0.47% లాభపడి, రూ.1,220 వద్ద స్థిరపడింది.

క్లాడ్ ఏఐ (కృత్రిమమేధ) సాంకేతికతను ఉపయోగించి, ఎంటర్‌ప్రైజ్ క్లయింట్ల కోసం ఏజెంటిక్ ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి అమెరికా సంస్థ ఆంత్రోపిక్‌తో కలిసి ప్రత్యేక వ్యాపార విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ ప్రకటించింది. తమ సాఫ్ట్‌వేర్ విభాగం ఎంపిక చేసిన ఉత్పత్తుల్లో ఈ ఏఐ మోడళ్లను అనుసంధానం చేస్తుందనీ వివరించింది. పరిమిత మానవ జోక్యంతో, వివిధ పనులను స్వయంగా నిర్వహించగల ఏజెంటిక్ ఏఐ వ్యవస్థలను సంస్థలు స్వీకరించేలా చేయడంపై ఈ భాగస్వామ్యం దృష్టి సారించనుంది.




## సింధుకు సవాల్!



భారత షట్లర్లు మరో సవాలుకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడలు, ఆర్కిటిక్ ఓపెన్‌లో విఫలమైన మన ప్లేయర్లు మంగళవారం ఆరంభమయ్యే డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో అదృష్టం పరీక్షించుకోనున్నారు. స్టార్ ప్లేయర్ పి.వి.సింధుకు తొలి రౌండ్లోనే కఠిన పరీక్ష ఎదురుకానుంది. మహిళల సింగిల్స్‌లో ఆమె ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సియాంగ్ (కొరియా)ను ఢీకొంటుంది. ఆమెతో 10 మ్యాచ్‌ల్లో సింధు ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. ఆసియా క్రీడల్లో తొలి రౌండ్లోనే ఓడిన లక్ష్యసేన్ మూడో సీడ్ చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య టైటిల్ పోరును ప్రారంభించనున్నాడు. ఆయుష్ శెట్టి.. అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో తొలి రౌండ్లో తలపడనున్నాడు. 2017 డెన్మార్క్ ఓపెన్ విజేత కిదాంబి శ్రీకాంత్.. మెర్కిల్ (ఫ్రాన్స్)ను ఢీకొంటాడు. చైనా మాస్టర్స్ విజేతగా నిలిచిన సాత్విక్ సాయిరాజు - చిరాగ్ శెట్టి ద్వయం పురుషుల డబుల్స్ తొలి మ్యాచ్‌లో జి టింగ్, జియాంగ్ యు (చైనా) జోడీని ఎదుర్కొంటుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ - ట్రీసా జాలీ జంట ఫెయ్ చెన్, పెయ్ షాన్ (చైనీస్ తైపీ)తో పోరుతో టోర్నీని ఆరంభించనుంది.

# టెన్నిస్‌లో కొత్త ఆశలు రేపుతున్న మాయ



భారత్‌లో మహిళల టెన్నిస్.. ఈ పేరు చెప్పగానే గుర్తొకొచ్చేది సానియా మీర్జానే! ఎన్నో ఘనతలు సొంతం చేసుకున్న ఈ హైదరాబాదీ స్టార్.. ఈ ఆటలో తనదైన ప్రమాణాలు నెలకొల్పింది. ఆమె వీడ్కోలు తర్వాత ఎన్నో పేర్లు వినిపించాయి.. కానీ ఎవరూ సానియా స్థాయిని అందుకోలేకపోయారు. ఇప్పుడో యువ కెరటం దూసుకొచ్చింది. పేరు మాయ రేవతి రాజేశ్వరన్. పోర్చుగల్‌లో జరిగిన డబ్ల్యూ34 లాగోస్ టోర్నీలో గెలిచి.. ప్రొఫెషనల్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన పిన్న వయస్కురాలైన భారత క్రీడాకారిణిగా సానియా మీర్జా రికార్డును అధిగమించింది. టెన్నిస్‌లో కొత్త ఆశలు రేపుతున్న మాయ.

సరదాగా మొదలైన ఆట పట్ల మాయ ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తుండటంతో ఆమె కుటుంబం కూడా అండగా నిలిచింది. ఆమెకు మంచి శిక్షణ ఇప్పించింది. రెండేళ్ల తర్వాత మాయ స్కూల్ వదిలి ఇంట్లోనే ట్యూషన్ ద్వారా చదువుకుంటూ ఆటను కొనసాగించింది. ప్రో సర్వ్ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్‌పై పట్టు సంపాదించిన మాయ.. ఐటీఎఫ్ జూనియర్ టోర్నీల్లో సత్తా చాటింది. 2023లో చెన్నై ఓపెన్, హైదరాబాద్ ఓపెన్, మలేసియా ఓపెన్‌లను ఖాతాలో వేసుకుంది.

2025లో ప్రొఫెషనల్ ప్లేయర్‌గా మారిన మాయ.. ఆ ఏడాదే యుఎస్ ఓపెన్‌తో జూనియర్ గ్రాండ్‌స్లామ్‌లో అరంగేట్రం చేసింది. తొలి టోర్నీలో ఆమె రెండో రౌండ్ వరకు వెళ్లింది. ఈ సీజన్లో జూనియర్ ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్లో ఆడింది. ఫ్రెంచ్ ఓపెన్, యుఎస్ ఓపెన్లో రెండో రౌండ్ చేరింది. సింగిల్స్‌తో పోలిస్తే డబుల్స్‌లో ఉత్తమ ప్రదర్శన చేసింది. 2026 జూనియర్ యుఎస్ ఓపెన్లో సెమీఫైనల్, వింబుల్డన్‌లో క్వార్టర్‌ఫైనల్ దశకు చేరింది. తాజాగా లాగోస్ టోర్నీలో క్వాలిఫయర్‌గా బరిలో దిగి సింగిల్స్, డబుల్స్ టైటిళ్లతో అదరగొట్టింది. సింగిల్స్ ఫైనల్లో సెలీనా సెర్వినో (స్పెయిన్)ను ఓడించి ట్రోఫీ గెలిచిన మాయ.. డబుల్స్‌లో యెల్‌జావెటా (ఉక్రెయిన్) జతగా టైటిల్ కైవసం చేసుకుంది. ''ప్రొ కెరీర్‌లో తొలి టైటిల్ గెలిచా. ఇది ఆరంభం మాత్రమే. రాబోయే టోర్నీల్లో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు లాగోస్ టైటిల్ ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది. ఈ టోర్నీలో ఎలాంటి అంచనాలు లేకుండా బరిలో దిగి సత్తా చాటగలిగాను. ఇక మరిన్ని ఎక్కువ ప్రో టోర్నీలు ఆడాలి. సానియా ఓ దిగ్గజం. ఆమే నా ఆరాధ్యం'' అని మాయ చెప్పింది.

గత సీజన్లో ఇండియా ఓపెన్, జర్మనీ ఓపెన్, ఈ ఏడాది ఫ్రాన్స్, బాంబెర్గ్ టైటిళ్లతో టెన్నిస్ ప్రపంచానికి తానేంటో చాటింది. డబుల్స్‌లోనూ గత మూడేళ్లలో ఆరు టైటిళ్లు గెలుచుకుంది. దూకుడుగా ఆడడం మాయ శైలి. సానియా మాదిరిగా శక్తిమంతమైన ఫోర్‌హ్యాండ్ ఆమె అమ్ములపొదిలో ప్రధాన అస్త్రం. బలమైన సర్వీసులు మాయ సొంతం. 2025లో డబ్ల్యూటీఏ 125 టోర్నీలో ఇర్యానా షిమనోవిచ్, జరీనా డియాస్, మెయ్ యమగూచి లాంటి టాప్ ప్లేయర్లను ఓడించి సెమీఫైనల్ చేరిన ఈ చెన్నై అమ్మాయి.. స్పెయిన్‌లోని రఫా నాదల్ అకాడమీలో శిక్షణ పొందే అవకాశాన్ని దక్కించుకుంది. ఈ అకాడమీలో శిక్షణ భారత టీనేజర్‌ను మరింత రాటుదేల్చింది.

# రోహిత్, కోహ్లీ మాత్రమే ఆడితే సరిపోదు: మహమ్మద్ కైఫ్




''2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయం సాధించాలంటే స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలపైనే ఆధారపడితే సరిపోదు. బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవడం చాలా కీలకం'' అని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. వన్డే ప్రపంచకప్ టోర్నీకి రో-కో ఎంపికపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోన్న వేళ కైఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

''దక్షిణాఫ్రికాలో పరిస్థితులు ఇప్పుడు చాలా మెరుగయ్యాయి, అక్కడ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లే ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి.. బౌలర్లు మ్యాచ్‌లను శాసిస్తారని అనుకోవడం లేదు. నా ఉద్దేశంలో బ్యాటర్లదే ఆధిపత్యం. అలాంటి పరిస్థితుల్లో అత్యుత్తమ బౌలర్లు ఉన్న జట్టే బాగా రాణించగలదు'' అని కైఫ్ పేర్కొన్నాడు.

రోహిత్, కోహ్లీ జట్టుకు కీలకమైన ఆటగాళ్లని.. అయితే ప్రపంచకప్ గెలవాలంటే వారితో పాటు ఇతర ఆటగాళ్లూ రాణించాలని కైఫ్ తెలిపాడు. 2003 ప్రపంచకప్ టోర్నీలో భారత్ ఫైనల్‌కు చేరిన సందర్భాన్ని అతడు గుర్తుచేశాడు. ఆ టోర్నీలో సచిన్, యువరాజ్ సింగ్, రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ బ్యాటింగ్‌లో మంచి ప్రదర్శన చేశారని చెప్పారు. బౌలింగ్‌లో ఆశిష్ నెహ్రా, జహీర్ ఖాన్, శ్రీనాథ్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. విదేశాల్లో ప్రపంచకప్ గెలవాలంటే సమష్టి ప్రదర్శన అవసరమని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

# అతణ్ని ఆపేందుకు..




వెస్టిండీస్‌తో వరుసగా రెండు వన్డేలు గెలిచి సిరీస్ సాధించిన భారత్.. సిరీస్ క్లీన్‌స్వీప్ చేస్తుందనే అంతా అనుకున్నారు. కానీ మూడో మ్యాచ్‌లో 351 పరుగులు సాధించినా ఓటమి తప్పలేదు. ఆ తర్వాత టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచినా పరాజయం ఎదురైంది. ఆ రెండు మ్యాచ్‌ల్లో టీమ్ఇండియా విజయానికి అడ్డుపడింది ఒక్కడే. ఆ జట్టు కెప్టెన్ షై హోప్. మూడో వన్డేలో అజేయంగా 162 పరుగులు చేసిన అతడు.. రెండో టీ20లోనూ అజేయ సెంచరీ (102 నాటౌట్)తో జట్టును ముందుండి గెలిపించాడు. షై హోప్‌కు చెక్ పెట్టడానికి మూడో టీమ్ఇండియా స్పష్టమైన వ్యూహంతో బరిలోకి దిగిందని ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ అన్నాడు. అర్ష్‌దీప్ మూడు వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ప్రమాదకర ఓపెనర్ హోప్‌ను అతడు 5 పరుగులకే ఔట్ చేశాడు. రూథర్‌ఫర్డ్ (32)ను కూడా అర్ష్‌దీపే వెనక్కి పంపాడు. ''మ్యాచ్‌కు ముందు షై హోప్‌ను కట్టడి చేయడానికి ఓ వ్యూహం సిద్ధం చేశాం. అది మంచి ఫలితాన్నిచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రణాళికలో కోచ్‌లది కీలక పాత్ర. వ్యూహాన్ని పక్కాగా అమలు చేశాం. మొత్తంగా మా బౌలింగ్ బాగుంది. మరోవైపు నుంచి మయాంక్ యాదవ్ ఒత్తిడి పెంచాడు.

# 'లింక్డిన్'లోకి కోహ్లీ ఎంట్రీ..?

టీమ్ఇండియా స్టార్ క్రికెటర్, అభిమానులు ముద్దుగా 'కింగ్' అని పిలుచుకునే విరాట్ కోహ్లీ.. ఆటలోనే కాదు సంపదలోనూ రారాజే..! ఓవైపు మైదానంలో పరుగుల వరద పారిస్తూనే.. వ్యాపారాల్లోనూ సత్తా చాటుతున్నాడు. తాజాగా అతడు 'లింక్డిన్'లోకి అడుగుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మాధ్యమంలో ఖాతా తెరిచిన కోహ్లీ.. దార్శనికతపై సుదీర్ఘ పోస్ట్ పెట్టాడు. ''భారత్‌లో ప్రతి క్రీడనూ ఆదరించి, ఆస్వాదించే రోజులు రావాలని నేనెప్పుడూ కోరుకుంటాను. ఇప్పుడు ఆ రోజుకు మరింత దగ్గరవుతున్నట్లు అనిపిస్తోంది. మన దేశం ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారుచేయగలదని, అంతర్జాతీయ వేదిక కోసం బ్రాండ్‌లను సృష్టించగలదని కొత్త తరం నిరూపిస్తోంది. భారత్ ఓ సమగ్ర క్రీడా వేదికను నిర్మించగలదనే నమ్మకం కలుగుతోంది. ఇకపై మనం ప్రపంచ వేదిక మీద కేవలం పాల్గొనడం మాత్రమే కాదు.. అంతర్జాతీయ టోర్నీల భవిష్యత్తును తీర్చిదిద్దగలమని విశ్వసిస్తున్నా. సరిహద్దులను చెరిపేసి, ఉన్నత ప్రమాణాలతో విభిన్న ప్రయత్నాలకు సాహసించినప్పుడే వృద్ధి చేకూరుతుందని నా కెరీర్‌లో నేర్చుకున్నా'' అని కోహ్లీ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చాడు.

స్పోర్ట్స్ బ్రాండ్ 'అజిలిటాస్'లో విరాట్ పెట్టుబడులు పెట్టిన సంగతి తెలిసిందే. ఇక, స్పోర్ట్స్‌వేర్ 'వన్8వరల్డ్'కు సహవ్యవస్థాపకుడిగా ఉన్నాడు. ఈ సంస్థల గురించి కూడా కోహ్లీ తన పోస్ట్‌లో ప్రస్తావించాడు. వీటితో పాటు ఆరోగ్యానికి, పోషకాహారానికి సంబంధించిన పలు సంస్థల్లోనూ అతడికి పెట్టుబడులున్నాయి.



# వుదయం సినిమా MOVIE TIME!

# "రణబాలి" జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలను కలిసిన తమిళనాడు సీఎం, థళపతి విజయ్



**వుదయం సినిమా:** తమ చిత్రం #Ranabaali విడుదలకు ముందు స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమిళనాడు ముఖ్యమంత్రి, థళపతి విజయ్‌ను కలిశారు. ఎంతో బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ సీఎం విజయ్ ఈ జంటకు ఆత్మీయ స్వాగతం పలికి, వారితో కొంత సమయం గడిపారు.ఈ సమావేశంలో సినిమా, జీవితం, ప్రపంచానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను ముగ్గురూ పంచుకున్నారు. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలతో సీఎం విజయ్ సమావేశమైన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఈ ప్రత్యేకమైన భేటీపై హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.విజయ్ దేవరకొండ స్పందిస్తూ.."థళపతి, సీఎం విజయ్ గారితో ఎంతో అందమైన సమయాన్ని గడిపాను. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆయన మమ్మల్ని ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించి, తన ప్రేమను పంచుకున్నారు. జీవితం, పని, ప్రపంచం గురించి ఎన్నో వ్యక్తిగత విషయాలను మాతో పంచుకున్నారు. ఆయనను ఒక్కసారి కలిసినప్పుడే మరింత అభిమానించే వ్యక్తిగా మారిపోయారు. థ్యాంక్యూ విజయ్ సార్!" అని విజయ్ దేవరకొండ తన సంతోషాన్ని పంచుకున్నారు.విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన #Ranabaali అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# "క్రేజీ కల్యాణం" యూనివర్సల్ ఎమోషన్స్ ఉన్న సినిమా




విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న "క్రేజీ కల్యాణం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు యంగ్ హీరో అఖిల్ రాజ్.- ప్రొడ్యూసర్ జగన్ మోహన్ రెడ్డి గారి నిర్మాణంలో విందు భోజనం అనే సినిమా చేశాను. అప్పటి నుంచి ఆ సంస్థతో, వారితో టచ్ లో ఉంటూ వచ్చాను. క్రేజీ కల్యాణం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నప్పుడు పిచ్ డెక్ లో ఈ సినిమాలోని ఉదయ్ పాత్రకు నన్ను అనుకున్నారు. అప్పటికి ఇంకా ఈ సినిమా కాస్టింగ్ లోకి ఎవరూ కన్ఫర్మ్ కాలేదు. ఉదయ్ క్యారెక్టర్ నువ్వు చేస్తావా అని డైరెక్టర్, ప్రొడ్యూసర్ అడిగారు. చేస్తానని చెప్పాను. ఆ తర్వాత నరేష్ గారు, అనుపమ, తరుణ్ భాస్కర్..ఇలా వీళ్లంతా కాస్టింగ్ కన్ఫర్మ్ అయ్యారు. అప్పుడు ఫుల్ స్క్రిప్ట్ నాకు పంపారు. స్క్రిప్ట్ చదువుతూ ఫుల్ ఎంజాయ్ చేశాను. నరేష్ గారు, తరుణ్ భాస్కర్ గారి క్యారెక్టర్స్ నాకు బాగా నచ్చాయి. తరుణ్ భాస్కర్ చేసిన బాలరాజు క్యారెక్టర్ హిలేరియస్గా అనిపించింది. నాక్యారెక్టర్ కు ఫన్అండ్లవ్ సీన్స్ ఉంటాయి. నరేష్, తరుణ్ భాస్కర్ క్యారెక్టర్స్ కు ధీటుగా నా క్యారెక్టర్ ను పర్ఫార్మెన్స్ తో నిలబెట్టాలని అనుకున్నాను. నన్ను ఏం ఆశించి బద్రప్ప అన్న తీసుకున్నాడో గానీ వందశాతం ఉదయ్ గా కనిపించేందుకు ప్రయత్నించాను. రాజు వెడ్స్ రాంబాయి రిలీజ్ కు ముందే ఈ చిత్రంతో నరేష్ గారు, అనుపమ, తరుణ్ భాస్కర్ తో కలిసి నటించే అవకాశం రావడం హ్యాపీగా ఫీలవుతున్నా.

**వుదయం సినిమా:** 'నవర సరాయ' డా. నరేష్

# 'హైడ్ & సిల్క్' టైటిల్ లాంచ్

**వుదయం సినిమా:** 'మండాడి' బ్లాక్‌బస్టర్ విజయంతో జోష్‌లో ఉన్న యంగ్ హీరో సుహాస్ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. రాజేంద్ర బాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో ఆయన కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. తమిళం, మలయాళంలో ఇప్పటికే 18 సినిమాలను నిర్మించిన స్టోన్



బెంచ్ స్టూడియో అధినేత కార్తికేయన్ సంతానం.. ఈ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. నాలుగు సినిమాలతో తెలుగులో తన నిర్మాణ ప్రయాణాన్ని ప్రారంభించనున్న ఆయన, ఈ ప్రాజెక్ట్ కోసం మిస్రిలాల్ పిక్చర్స్ వర్తికా జైన్‌తో చేతులు కలిపారు. 'లబ్బర్ పందు', 'డీసీ' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న సంజన కృష్ణమూర్తి ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'హైడ్ & సిల్క్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ వీడియోలో సుహాస్ చీర నేస్తూ కనిపిస్తారు. ఆయనకు తోడుగా సీనియర్ నటుడు తనికెళ్ల భరణి ఇంటెన్స్ వాయిస్ వినిపిస్తుంది. ఆయన చెప్పే భావోద్వేగపూరితమైన మాటలు ఓ కవితాత్మక ఆలోచనను ఆవిష్కరిస్తాయి. ప్రతి చీర ఓ అమ్మాయిని ఎంచుకుంటుంది, దాని అందం కేవలం నేతప

# పవర్ స్టార్ కొత్త ప్రాజెక్ట్ వచ్చే ఏడాదే!



**వుదయం సినిమా:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు కొత్త సినిమా అప్ డేట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ఓజీ 2 ఎప్పుడు మొదలవుతుంది? ఇంకా ఎలాంటి కొత్త కథలకు కమిట్ అయ్యారు? వాటి దర్శకులు ఎవరు? ఇలా ఎన్నో అంశాలపై పీకే క్లారిటీ ఇస్తారని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ ఆ అప్ డేట్ ఇప్పట్లో వచ్చే లా కనిపించలేదు. ప్రస్తుతం పవన్ పూర్తిస్థాయి రాజకీయ కార్యకలాపాల్లో బిజీగా ఉండటంతో పవన్ కళ్యాణ్ ఏ కొత్త సినిమాను ప్రారంభించినా అది వచ్చే ఏడాదే ఉంటుందని ఆయన సన్నిహిత వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ప్రజా సేవకే తొలి ప్రాధాన్యమిస్తూ రాజకీయ షెడ్యూళ్లకు అనుగుణంగానే పీకే ప్రాజెక్టులను ప్లాన్ చేసుకోవాలనే యోచనలో పవన్ ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయం స్థానిక సంస్థల ఎన్నికల హడావుడితో వేడెక్కింది. ఈ నేపథ్యంలో జనసేన అధినేతగా పవన్ కళ్యాణ్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై, ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేయడంపై పూర్తి దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు, నాయకులతో సమావేశాలతో ఆయన షెడ్యూల్ అత్యంత బిజీగా మారింది. దీంతో ప్రస్తుతానికి కొత్త సినిమాల షూటింగ్‌లకు లేదా ప్రారంభోత్సవాలకు సమయం కేటాయించడం కష్టంగా మారింది.ఇప్పటికే దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం OG సీక్వెల్ అయిన OG2' అధికారికంగా ఖరారైన సంగతి తెలిసిందే. మొదటి భాగంపై ఉన్న అంచనాల నేపథ్యంలో సీక్వెల్‌కు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లాలన్నా? పవన్ సెట్స్‌లో అడుగుపెట్టాలన్నా? వచ్చే ఏడాది వరకు ఆగాల్సిందేనని పరిశ్రమలో ప్రచారం జరుగుతోంది.

# 'M3' షూటింగ్ పూర్తి

**వుదయం సినిమా:** శివాజీ ప్రధాన పాత్రలో STBL సినిమాస్ నిర్మాణ సంస్థ తొలి చిత్రంగా తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ పూర్తయింది. రవికృష్ణ, కసిరెడ్డి, భరణ్, ఖుష్బూ, రాధ్య, మౌనిక కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్ 'M3'. 72 రోజుల పాటు సాగిన షూటింగ్‌ను చిత్ర యూనిట్ విజయవంతంగా పూర్తి చేసింది.షూటింగ్ పూర్తయిన సందర్భంగా విడుదల చేసిన ఈ పోస్టర్‌లో శివాజీ సంప్రదాయ దుస్తుల్లో హుందాగా కనిపించారు. శివాజీ పాత్ర ఎలా ఉండ



బోతోందన్న ఆసక్తిని ఈ లుక్ మరింత పెంచుతోంది.STBL Cinemas సంస్థ ద్వారా బాలాజీ V.R. దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని మంచి యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు.కుటుంబ కథా చిత్రాలు తగ్గుతున్న ప్రస్తుత రోజుల్లో, కుటుంబంలోని ప్రతి ఒక్కరూ కలిసి చూసి ఆనందించేలా, మంచి సందేశంతో పాటు ఆద్యంతం నవ్వులు పూయించే విధంగా ఈ సినిమాను తెరకెక్కించారు.ఈ చిత్రానికి ప్రవీణ్ కె. పోతునూరి సంగీతం అందిస్తునారు. వెంకట్ డీవోపీ గా పని చేస్తున్నారు. అశోక్ వడ్లమూడి, భాను మొగలిపువ్వ మాటలు అందిస్తున్నారు.ఈ సినిమాను డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడించనున్నారు.

# డివైన్ మిస్టరీ థ్రిల్లర్ అనౌన్స్‌మెంట్ ప్రొడక్షన్ నెం.3

**వుదయం సినిమా:** ఆది సాయి కుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ భారీ సినిమా ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. డివైన్ మిస్టరీ, సస్పెన్స్ తో కూడిన ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లనుంది. ప్రొడక్షన్ నంబర్ 3గా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ జి రుద్రప్ప నిర్మిస్తున్నారు. నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. దైవిక రహస్యాల నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా.. ఆధ్యాత్మికత, విశ్వాసం, ప్రాచీన నమ్మకాలు, అంతుచిక్కని రహస్యాలతో కూడిన విభిన్నమైన సినీ ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. అద్భుతమైన కథనం, బలమైన భావోద్వేగాలు, రణంతో పాటు ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అతీంద్రియ రహస్యాలతో ముడిపడిన కథను ఈ పోస్టర్ సూచిస్తోంది. పోస్టర్ మధ్యలో త్రిశూలం చుట్టూ చుట్టుకుని, భారీ నాగుపాము పడగ విప్పిన అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తోంది. దాని చుట్టూ కత్తులు, గొడ్డళ్లు, ఈటెలు, అర్ధచంద్రాకారంలో ఉన్న ఆయుధం, గద వంటి ప్రాచీన ఆయుధాలను అమర్చారు. ఇవి పోస్టర్‌కు మరింత గంభీరమైన, భయానకమైన రూపాన్ని అందిస్తున్నాయి. దట్టమైన చీకటితో నిండిన అడవిలోని పురాతన ఆచారాలు కలిగిన ప్రదేశాన్ని తలపించేలా పోస్టర్‌ను రూపొందించారు. వేలాడుతున్న గంటలు, మెలికలు తిరిగిన చెట్ల కొమ్మలు, వెలుగుతున్న దీపాలు మర్మమైన వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి. పోస్టర్ దిగువన రంగురంగుల పూల మధ్య కనిపించే చిన్న జ్వాల.. ముదురు నీలం, అగ్నిలాంటి ఎరుపు రంగులతో నిండిన విజువల్ ఆసక్తికరంగా వుంది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ డార్క్, మిస్టరీ వాతావ



ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ప్రేక్షకులకు మరపురాని థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ అందించడమే లక్ష్యంగా చిత్ర బృందం ఈ సినిమాను రూపొందిస్తోంది. ఈ సినిమా నెక్స్ట్ అప్‌డేట్‌ను అక్టోబర్ 20, 2026న వెల్లడించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో ఆది సాయికుమార్ భాగం కావడం సినిమాపై మరింతఆసక్తినిపెంచుతోంది. భారీ స్థాయిలో, ప్రత్యేకమైన విజువల్ స్టయిల్ లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

# 'ఈఎన్ఈ రిపీట్' కొత్త పోస్టర్ రిలీజ్

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కల్ట్ సీక్వెల్ 'ENE Repeat' లో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.2018లో విడుదలై కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు తెచ్చుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి సీక్వెల్‌గా 'ENE Repeat' రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నలుగురు యువకులు సూట్‌కేసులు, ట్రావెల్ బ్యాగులు, కెమెరా పరికరాలు, ఇతర లగేజీ మధ్య కనిపిస్తున్నారు. ప్రతి ఒక్కరి లుక్, హావభావాలు ప్రత్యేకంగా ఉండటంతో పోస్టర్ ఆసక్తికరంగా, వినోదాత్మకంగా కనిపిస్తోంది.విశ్వక్ సేన్ సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో బ్రౌన్ లెదర్ బ్యాగ్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. బ్లూ టీ-షర్ట్, కళ్లద్దాలతో ఉన్న వెంకటేష్ కాకుమాను సూట్‌కేసుకు ఆనుకుని ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఎడమవైపు ప్రొఫెషనల్ కెమెరా, ట్రైపాడ్ పట్టుకున్న శ్రీనాథ్ మాగంటి.. ఫిల్మ్ మేకింగ్‌లో తన పాత్రకు ఉన్న అనుబంధాన్ని సూచిస్తున్నారు. మధ్యలో గ్రీన్ షర్ట్‌లో ఉన్న అభినవ్ గోమఠం చేతిలో ఓ కాగితం పట్టుకుని ఆశ్చర్యపోయినట్లు కనిపిస్తున్నారు. పాత్రలు, లగేజీతో నిండిన ఈ పోస్టర్ గందరగోళం, కామెడీతో కూడిన కథను సూచిస్తూ ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ వివేక్‌గా, అభినవ్ గోమఠం కౌశిక్‌గా, వెంకటేష్ కాకుమాను ఉప్పిగా, శ్రీనాథ్ మాగంటి కార్తీక్‌గా అలరించనున్నారు. తొలి పార్ట్‌లో తమ స్నేహం, కామెడీతో యువ ప్రేక్షకులకు దగ్గరైన ఈ నలుగురి గ్యాంగ్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది.



# 'జయమ్ము నిశ్చయమ్మురా' సీజన్ 2..

**వుదయం సినిమా:** మన మనసులో నిలిచిపోయే సంభాషణలు చాలా సార్లు మనకు తెలిసిన విషయాలను దాటి, ఒక వ్యక్తిలోని అసలైన మనిషిని పరిచయం చేస్తాయి. జీ తెలుగు పాపులర్ సెలబ్రిటీ టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా విత్ జగపతి' రెండో సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్ తొలి ఎపిసోడ్‌కు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి అతిథిగా హాజరుకానున్నారు. సహజమైన నటనతో, ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో, అన్ని వర్గాల ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్న సాయి పల్లవి.. ఈ షో గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్‌లో సందడి చేయనున్నారు. మనసులోని మాటలను నిక్కచ్చిగా బయటకు తెలియజేసే సంభాషణలు, వ్యక్తిగత జ్ఞాపకాలు, ఆసక్తికరమైన విషయాలు, వినోదభరితమైన విశేషాలతో ఈ కొత్త సీజన్ ప్రేక్షకులను అలరించనుంది. ప్రముఖ నటుడు జగపతిబాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' షో.. వెండితెరపై కనిపించే తారల వ్యక్తిగత జీవితాల్లోని ఆసక్తికరమైన విషయాలను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తొలి సీజన్‌లో అక్కినేని నాగార్జున, శ్రీలీల వంటి ప్రముఖులు అతిథులుగా పాల్గొని, తమ వ్యక్తిగత జీవిత విశేషాలు, సినీ ప్రయాణం, అనుబంధాల గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.